# తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణం

సన్నాహక సమావేశ పత్రాలు

తెలంగాణ హిస్టరీ సొసైటీ

# Reconstruction of Telangana History

A collection of papers presented at the preparatory meeting (June 4, 2006) of Telangana History Society

December 2006

ముఖచిత్రం : దేవులపల్లి హనుమంతరావు

కంపోజింగు : సి. రాజశేఖర్


**ప్రతులకు** :

పరవస్తు లోకేశ్వర్

12-2-709/5/1/సి/1,

నవోదయ కాలనీ, మెహదీపట్నం,

హైదరాబాద్ - 500 026.

సహచర బుక్‌మార్క్, బాగులింగంపల్లి, హైదరాబాద్.

దిశ పుస్తక కేంద్ర, చిక్కడపల్లి, హైదరాబాద్.

నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్

**ముద్రణ** : చరిత ఇంప్రెషన్స్, అజామాబాద్, హైదరాబాద్-20. ఫోన్ : 2767 8411

## సూచిక :

1. ఆహ్వానం - తడకమళ్ళ వివేక్
2. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట చరిత్ర వక్రీకరణ - కె. జితేంద్రబాబు
3. తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణం ఆవశ్యకత- కొన్ని తక్షణ కర్తవ్యాలు- పరవస్తు లోకేశ్వర్
4. తెలంగాణ చరిత్ర రచనకు కొన్ని సూచనలు - డా. మలయశ్రీ
5. చరిత్ర రచన / నిర్మాణం- డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి
6. తెలంగాణ చరిత్రలోనైనా ముస్లింలకు న్యాయం జరగాలి- స్కైబాబ
7. తెలంగాణ చరిత్ర పునర్‌నిర్మాణం సమన్వయంతో జరగాలి- శ్రీధర్ దేశ్‌పాండే
8. తెలంగాణ పరిశోధన, గత అనుభవాలు- కె. శ్రీనివాస్
9. మరుగున పడేసిన చరిత్ర మర్మం చెబుదాం!- సంగిశెట్టి శ్రీనివాస్
10. 'బాధితుల' చరిత్రను రికార్డ్ చేయాలి- జె. సుభద్ర
11. వివక్ష, ఉపేక్షకు గురైన తెలంగాణ చరిత్రను పునర్నిర్మించాలి- ముదిగంటి సుజాతారెడ్డి
12. తెలంగాణ గురించి తెలియని నిజాలు- జి. వెంకట రామారావు
13. తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణ అవసరం సమస్యలు, అవకాశాలు- ఎన్. వేణుగోపాల్ 62
14. Reconstruction of Telangana History - Capt. L.Pandu Ranga Reddy
15. Telangana History- Need to connect the Loose Ends- Rapolu Anand Bhaskar

అనుబంధం :

జూన్ 4, 2006, తెలంగాణ హిస్టరీ సొసైటీ సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

## మనవి

"తెలంగాణా ప్రాంతంగా వ్యవహరింపబడుతున్న తొమ్మిది జిల్లాలలో చరిత్ర, శిల్పం, శాసనాలు, చిత్రలేఖనం, తాళపత్ర గ్రంధాలు, తటాకాలు, కోటలు, వీరగాధలు ఎన్నో ఉన్నాయి. సాహిత్యకారులు, కళావేత్తలు ఎందరో ఉన్నారు. అంతే గాక ఏండ్ల తరబడి కాలాన్ని తీర్చిదిద్దడానికి, దేశాన్ని పురోగమింప జేయడానికి ఎడతెగకుండా జరిపిన ఉద్యమాలున్నాయి". అంటూ తెలంగాణ ఆంధ్ర రాష్ట్రంలో విలీనమై ఆంధ్రప్రదేశ్ ఏర్పడుతున్నప్పడు 1956లో ప్రచురించిన 'తెలంగాణం' వ్యాస సంపుటానికి ముందుమాటగా వట్టికోటి ఆళ్వారుస్వామి రాశారు.

అంత ఘనమైన చరిత్ర గల తెలంగాణ చరిత్ర ఆ తర్వాత యాభై సంవత్సరాలలో మరింతగా విస్మరణకు గురయింది. వివక్షకు బలి అయింది. వక్రీకరణకు వేదిక అయింది. అంతకు ముందరి శతాబ్దాల చరిత్రలో తెలంగాణ ప్రాంతం, తెలంగాణ ప్రజలు సాధించిన అసాధారణ విజయాలన్నీ, నిర్మించిన వైభవోపేత చరిత్రంతా ఎక్కడా నమోదు కాని స్థితి వచ్చింది. నమోదయిన చోట అరకొరగా నమోదయింది. మేధోపూర్వకమైన వివరణ, చర్చ, విశ్లేషణ జరగకుండా పోయింది. ఇక 1956 తర్వాత గడిచిన యాభై సంవత్సరాలలోనయితే ఆంధ్రప్రదేశ్ చరిత్ర పేరిట విద్యార్థులకూ, సమాజానికీ అందిన చరిత్రలో తెలంగాణకు దక్కవలసిన న్యాయమైన వాటా దక్కనేలేదు. ఈ వివక్ష కారణంగా చరిత్ర రచనకు అత్యవసరమైన వనరుల, చారిత్రకాధారాల పరిరక్షణ కూడ పెద్ద సమస్యగా మారింది. నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణకు జరిగిన వివక్ష గురించి చర్చ జరుగుతున్నది గాని చరిత్ర రచనలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని గుర్తించేపని ఇంకా పూర్తిగా జరగడం లేదు.

ఈ అవగాహనతో, తెలంగాణ చరిత్రను తవ్వితీసి, పరిశోధించి, వెలుగులోకి తేవాలనే లక్ష్యంతో తెలంగాణ హిస్టరీ సొసైటీ ఏర్పరచాలని ప్రయత్నిస్తున్నాం. ఆ ప్రయత్నాలలో భాగంగా 2006 జూన్ 4న హైదరాబాదులోని ఫతేమైదాన్ క్లబ్బులో ఒక సన్నాహక సమావేశం ఏర్పాటు చేశాం. ఆ సమావేశానికి నలభై మందికి పైగా చరిత్ర పరిశోధకులు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు, తెలంగాణ అభిమానులు హాజరయి, అక్కడి చర్చలను విజయవంతం చేశారు. సమావేశంలో పాల్గొన్న వక్తల ప్రసంగవ్యాసాలను ఇక్కడ సంకలనం చేస్తున్నాం. ఆ సమావేశంలో పాల్గొని విలువైన ప్రసంగాలు చేసిన ప్రొ|| కె.మధుసూదన్‌రెడ్డి, ప్రొ|| పి.హరనాథ్‌గార్ల పత్రాలు అందని కారణంగా ఇక్కడ ప్రచురించలేక పోతున్నాం. ఇతర వక్తల పత్రాలను యధాతథంగా ప్రచురిస్తున్నాం. పత్రాల్లో వ్యక్తమైన అభిప్రాయాలతో సొసైటీకి ఏకీభావం ఉండనవసరం లేదు.

సొసైటీ ఏర్పాటు ప్రయత్నాలలో, ఈ పుస్తక ప్రచురణలో సహకరించిన మిత్రులందరికి కృతజ్ఞతలు. సొసైటీకి లోగో, ఈ పుస్తకానికి ముఖపత్ర రచన చేసిన దేవులపల్లి హనుమంతరావుగారికి, ఈ పుస్తక ప్రచురణకు తోడ్పడిన 'శ్రేయోభిలాషి'కి ప్రత్యేక కృతజ్ఞతలు.

-తెలంగాణ హిస్టరీ సొసైటీ

## ఆహ్వానం

- తడకమళ్ల వివేక్

మన చరిత్ర మనం రాసుకోవాల్సిన అవసరం వచ్చిందని మేం గట్టిగ నమ్ముతున్నం. మన ప్రాంతం గురించి, మన పూర్వికులు, ప్రజల స్థితిగతులు ఇంకా ఇట్లాంటి ఎన్నో సంగతులు మనకు తెల్వనీయకుండ కొందరు కుట్ర చేసిండ్రు. కొన్ని సంగతులు చరిత్రల చెప్పినప్పటికి వాటిని వక్రీకరించిండ్రు. వాండ్లు రాసిందే చరిత్ర అని మనకు చెప్పి చదివించిన్రు. శాన రోజుల వరకు మనం గూడ ఉండొచ్చు మన గతం యిదేనేమో అని నమ్మినం. మన పిల్లలకు యెనకటి సంగతులు మనం చెప్పలేని స్థితిల వున్నం. ఇప్పుడు కొన్నేళ్ల నుండి ఇట్లాంటి సంగతుల గురించి తెలుసుకొనే కోశిష్ చేస్తున్నం. మన వూరు, వాడ, ప్రభువులు, ప్రజలు, రాబడి, ఖర్చులు, కొలువులు, నదులు, నీళ్లు, పండుగలు, జాతరల గురించి మనం మాట్లాడుకుంటున్నం. కొందరు పుస్తకాలు రాస్తున్నరు. జరిగిన సంగతులు తెలుసుకున్న వాళ్లు ఇది అంత అన్యాయమని, ఊరుకున్ని రోజులు ఇట్లనే జరుగుతనే వుంటదని, దీనికి విరుగుడు సమైక్య రాష్ట్రం నుండి విడిపోవడమని, తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరుకుంటున్నారు. ఈ కోరికను ఎలక్షన్‌లప్పుడు ఓట్లేసి చెప్పతున్నరు.

ఈ సందర్భముల మేం కూడా మన చరిత్ర మనకు తెల్వాలని, ఆ సంగతులు ఎరుకైతనే మన ఉనికిని మనం కాపాడు కోగలుగుతమని ఆ విధంగా మన తెలంగాణ జాతి సజీవంగా ఉంటదని అనుకుంటున్నం. మన గొల్కొండ రాజుల గురించి, ఖుతుబ్‌షాహిల గురించి, నిజాంల గురించి మనకు స్కూల్లల్ల, కాలేజిల మనం తెలుసుకోవల్సినంత చెప్పలేదు. ఇక్కడి పోరాటాల గురించి, ప్రజల కోసం, వాళ్ల హక్కుల కోసం ప్రభువులను దిక్కరించిన వాండ్ల గురించి, ఎన్నో రంగాల్లో ఉన్న ప్రముఖుల గురించి మనం తెల్సుకోవలసినంత సమాచారం మనకు దొరకదు. మనకు ఎక్కువగా చెప్పింది ఏమిటంటే నిజాంలు నిరంకుశులని, మత ఛాందసులని. చారిత్రక సత్యాలు మరీ ఎక్కువగా

వక్రీకరింపబడ్డయని ఇప్పుడిప్పుడే తెలుస్తున్నవి. హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనం అయిన సంగతులు ఆ తర్వాత ఆఖరి నిజాం హొదా, ఆ నేపధ్యంలో జరిగిన హైదరాబాదు రాష్ట్ర అవతరణకు సంబంధించిన చాలా చారిత్రక సత్యాలు ఈ మధ్యనే కొన్ని వెలుగులోకి వచ్చినయి. చాలా విషయాలు ప్రభుత్వ రికార్డులలో ఉన్నవి. అయితే ఈ సత్యాలను ఒక దగ్గర చేర్చి చరిత్రను మళ్లీ రాయవలసిన అవసరం వచ్చింది. ఎందుకంటే ఇప్పుడు మనం చదువుతున్న చరిత్రలో నిజం మరుగై అణచివేత వాదుల వక్రీకరణ కనిపిస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ విషయానికి ఒస్తే అమరజీవిగా పిలువబడుతున్న పొట్టి శ్రీరాములు సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు పోరాడి అమరుడైనట్టుగ చరిత్ర చెప్తున్నది. ఈ విషయానికి ప్రభుత్వం కూడా అధికారిక ఆమోదం తెలిపినట్టు రాష్ట్ర అవతరణ ఉత్సవాలప్పుడు స్పష్టమవుతున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నవంబరు ఒకటి 1956న ఏర్పడిన విషయం అందరికి తెలుసు. పొట్టి శ్రీరాములు నాటి మద్రాసు రాష్ట్రం నుండి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఆందోళన జరిపి 1952 లోనే అమరుడైన సంగతి చారిత్రక సత్యం. అయితే ఆ ఆందోళన 1956లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు పితామహుడుగా భావింపబడటం ఎంతవరకు సమంజసం? చరిత్రలో జరుగుతున్న ఎన్నో వక్రీకరణలకు ఇది ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

అందుకే మన గతానికి సంబంధించిన సత్యాలు ఏమిటి, జరిగిన సంఘటనలు ఏమిటి, ఆ సంఘటనల నుంచి అసలు ఏమి జరిగిందని నిర్ధారణకు రావచ్చు, అనే అంశాల గురించి మనం పరిశోధించవలసిన అవసరం వున్నదని మేం అనుకుంటున్నం.

చరిత్ర సంఘటనల కూర్పుగా కనిపించినప్పటికి అన్ని సంఘటనలు చారిత్రిక సంఘటనలు కావు అనే విషయం మనకు తెలుసు. అందుకే చరిత్ర రాసే వాండ్లు వాళ్లకు కావలసిన సంఘటనలు మాత్రమే ఎంపిక చేసుకొని ఆ అవకాశాన్ని, ఆ స్వేచ్ఛను ఉపయోగించి చరిత్ర రాస్తారు. ఇప్పుడు మన ప్రాంతం చరిత్ర ఆ విధంగా ఇతరులు రాసినందు వల్ల ఆ స్వేచ్ఛ దుర్వినియోగం అయిందని మా అనుమానం.

అందుకే మనందరం కలిసి ఈ విషయం మీద మాట్లాడుకొని, బహస్ చేసి తొక్కి పెట్టిన సంఘటనలను, కొత్తగా వెలుగులోకి వచ్చిన సంఘటనలను అన్నిటిని కలిపి మన చరిత్రను రాసుకుందాం. చరిత్రలోని కొత్త కోణాలను బయటపెడదాం. మనందరి వ్యక్తిగత ఎనర్జీని సైనర్జీగా మార్చుదాం. అందుకే 4 జూన్ 2006 నాడు హైదరాబాదులోని ఫతేమైదాన్ క్లబ్బులో మీటింగు పెట్టినం.

చాలా మంది వచ్చిన ఆ సభలో కొందరు చదివిన పత్రాలను, చెప్పిన అభిప్రాయాలను ఈ పుస్తకం రూపంలో మీకు తెలియజేస్తున్నం. ఈ ప్రయత్నం మేము ఆశించిన తెలంగాణ హిస్టరీ సొసైటి స్థాపనకు తోడ్పడుతుందని అనుకుంటున్నం. మీరందరు ఈ ప్రయత్నంల శరీకైతరని అనుకుంటున్నం. ఈ కృషిలో భాగస్వాములు కావాలనుకున్న వ్యక్తులు ఈ పుస్తకం వెనుక ఉన్న సభ్యత్వ దరఖాస్తుని నింపి మాకు పంపించగలరని కోరుతున్నాము.

## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్ర- వక్రీకరణ

- కె. జితేంద్రబాబు

The future is dark, the present burdensome; only the past, dead and finished, bears contemplation. Those who look upon it have survived it. They are its product and its victors. No wonder, therefore, that men concern themselves with history. The desire to know what went before, the desire to understand the passage down time. These are common human attributes.

వర్తమానం వెలుగులో గతాన్ని అధ్యయనం చేయటానికి చేసే ప్రయత్నమే చరిత్ర. ఆ చరిత్ర రచనలో వ్యక్తి గత దృక్పథం తప్పని సరిగా ఉంటుంది. గతంలోని అంశాల్ని అధ్యయనం చేస్తున్నపుడు చరిత్రకారుల మధ్య కూడా ఆ అంశాలు పరావర్తనాన్ని చెందుతూనే ఉంటాయి. వాస్తవాలు, ప్రాధాన్యతలు చరిత్రకారుని భావజాలాన్ని బట్టి మారుతూనే ఉంటుంది. ముఖ్యంగా చరిత్రకారుడు తన సమకాలీన చరిత్ర రచనకు సంబంధించిన అంశాల్ని రచించేటప్పుడు తన దృక్పథం తప్పనిసరిగా ఆ రచనలో ప్రతిబింబిస్తూనే ఉంటుంది. సామాజిక కార్యచరణలో భాగస్వాములైన వ్యక్తులు రచించిన చరిత్రలోని ప్రతిఘట్టంలోనూ, వాస్తవాల ప్రాధాన్యతలోనూ, వారి వ్యక్తిగత దృక్పథం కొన్నిసార్లు ఎక్కువగా చొప్పించే అవకాశం కూడా ఉంది.

సామాజిక అభివృద్ధి చోదకశక్తుల, నిరోధక శక్తుల వ్యక్తిగత పాత్రల ప్రాధాన్యత కూడా చరిత్ర అధ్యయనంలో భాగమే. వారే చరిత్రకారులైతే ఆ చరిత్రను ఎలా అధ్యయనం చేయాలి? వారు రచించిన చరిత్రలోని వాస్తవాలను ఎలా గుర్తించాలి? సమకాలీన అంశాల్లో సంఘటన అభివృద్ధిలో, ఉద్యమాల్లో, రాజకీయాల్లో వివిధ పరిధుల్లో, పరిమితుల్లో తమ పాత్రను పోషించిన వారే ఆ చరిత్ర రచనకు ఉపక్రమిస్తే ఆ చరిత్రను మనం ఏ మేరకు వాస్తవ చిత్రీకరణగా గుర్తించాలి? వారు వాస్తవాల్ని గూర్చి ప్రత్యక్ష, పరోక్ష విశ్లేషణలు చేస్తూ తమ సమకాలీన చరిత్రను రచిస్తే వర్తమానాన్ని, భవిష్యత్తును

నిర్మించటానికి ఆ చరిత్ర ఏ మేరకు దోహదపడుతుంది? ఆ చరిత్ర వాస్తవాలను విశదీకరిస్తే ఆ చరిత్ర వాస్తవాలను ప్రకటించినప్పటికీ అది చరిత్ర అవుతుందా?

ఈలాంటి ఎన్నో అనుమానాలు మనం తెలంగాణలో జరిగిన సాయుధ పోరాట చరిత్రను గూర్చి రచించిన నాలుగు పుస్తకాలు అధ్యయనం చేస్తుంటే వస్తాయి. తెలంగాణలో 1944లో ప్రారంభమైన భూస్వామ్య వ్యతిరేక పోరాటం, నిజాం వ్యతిరేక పోరాటం, ఫ్యూడలిజాన్ని, భూస్వామ్యవిధానాన్ని బలపరిచిన కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం 1951 వరకు సాగింది. ఈ పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నవారు, పాల్గొననివారు, పర్యవేక్షించినవారు, పోరాట ఫలితాల్ని స్వంతం చేసుకోవడానికి ప్రయత్నించినవారు, పోరాటాన్ని, అనుభవాల్ని, జ్ఞాపకాల్లో, చరిత్రను గ్రంథస్తం చేసారు. వారు తమతమ గ్రంథాల్లో తమ భావజాలానికి అనుగుణంగా, తమ రాజకీయాలకు అనుగుణంగా వివిధ రకాలైన విశ్లేషణలను చేస్తూ, తెలంగాణ సాయుధ పోరాట ఘట్టాల్ని, అందించారు. తెలంగాణ ప్రజలు సాయుధ పోరాట రూపాల్ని స్థానిక పరిస్థుతులనుగుణంగా, సృష్టించుకొని కొనసాగించిన విషయాన్ని విస్మరించి తమ గ్రంథాల్లో తమ పాత్రను, ఉద్యమ స్వరూపాన్ని, విశ్లేషించబూనుకొని నాయకత్వ స్థానాల్ని పదిల పరుచుకోజూశారుగాని వాస్తవాల్ని చిత్రించ ప్రయత్నించలేదు. తాము తీసుకున్న తప్పుడు విధానం, కార్యాచరణ ఫలితంగా వచ్చిన ఆటు పోట్లను విశ్లేషించలేదు. తమ అనుభవ లోపం వల్ల ఉద్యమానికి వచ్చిన నష్టాన్ని వివరించలేదు. తెలంగాణలో ప్రజలు జరిపిన పోరాటం భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా, దేశముఖ్‌లకు వ్యతిరేకంగా, వారి దౌర్జన్యాలను ప్రతిఘటిస్తూ వారి లక్షల ఎకరాల భూమిని వ్యవసాయ కూలీలను, పేద రైతులకు పంచుతూ జరిపిన వ్యవసాయక విప్లవం గాని నిజాం రాజ్యంలో కాంగ్రెస్ రాజ్యాన్ని స్థాపించడానికి జరిపిన పోరాటం కాదని గుర్తించలేదు. ఈ గ్రంథాలు రచించిన వారందరు దాదాపు నిజాం పాలనపోయి కాంగ్రెస్ పాలన రావాలని కోరిన వారు గాని వ్యవసాయ కూలిలతో, కార్మికులతో, ప్రజా ప్రభుత్వ ఏర్పడాలని కాంక్షించిన వారుగాదు.

తెలంగాణ సాయుధ పోరాటం పై వచ్చిన గ్రంథాలను సంక్షిప్తంగా పరిశీలించిన మొదటి గ్రంథం చంద్రపుల్లారెడ్డి 1969లో 'మహత్తర వీరోచిత తెలంగాణ పోరాటం' అను పేరుతో రచించాడు. ఇతనికి తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్ష సంబంధం లేనప్పటికి, ప్రధాన పాత్ర పోషించనప్పటికి, తాను 1969 తర్వాత ఏర్పాటు చేసిన భారత కమ్యూనిస్టు పార్టీ (మా.లె) స్థాపనకు అనుగుణంగా, తన భావజాలాన్ని, రాజకీయాలను స్థిరీకరించుకొనే సందర్భంలో రచించాడు.

ప్రజా యుద్ధంలో సాయుధ వ్యవసాయక విప్లవ పోరాటం ప్రధాన పోరాటంగా ఉంటుందని తెల్పటానికి ఈ గ్రంథం రచించాడు. తరువాత వచ్చిన గ్రంథం పుచ్చలపల్లి సుందరయ్య 1972 డిసెంబరులో రచించిన 'తెలంగాణ పీపుల్స్ స్ట్రగుల్ అండ్ ఇట్స్ లెసన్స్'. ఈ గ్రంథం మే 1973లో 'వీర తెలంగాణ విప్లవ పోరాటం- గుణపాఠాలు' అను పేరుతో తెలుగులో అనువదించబడి ఆంధ్రప్రదేశ్‌లో విడుదల చేయబడింది.

ఈ గ్రంథ రచనకు కొంత నేపథ్యం ఉంది. 1968లో ప్రారంభమైన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్‌లో సంక్షోభాన్ని సృష్టించింది. ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న కాసు బ్రహ్మానందరెడ్డి, తెలంగాణ ఉద్యమాన్ని శాంతి భద్రతల సమస్యగా పరిగణించి పాశవికమైన దాడులతో ఉద్యమాన్ని అణచ ప్రయత్నించాడు. 1968లోనే మర్రి చెన్నారెడ్డి ఎన్నిక చెల్లదని కోర్టు తీర్పునివ్వడంతో పాటు ఆరు సంవత్సరాలు ఎన్నికలలో పోటికి అనర్హుడైనాడు. సుప్రీం కోర్టునాశ్రయించిన చెన్నారెడ్డికి అక్కడ చుక్కెదురవడంతో రాష్ట్రంచేరి 'తెలంగాణ ప్రజా సమితి' అధ్యక్ష పదవి చేజిక్కించుకున్నాడు. 1971 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజా సమితి అభ్యర్థులు 14 స్థానాలకు గాను 10 స్థానాల్లో విజయం సాధించారు. కేంద్రంలో కాంగ్రెస్ బలీయమైన శక్తిగా అవతరించటంతో చెన్నారెడ్డి తెలంగాణ ప్రజా సమితిని కాంగ్రెసులో విలీనం చేసినాడు. 1972 శాసనసభ ఎన్నికల తర్వాత రాష్ట్ర కాంగ్రెస్ పగ్గాలు ఇందిరాగాంధీ పి.వి. నరసింహారావుకు ఇచ్చి ముఖ్యమంత్రిని చేసింది. ప్రత్యేక ఉద్యమం తీవ్రంగా సాగుతూ తెలంగాణ అంతా అగ్నిగుండంగా ఉన్నప్పుడు 'విశాలాంధ్ర' నినాదంతో సి.పి.ఐ, సి.పి.ఎం పార్టీలో, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీకి నైతిక మద్దతు ఇచ్చి అండగా నిలిచాయి. ప్రతిఫలంగా ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధి ఆంధ్రప్రదేశ్‌లోని కమ్యూనిస్టు పార్టీ నాయకులను పిలచి మీరు తెలంగాణలో సాయుధ పోరాట పిలుపిచ్చి 25 సంవత్సరాలవుతుంది. మీరు తెలంగాణ సాయుధ పోరాట రజతోత్సవాలను జరుపుకుంటే ఖర్చును భరిస్తానని హామి ఇవ్వటంతో పాటు, కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులతో, మీరందరూ తెలంగాణ సాయుధ పోరాటయోదులే గదా! మీరందరూ మీ మీ అనుభవాలను ఎందుకు గ్రంథస్థం చేయరు అని కోరింది. ఇందిరాగాంధి అలా కోరడంలో ప్రయోజనం ప్రత్యేక తెలంగాణ నినాదం 1971 లోక్‌సభ ఎన్నికల్లో బలంగా పనిచేసింది. 1972 శాసనసభ ఎన్నికలు వచ్చేసరికి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాడు ప్రధాన ప్రతిపక్షమైన సి.పి.ఐ మరియు సి.పి.ఎం.లు విశాలాంధ్ర నినాదంతో తన అభిప్రాయానికి అనుగుణంగా నిలిచారు కాబట్టి వారిని జోకొట్టడమే! 1972 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 219 స్థానాలు

గెలుచుకొని, తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థాయికి ఎదిగితే సి.పి.ఐ.కి ఏడు స్థానాలు, సి.పి.ఎం.కు ఒక స్థానం మాత్రమే వచ్చాయి.

విశాలాంధ్ర నినాదంతో ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీలు నష్టపోయినప్పటికి మూడు స్పష్టమైన ప్రయోజనాలు ఆశించి ఆనాడు తెలంగాణ పోరాట రజతోత్సవాలతో పాటు గ్రంథ రచనకు ఉపక్రమించారు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, చండ్ర రాజేశ్వరరావులు, రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డిలు. మొదటి ప్రయోజనం భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టులో 1968లో చీలిక ఏర్పడి, బెంగాల్ నక్సల్బరి శ్రీకాకుళములలో రైతాంగ పోరాటాలు ప్రారంభమై వ్యవసాయక విప్లవం యొక్క అవసరాన్ని గుర్తు చేయటంతో దాన్ని వ్యతిరేకించడం. రెండవ ప్రయోజనం, విశాలాంధ్ర నినాదాన్ని బలపరుస్తు తెలంగాణ సాయుధ పోరాటాన్ని సమైక్యంగా ఆనాడు నిర్వహించినట్లు చెప్పటానికి ప్రయత్నం చేయడంతో పాటు తెలంగాణ సాయుధ పోరాటం వల్ల భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని నమ్మబలకటం, మూడవ ప్రయోజనం తెలంగాణ సాయుధ పోరాటకాలంలో ముందుకు వచ్చిన వ్యవసాయక విప్లవంను కొనసాగించలేకపోవడానికి గల కారణాలను విశ్లేషిస్తూ, అతివాద పంథాలో కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నుండి బయటకు వచ్చిన విప్లవకారుల సిద్ధాంతాలను, అభిప్రాయాలను పరోక్షంగా ఎండగట్టటంతో పాటు తెలంగాణ సాయుధ పోరాటంలో తమ పాత్రను స్థిరీకరించుకోవడం.

ఈ ప్రయోజనాలను ఆశించే తెలంగాణ పోరాట రజతోత్సవాలను ఘనంగా జరిపి తమ గ్రంథాలను చాలా జాగ్రత్తగా రచించి తెలంగాణ పోరాటయోధుల పాత్రలను మరుగున పరిచి సహకార దృష్టితో పోరాటానికి సహకారం అందించిన వారే పోరాటానికి నాయకత్వం వహించినట్లు చెప్పుకొనే స్థాయికి ఎదిగారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంనుండి కొనసాగుతున్న అభిప్రాయబేధాలు 1962లో చైనా భారతదేశం పై చేసిన దాడి నాటికి తీవ్ర స్థాయికి చేరి 1964 ఏప్రిల్ 11న జరిగిన జాతీయ సమితి సమావేశంలో వాకౌట్ చేసి బయటకు వచ్చిన 32 మంది సభ్యులు సి.పి.ఐ. (యం) ను ఏర్పరిచారు. దానిలో సుందరయ్య ప్రధాన పాత్ర పోషించాడు. భారతదేశంలో సాయుధ పోరాటాన్ని ప్రారంభించడానికి ఆనాడు సి.పి.ఐ.(ఎం)ను ఏర్పరిచారు. 1964 చీలిక తర్వాత సాయుధ పోరాట ప్రారంభానికి ఏమీ చర్యలు చేపట్టక పోయేసరికి బెంగాల్‌లో 1967 మే నెలలో 'నక్సల్బరి'లో స్థానిక సి.పి.ఐ.(ఎం) పార్టీ నాయకులు రైతాంగ తిరుగుబాటును లేవదీశారు. వారు మరొకసారి చీలిక కమ్యూనిస్టు పార్టీ (మా.లె.) ఏర్పరుచుకొన్నారు. బెంగాల్ ప్రభుత్వం పాశవికంగా ఆ తిరుగుబాటును అణిచినప్పటికి భూస్వామ్యవర్గానికి వ్యతిరేకంగా తిరుగుబాట్లు చేయాల్సిన అవసరాన్ని మార్క్సిస్టు

పార్టీలోని కొందరు సభ్యులు గుర్తించి భారతదేశంలో ఇతర ప్రాంతాల్లోను అదే విధమైన తిరుగుబాట్లకు ప్రయత్నించారు.

దేశవ్యాప్తంగా సి.పి.ఐ.(ఎం) లోని అసంతృప్తివాదులు నాయకత్వంపై అంతర్గత పోరాటం ప్రారంభించారు. ముందుగా చారుమజుందారు బెంగాల్‌లోని డార్జిలింగు జిల్లాలో ప్రత్యక్ష చర్యలకు పూనుకొని భూ పోరాటాలకు, పంటల స్వాధీనానికి పూనుకొన్నాడు. ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీలో సీనియర్ నాయకులు తరిమెల నాగిరెడ్డి, చండ్రపుల్లారెడ్డి, కొల్లా వెంకయ్య, దేవులపల్లి వెంకటేశ్వరరావులు కేంద్ర నాయకత్వంతో విభేదించారు. 1968 జనవరిలో పాలకొల్లులో జరిగిన ప్లీనరీలో వారు మధురై తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ 'దేశాన్ని పరిపాలిస్తున్న బడా బూర్జువా వర్గం కాంప్రాడార్- బ్యూరోక్రటిక్ తత్వంకల వర్గం' అని పై నలుగురు నాయకులు చేసిన సూత్రీకరణలను అంగీకరించేందుకు సి.పి.ఎం తిరస్కరించింది. మధురై సమావేశంలో సి.పి.ఎం. వారు చేసిన 'సోషలిజంలోకి పరివర్తన రూపాలు (ఆన్ ఫోరమ్ ఆఫ్ ట్రాన్సిషన్ టు సోషలిజమ్)' అనే భావనను ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులు వ్యతిరేకిస్తూ సి.పి.ఎం. కేంద్ర కమిటి 'శాంతియుత పార్లమెంటరీ పంధాను' దుయ్యబట్టారు. 1968 జూన్ 16న వీరిని పార్టీనుంచి బహిష్కరించారు. 1968 జూన్ 29,30 తేదీలలో విజయవాడలో తరిమెల నాగిరెడ్డి, చండ్ర పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, కొల్లా వెంకయ్యలు సమావేశమై తమని కమ్యూనిస్టు విప్లవకారులుగా ప్రకటించుకొని తొమ్మిది మంది సభ్యులతో నాగిరెడ్డి సమన్వయకారుడుగా ఆంధ్రరాష్ట్ర సమన్వయ సంఘం ఏర్పడింది. మావో ఆలోచనలే తమ మార్గదర్శకమని ప్రకటిస్తూ 1944-51 నాటి తెలంగాణ పోరాటం మాదిరి త్వరలో మరో తెలంగాణ రైతాంగ ఉద్యమాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. తెలంగాణలోని వరంగల్, ఖమ్మం జిల్లాలను కార్యక్రమ ప్రాంతాలుగా ఎంచుకొన్నారు.

శ్రీకాకుళంలో, తెలంగాణలో సాయుధ పోరాట కేంద్రాలు వృద్ధి చెందాయి. ఎత్తుగడల విషయంలో నాయకత్వంలో విభేధాలు ఏర్పడినాయి. నాగిరెడ్డి, దేవులపల్లి చట్టబద్దంగానూ, చట్టం వెలుపలా సంఘర్షణలు జరపాలనీ, ఆర్థిక పోరాటాల ద్వారా సుదీర్ఘమైన సన్నాహాలు చేసి పూర్తి స్థాయి పోరాటాన్ని మొదలుపెట్టాలని భావించారు. శ్రీకాకుళం ప్రాంతంలోని విప్లవకారులు వెంటనే ఆయుధాలు చేపట్టాలని భావించారు. 1968 అక్టోబరులో చారుమజుందారుతో శ్రీకాకుళ ప్రాంత నాయకులు చౌదరి తేజేశ్వరరావు సంబంధాలు ఏర్పరుచుకొని, 1968 అక్టోబరులో శ్రీకాకుళం జిల్లా సమన్వయ సంఘం బొడ్డపాడులో సమావేశమై సాయుధ పోరాటాని తక్షణం ప్రారంభించాలని తీర్మానించింది. 1968 నవంబరు 24న బొడ్డపాడు దగ్గర గరుడభద్ర గ్రామంలోని ధనిక భూస్వామి పంటలను స్వాధీనం చేసుకోవడంతో సాయుధ పోరాటానికి తిరిగి నాంది జరిగింది. 1969 జనవరి

నుండి 1969 ఆగస్టు వరకు 86 సంఘటనలు జరిగాయి. శ్రీకాకుళ పోరాటం చారుమజుందారు చేతుల్లోకి వెళ్లింది. 1969 ఫిబ్రవరి 19,20,21 తారీఖుల్లో గుంటూరు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని గుత్తికొండ బిలంలో శ్రీకాకుళ పోరాటంలో పాల్గొంటున్న చౌదరీ తేజేశ్వరరావు, పంచాది కృష్ణమూర్తి, కొండపల్లి సీతారామయ్య, కె.జి. సత్యమూర్తి, మామిడి అప్పల నరిసింహంలతో పాటు తెలంగాణ, రాయలసీమ జిల్లాల నుంచి అనేకమందితో చారుమజుందారు సమావేశమైనాడు. వారు కొత్తగా కమ్యూనిస్టు విప్లవకారుల ఆంధ్రరాష్ట్ర సమన్వయ సంఘంగా ఏర్పడ్డారు. పాత సమన్వయ సంఘంతో సంబంధాలు తెంచుకున్నారు. వీర తెలంగాణ విప్లవ వీరులు తమ జీవితాల్ని వృధా చేయలేరని ఆ తరహాలోనే పోరాడాలని నిర్ణయించారు.

1969 మార్చి 11న తరిమెల నాగిరెడ్డి తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేసిన తర్వాత 1969 ఏప్రిల్ 10 నుంచి 12 వరకు కృష్ణ జిల్లా కంధంపాడు గ్రామం దగ్గర నిమ్మతోటలో రహస్యంగా సమావేశమై 'తక్షణ కార్యక్రమం' (ఇమిడియేట్ ప్రోగ్రామ్) పేరుతో ఒక కార్యక్రమాన్ని నిర్ధేశించుకొన్నారు. తక్షణమే వ్యవసాయక విప్లవాన్ని ప్రారంభించాలని భావించి ' మన కార్యక్రమాన్ని (అనగా భూమిని పున: పంపిణి చేసే వ్యవసాయక విప్లవాన్ని) అమలు జరపడం మొదలుపెట్టగానే, ప్రభుత్వ సాయుధ పోలీసుల నుంచి దాడులు మొదలవుతాయి, దాంతో మన విరోధం కూడా అమలు జరపాలి' అని ప్రకటించారు.

తర్వాత విజయవాడలో సమావేశమై ఖమ్మంలోని పగిడేరు, పాల్వంచ ప్రాంతాలలో వెంటనే పోరాట చర్యలు ప్రారంభించాలని నిశ్చయించారు. 1969 ఏప్రిల్ 16న పగిడేరులో భూస్వాముల వద్ద నాలుగు తుపాకులు లాక్కున్నారు. ములుగు ప్రాంతంలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో భూస్వామి ఇంటి పై దాడి చేశారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాలలో గెరిల్లా దళాలు ఏర్పాటు చేసి కార్యకలాపాలు ప్రారంభించారు. ముఖ్యంగా తెలంగాణలో యూనియన్ సైన్యాలు ప్రవేశించిన తర్వాత ఏ ప్రాంతాల్లో అయితే నల్లగొండ వరంగల్లు పోరాట యోధులు కేంద్ర స్థానం చేసుకొని 1948-51 సంవత్సరాల్లో యూనియన్ సైన్యాలను ఎదుర్కొన్నారో ఆ ప్రాంతాల్లోనే ఈ శిక్షణ, దాడులు కేంద్రీకరించారు. బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో కూడా సాయుధ తిరుగుబాట్లు ప్రారంభమైనాయి.

1969 డిసెంబరు నెలలో నాగిరెడ్డి, దేవులపల్లి, వెల్మరెడ్డి, గోపాలరెడ్డి, చల్లపల్లి శ్రీనివాసరావు, మండ్ల సుబ్బారెడ్డి, వసంతాడ రామలింగాచారి, సుంకరి లక్ష్మినరసయ్యలు మద్రాసులో రహస్య సమావేశం ఏర్పాటు చేసుకొని నిర్వహిస్తుండగా అరెస్టు అయి హైదరాబాద్ కుట్రకేసులో జైలు పాలయ్యారు.

1970 జులైలో నీలం రామచంద్రయ్య, రామనర్సయ్య, చండ్రపుల్లారెడ్డిలు మరొక రాష్ట్ర కమిటి ఏర్పాటు చేసి 'ఆంధ్రప్రదేశ్ రివల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేసి గోదావరి లోయలో తమ దృష్టిని కేంద్రీకరించారు. శ్రీకాకుళ పోరాటం 1968లో ప్రారంభమై 1971 వరకు నిలదొక్కుకుని వేల మంది నిర్బంధించబడటం, దాదాపు 300 మంది అమరులవడం, గోదావరి లోయలో తిరిగి పోరాటాలు ప్రారంభమతుండడం, అందరూ వ్యవసాయిక విప్లవాన్ని కొనసాగించడానికి ప్రయత్నించడం, ఈ దశలో విప్లవాన్ని, సాయుధ పోరాటాలనకు కొనసాగించలేము అని చెప్పటానికి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, రాజేశ్వరరావు, తమ గ్రంధాలు రచించారు. వారు ఆ సంప్రదాయాల్లో పోరాటం ప్రారంభించినప్పటికి ఉద్యమాన్ని కొనసాగించలేక పోవటానికి కారణాలను విశ్లేషిస్తు, తెలంగాణ సాయుధ పోరాటాన్ని, విశాలాంధ్ర దృష్టితో, తమ దృక్పధానికి అనుగుణంగా విశ్లేషించబూనుకున్నారు.
సి.పి.ఐ., సి.పి.ఎం. వారు తమ గత వర్తమాన ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ సాయుధ పోరాటానికి మితవాద, సంస్కరణవాద రంగును పూయటానికి ప్రయత్నించారు. ఆనాడు సి.పి.ఐ. (ఎం.ఎల్.) భారత విప్లవానికి తెలంగాణ సాయుధ పోరాటం నుండి గుణపాఠాలు తీసుకొని పున: నిర్మించడానికి ప్రయత్నిస్తే వీరు తిరోగమించ ప్రయత్నించారు.

ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు పార్టి కమిటి 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి పిలుపునిచ్చింది. ఆ నాటికి తెలంగాణలో 1944 నుంచి జరుగుతున్న సాయుధ పోరాట ఘట్టాలు, ముండ్రాయి, ధర్మాపురం, ఎర్రపాడు, బేతవోలు, బక్కవంతులుగూడెం, మల్లారెడ్డిగూడెం, మేళ్లచెర్వు, అల్లీపురం, తిమ్మాపురం, ములకలగూడెం, నాసికల్లు గ్రామాల్లో ఆంధ్రమహాసభ 'సంఘం' తరుపున జరిగిన ప్రధాన ఘట్టాలను చాలా సంక్షిప్తంగా సుందరయ్య తన గ్రంథంలో వివరించాడు. 8వ ఆంధ్రమహాసభ తర్వాత ఆంధ్రమహాసభ ఉద్యమాన్ని రావి నారాయణరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల లక్ష్మినరసింహారెడ్డి, బద్దం ఎల్లారెడ్డిలు తమ నాయకత్వంలోకి తీసుకోవడానికి చేసిన ప్రయత్నాలు గాని, తెలంగాణలో లక్షలాది ఆంధ్రమహాసభ కార్యకర్తలను సంఘటితపరిచి, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా కదిలించడానికి చేసిన ప్రయత్నాలు గాని ఏవీ గ్రంథంలో వివరించలేదు. 1945 నాటికి ఆంధ్ర మహాసభ సభ్యత్వం తెలంగాణలో 7.5 లక్షలుంటే ఆంధ్రలో 10 వేలు దాటలేదు. వారు ఎందుకు ఇంత మహోద్యమాన్ని ఆంధ్ర, రాయలసీమల్లో నిర్మించలేంది, వారిని పోరాటాల వైపు కదిలించలేకపోయింది ఈ గ్రంథంలో వివరించలేదు.

ఈ వ్యాసంలోనే నక్సలైటు ఉద్యమాన్ని గూర్చి రాస్తూ 'అతివాద దుందుడుకు వాదులున్నారు. ప్రస్తుతం వీరిని నక్సలైట్లు అంటున్నారు. కొత్తగావారు నాటి తెలంగాణ పోరాటానికి అప్పటి నాయకత్వం వెన్నుపోటు పొడిచిందని ఇప్పుడు ప్రేలటం మొదలుపెట్టారు. ఈ నిందనే చైనా కమ్యూనిస్టు పార్టీకూడా తన రచనలలోనూ, వ్యాసాలలోనూ వల్లిస్తుంది. సత్యం మీద, నిజాయితీ మీద విశ్వాసం ఉన్నా వాడెవడైనా ఇంత తప్పడు కూత కూసేందుకు కొంచెమైనా జంకుతాడు. నాయకత్వాన్ని సవాలక్ష, అతివాద, మితవాద లోపాలకు, ఇంకా ఇతర లోపాలకు నిందించవచ్చు. కానీ, ఈ ఐదేళ్లపాటు పోరాటం సాగించిన నాయకత్వాన్ని మాత్రం ఒక్క విషయంలో శత్రువులు కూడా వేలెత్తి చూపలేరు. (ఒక్క చదలవాడ పిచ్చయ్య, తన గ్రంథం ఆంధ్ర 'కమ్యూనిస్టుల నగ్న స్వరూపం' 1948లో తప్ప) ఈ పోరాట కాలమొత్తంలో వారు (ఇతనిని కలుపుకోలేదు) మొక్కవోని పట్టుదలను దీక్షను, పోరాటం యెడల అచంచల విశ్వాసాన్ని ప్రదర్శించారు. కాగా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో పెద్ద పెద్ద ప్రముఖుల నుండీ కూడా ఆనాడు వచ్చిన విమర్శ, పిరితనమని, ఉద్యమానికి ద్రోహమని, ప్రతికూల పరిస్థితులలో కూడా, ఎప్పడో క్రమబద్ధంగా తప్పకోవలసిన సమయంలో సహితం పోరాటాన్ని చాలా కాలం సాగదీశారన్నదే. కనుక తెలంగాణ పోరాటాన్ని నాడు ముందుండి నడిపిన నాయకత్వంపై కుత్సిత బుద్ధితో సాగిస్తున్న ఈ నిరాధారమైన నిందా ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు, ఇంకా పెద్దగా చెప్పనక్కరలేదు. ఈ పెడత్రోవపట్టిన 'ఉగ్రవాదులు' నాటి తెలంగాణ పోరాట సాంప్రదాయాలను ప్రశ్నించ వీలులేదు. వారసులు తామే అయినట్లు, తాము ఆ సాంప్ర దాయాలను నిలబెట్టనున్నట్లు నాటి అనుభవం గుణపాఠాలు తమ సొత్తు అయినట్లు చాటుకునేందుకు విఫలయత్నం చేస్తున్నారు. భారతదేశ కమ్యూనిస్టులకు, శ్రామిక విప్లవాలకు ఈ తెలంగాణ పోరాటం ఎన్నో వెలగట్టలేని గుణపాఠాలను అందించింది. అవి మాత్రం నేర్చుకునేందుకు ఉగ్రవాదులు సిద్ధంగా లేరని' (పే. 21) అని సూత్రీకరించుకుంటూ వచ్చాడు. 'ఈ గుణపాఠం నేర్చుకునేందుకు నక్సలైట్లు మొండిగా నిరకారిస్తున్నారు. అందువల్లనే అన్ని రకాలైన పిల్ల చేష్టలు, మూర్ఖపు పనులు చేస్తున్నారని ప్రతి రైతాంగ పోరాటాన్ని అదెంత చిన్నదైనా, ఏ ఆర్థిక సమస్యపై నడపడబడుతున్నా, ఆ పోరాటాన్ని 'విముక్తి పోరాటమని' యెంతో కొద్ది ప్రాంతంలో జరిగినా అది 'విముక్తి పోరాటమని' యెంతో తక్కువ మంది ఈ పోరాటంలో పాల్గొన్నా వారిని 'విముక్తి సైన్యం' అని డబ్బా వాయించుకొంటున్నారు' అని 1968 తర్వాత వచ్చిన రైతాంగ పోరాటాలను వ్యతిరేకరించడమే గాక ప్రత్యేక రాష్ట్రోద్యమాన్ని అణచడంలోనూ, రైతాంగ పోరాటాలను అణచడంలోను ప్రభుత్వాలు తీసుకొన్న నిర్ణయాలకనుగుణంగా వ్యవహరించి తెలంగాణ సాయుధ పోరాట రజతోత్సవాలు నిర్వహించారు. ఈ గ్రంథంలో 'తెలంగాణ పోరాట గుణపాఠాలా? దివాళాకోరు రాజకీయ సూత్రీకరణలా?'

అను పేరుతో చండ్ర రాజేశ్వరరావు రాసిన 'చారిత్మాక తెలంగాణ పోరాటం' అను పుస్తకం రావి నారాయణరెడ్డి రచించిన 'వీర తెలంగాణ, నా అనుభవాలు- జ్ఞాపకాలు' పైన రాసిన విమర్శ అయినా ప్రధానంగా రాజేశ్వరరావు పుస్తకం పైన ఎక్కువగా దాడి చేశాడు. ఆ వ్యాసంలోని వాద వివాదాలన్నీ వారి అభిప్రాయాలకు సంబంధించినవి మాత్రమే. 'అతని కంటే ఘనుడు అచంట మల్లన్న' 'రాజేశ్వరరావుకు వత్తాసుగా రాజశేఖరరెడ్డి' అను వ్యాసాన్ని నీలం రాజశేఖరరెడ్డి 10-10-1972 లో 'విశాలాంధ్ర' పత్రికలో రాసిన ప్రతి విమర్శకు సమాధానం. దీనిలోనూ వారి అభిప్రాయా బేధాలనే వివరించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను వివరించలేదు. విశ్లేషించలేదు. 1946-1951 వరకు తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించిన డాక్యుమెంట్లో ముఖ్యంగా 'తెలంగాణ పోరాటంపై భారత కమ్యూనిస్టు పార్టీ ప్రకటన, తెలంగాణ సాయుధ గెరిల్లా పోరాట విరమణకు కారణాలను వివరిస్తూ పుచ్చలపల్లి సుందరయ్య, తాను (సర్క్యులరు 3/51) హైదరాబాదు స్టేట్ కమ్యూనిస్టు కమిటీ పేరున రాసింది. ఈ సర్క్యులర్ నందు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్యలు, గెరిల్లా పోరాటమనే దిక్కులేని భారత విప్లవోద్యమానికి చుక్కానిగా కనుగొన్నట్లు ప్రకటించుకొని, తామే ప్రశ్నలు వేసుకొని కారణాలు చెపుతూ తెలంగాణ పోరాట విరమణ సర్క్యులర్ రూపొందించారు. దేవులపల్లి వెంకటేశ్వరరావుకు సంబంధం లేనప్పటికి అతని పేరుకూడా ఈ సర్క్యులర్ నందు చేర్చి పార్టి సభ్యులకు విడుదల చేశారు. ఈ విషయాన్ని దేవులపల్లి వెంకటేశ్వరరావు తన 'భారత విప్లవ పంథాను చూపిన తెలంగాణ సాయుధ పోరాటం' (పే. 64-65)లోనూ పుచ్చలపల్లి సందరయ్య తన స్వీయచరిత్ర 'విప్లవ పథంలో నాపయనం' (రెండవ భాగం పే. 61) లోను అంగీకరించారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని పుచ్చలపల్లి సందరయ్య, బసవపున్నయ్యలు విరమించేటట్లు ప్రకటన చేసి సాయుధ పోరాటం కొనసాగించాలనుకున్న తెలంగాణ నాయకులను కొనసాగించటానికి వీలు లేని పరిస్థితి కల్పించి, విరమణను వ్యతిరేకించిన వారిని 1952 ఎన్నికల్లో పోటీ చేయనీయకుండా జాగ్రత్త పడి వీరు మాత్రం పోటీ చేశారు. పార్టీలో ఆనాడున్న పరిస్థితిని అనుసరించి తెలంగాణ పోరాటంలో పాల్గొంటున్న నాయకులను సంప్రదించకుండా, పార్టీ పేరున గాకుండా వ్యక్తుల పేరిట డాక్యుమెంట్లు, ప్రకటనలు వెలువడే సాంప్రదాయాన్ని ఏర్పరిచి సాయుధ పోరాట విరమణ ప్రకటించి వందలాది దళాల ప్రాణాలకు ముప్పవాటిల్లే ప్రమాదం ఏర్పరిచారు. తెలంగాణ సాయుధ పోరాట విరమణపై చర్చను నిరవధికంగా వాయిదా వేస్తూవచ్చారు.

ఈ గ్రంధంలో మాకినేని బసవపున్నయ్య కొన్ని డాక్యుమెంట్లతో పాటు 'రావినారాయణరెడ్డి 1949లో వెలువరించిన 'తెలంగాణ నగ్నస్వరూపం' అన్న గ్రంథాన్ని ప్రచురించి దానికి విశాలాంధ్ర కమిటి పేరున

బసవపున్నయ్య, సుందరయ్యలు రచించిన 'సమాధానాన్ని' కూడా ప్రచురించాడు. ఆ సమాధానంలో రావి నారాయణరెడ్డి లేవనెత్తిన సమస్యలకు సమాధానం చెప్పకుండా రావి నారాయణరెడ్డిని పోరాట ద్రోహిగా చిత్రించడానికి చేసిన ప్రయత్నమే ఎక్కువగా ఉంది. ఆనాడు రావి నారాయణరెడ్డి తెలంగాణ సాయుధ పోరాటంపై ఆంధ్ర నాయకత్వాన్ని ఎదుర్కొన్నాడు. ఈ గ్రంథంలో తెలంగాణ సాయుధ పోరాట చరిత్రకు సంబంధించిన వివరాలకంటే భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులపై దాడిని ఎక్కువగా చేశారు.

స్వీయచరిత్రల రూపంలో 1972 సెప్టెంబర్ నందు రావి నారాయణరెడ్డి 'వీర తెలంగాణ నా అనుభవాలు- జ్ఞాపకాలు' ఆరుట్ల రామచంద్రారెడ్డి 'తెలంగాణ పోరాట స్మృతులు' అను గ్రంథాలు వెలువడ్డాయి. ఆరుట్ల రామచంద్రారెడ్డి సాయుధ పోరాటానికి సంబంధించి తన స్మృతులను తాను నెమరేసుకొన్నాడు గాని రావి నారాయణరెడ్డి అనుభవాలు జ్ఞాపకాలతో పాటు ప్రత్యేక తెలంగాణ ఉద్యమ వ్యతిరేకతను తన గ్రంథంలో ప్రస్తావించాడు. 'చీలికవాదం తెలంగాణ ప్రయోజనాలకే హానికరం' అని భావించి 'వీర తెలంగాణ నాది - వేరు తెలంగాణ కాదు' అను అధ్యాయంతోపాటు తన విజ్ఞప్తిన ప్రచురించి 'విశాలాంధ్ర' నినాదాన్ని బలపరిచాడు. తన కారణాలను తాను వివరించాడు. ఆ తర్వాత తెలంగాణ పోరాటంపై అనేక గ్రంథాలు వచ్చాయి. అని తమ అనుభవాలు, జ్ఞాపకాలుగా రాస్తూ వచ్చినవారే. చరిత్రగా దేవులపల్లి వెంకటేశ్వరరావు గ్రంథం వచ్చినా అసంపూర్తిగా ప్రచురణ అయింది. తెలుగులో ప్రచురితమైన 42 గ్రంథాలతోపాటు తెలంగాణ పోరాటంపై బర్రి పావియర్ చేసిన పరిశోధనాత్మక వ్యాసం ధనిక రైతాంగవాదం 'ది తెలంగాణ మూవ్‌మెంట్ 1944-51' జి.ఎస్. రావు రచించిన 'పెసెంట్ మూవ్‌మెంట్ అండ్ ఆర్గనైజేషన్స్ ఇన్ తెలంగాణ రీజన్' అనేక వ్యాసాలతో పాటు, ప్రచురించబడని పరిశోధనలు కూడా ఉన్నాయి.

1. కె. శ్రీనివాస్, జెఎన్‌యు, చేసిన 'తెలంగాణ పెసెంట్ మూవ్‌మెంట్ అండ్ చేంజ్ ఇన్ ది అగ్రరేరియన్ స్ట్రక్చర్. (ఎ కేస్ స్టడీ ఆఫ్ నల్లగొండ డిస్ట్రిక్ట్).
2. Ian Bedford అనునతను ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీలో చేసిన పరిశోధన The Telangana Insurrection : A study in the causes and development of the Communist Insurrection in Rural India 1946-51.
3. బొబ్బిలి కాకతీయ విశ్వవిద్యాలయంలో చేసిన Agrarian Relations in Telangana 1911-48.
4. జి. మధుమోహన్ చేసిన "A study of the Land Reform Legislations in Telangana Region of A.P."

ఇనుకొండ తిరుమాలి చేసిన పరిశోధన 'ఆస్పెక్ట్స్ ఆఫ్ అగ్రేరియన్ రిలేషన్స్ ఇన్ తెలంగాణ 1928-48' లాంటి అనేక పుస్తకాలు వచ్చాయి వాటి పరిధులు వాటికున్నాయి. కాని ఉద్దేశాలు- దురుద్ధేశాలు ఆ గ్రంధ రచనల్లో లేవు. ఈ వ్యాసంలో ప్రస్తావించిన సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, చండ్ర రాజేశ్వరరావు, రావినారాయణరెడ్డిలు రజతోత్సవ సందర్భంగా 1972లో ప్రచురించిన పుస్తకాలు రెండు ముఖ్యలక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని రచించారు. ఒకటి విశాలాంధ్ర నినాదంను బలపరిచి ప్రత్యేక రాష్ట్రోద్యమాన్ని వ్యతిరేకిస్తూ రాయడం. రెండవది శ్రీకాకుళంలోను తెలంగాణలోను ప్రారంభింప ప్రయత్నించిన వ్యవసాయక విప్లవాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ సాయుధ పోరాటానికి ఆ ఉద్యమాలకు ఉన్న సంబంధాన్ని వ్యతిరేకించి ఈ రెండు ఉద్యమాల అణిచివేతకు ప్రభుత్వంతో సహకరించడం.

ప్రత్యేక రాష్ట్రోద్యమం తిరిగి విజృంభిస్తున్న దశలో మార్క్సిస్టు పార్టీ వారి 'ప్రజాశక్తి' ప్రచురణాలయం వారు 60 సంవత్సరాల తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలు, జరుపుతూ అనేక నూతన గ్రంథాలు, ఫోటో అల్బంలు, ప్రభుత్వ పత్రాలు ప్రచురిస్తున్నది. 'విశాలాంధ్ర' నినాదాన్ని బలపరుస్తూ ప్రత్యే రాష్ట్ర నినాదాన్ని వ్యతిరేకిస్తూ తాము తెలంగాణ సాయుధ పోరాట యోధుల వారసత్వాన్ని కొనసాగిస్తున్నామని తీర్పు ప్రకటించటానికా? చారిత్రక వాస్తవాలను వక్రీకరించి ఏదైనా కొత్త కుట్రకు పూనుకొన్నారా?

## తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణం ఆవశ్యకత - కొన్ని తక్షణ కర్తవ్యాలు

- పరవస్తు లోకేశ్వర్

"ప్రజలను దోచుకునే వారే ప్రజల చరిత్రను కూడా దోచుకుంటారు."

- సి.వి. సుబ్బారావు (సురా)

ఇప్పటి వరకు రాయబడిన చరిత్ర అంతా విజేతలచే రాయబడిన చరిత్రే. విజేతలు కేవలం తమ గురించి మాత్రమే తమ గొప్పతనాలు, ఘనమైన చరిత్ర గురించి మాత్రమే రచించి పరాజితుల గురించి, అణిచివేయబడిన వారి గురించి రాయాల్సివస్తే వక్రీకరణలు, వక్రభాష్యాలు, అపహాస్యాలతో ముగిస్తారు.

"ఈ వక్రీకరణ-చరిత్రకు కొత్తదేమి కాదు. ఆర్యులు మన దేశంలోకి వలసవచ్చి ద్రావిడుల మీద దండెత్తినప్పుడూ ఇదే ప్రచారం. ఇవే ఆధిక్యతాభావనలు. బ్రిటిష్ వారు వలసవచ్చిన రోజుల్లోనూ ఇవే ధోరణులు - మీరంతా అనాగరికులు మేం మిమ్మల్ని ఉద్ధరించటానికి వచ్చామని " ఫోజులు". అమెరికాలో రెడ్ ఇండియన్లపైనా, ఆస్ట్రేలియాలో అబోరిజిన్లపైనా, ఆఫ్రికాలో నీగ్రోలపైనా ఇదే జులుం. ఇదే దాడి. ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ స్థానికులపై వలసవాదుల పెద్దన్నల పెత్తనం ఇట్లాగే ప్రారంభమయ్యింది. ఇటీవల సెప్టెంబర్ 11 దాడి తర్వాత కూడా అమెరికాది ఇదే ధోరణి. It is a clash between two civilizations. ఇవన్నీ వలసవాద ఆధిక్యతాభావనలే. 1492లో కొలంబస్ అమెరికాను ఆవిష్కరించక ముందే వేల సంవత్సరాలకు పూర్వమే భారత దేశంలో నాగరికత, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఆసియాలో నాగరికత అత్యున్నత శిఖరాలకు చేరుకుందన్న సంగతి అమెరికాకు తెలియదా? సరిగ్గా ఆంధ్ర వలస పాలకులది కూడా ఈ దోరణి. ప్రజలనకు దోచుకునే వాళ్ళే ప్రజల చరిత్రను కూడా దోచుకుంటారు. అసలైన సిసలైన నేల పుత్రుల చరిత్రను కాలనాళికలో పాతిపెట్టే ప్రయత్నాలు చేస్తారు. స్థానికుల చరిత్రను విస్మృతిలోకి నెట్టే ప్రయత్నాలను నిరంతరం చేస్తారు. అందులో ఒక భాగంగానే తెలంగాణా చారిత్రికంగా అన్ని రంగాలలోనూ వెనకబడి వుందని అసత్య ప్రచారం చేస్తున్నారు. యూరపులో రాజకీయ విప్లవాలకు భూమికగా పునరుజ్జీవన ఉద్యమాలు, పునర్వికాస ఉద్యమాలు కొనసాగినట్లుగానే, మన దేశ స్వాతంత్ర్య సమరంలో అంతర్లీనంగా సంఘసంస్కరణోద్యమాలు, పునరుజ్జీవనోద్యమాలు కొనసాగినట్లుగానే వర్తమాన ప్రత్యేక తెలంగాణా పునరుజ్జీవనోద్యమం కొనసాగాలి. అప్పడే ఈ ఉద్యమం పరిపూర్ణత్వంతో వేగవంతమౌతుంది."

(వేయిన్నొక శేషప్రశ్నలు పుస్తకంలో ఒక భాగం)

ఈనాటి చారిత్రిక అవసరం, చారిత్రిక కర్తవ్యం ఏమిటంటే మన చరిత్రను మనమే తిరిగి రచించుకోవాలి. ఈ లక్ష్యంతోనే "తెలంగాణా హిస్టరీ సొసైటీ" ప్రారంభించబడుతున్నది. అయితే ఈ చరిత్ర పునర్నిర్మాణం బహుముఖాలతో, అనేక కోణాలలో వివిధ అంశాలపై కొనసాగాలి. తక్షణ సమస్యల ప్రాతిపదికపై తక్షణ కర్తవ్యాలను రూపొందించుకోవాలి. మన మన వ్యక్తిగత అభిరుచులు, అభినివేశాలకు అనుగుణంగా ఆయా అంశాలపై పరిశోదనలు, రచనలు, ఉపన్యాసాలు కొనసాగించాలి. ఈ ప్రయాత్నాలన్నీ మన విముక్తి ఉద్యమానికి ఒక 'తాత్వికభూమిక'గా ఉపయోగపడతాయి. కేవలం తెలంగాణా ప్రజలలో భావచైతన్యాన్ని పెంపొందించడమే గాక నిజాయితితో వివేకంతో ఆలోచించే కోస్తా, రాయలసీమ

ప్రజలను, మేధావులను ఒప్పించి వారి సానుభూతి మద్దతు సంపాదించేటట్టు కూడా ఈ ప్రయత్నాలు ఉపయోగపడతాయి.

మన ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా 'కులం' అనేది ఒక యదార్థసత్యం. అన్ని పార్టీల రాజకీయాలలో ఈ అంశాన్ని విస్మరించలేం, తక్కువగా అంచనా వేయలేం. ప్రముఖ సోషియాలజిస్టు శ్రీనివాసన్ చెప్పినట్లు భారత రాజకీయాలు ఆది నుండి నేటి దాకా 'కులం' అనే సాలెగూట్లో చిక్కుకొని విలవిలలాడుతున్నాయి. ఈ విషయంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలకూ మినహాయింపులేదు. కోస్తా వలస పాలన పెత్తనం, దోపిడీలో కమ్మ కులానిదే 'సింహభాగం'.

ప్రత్యేక తెలంగాణను సిపిఐ కంటే సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. సమైక్యవాదం విషయంలో అన్ని పార్టీల కన్నమిన్నగా 'రాజును మించిన రాజభక్తి' ని ప్రదర్శిస్తున్న, సిపిఎం పునాది తెలంగాణ క్యాడరే అయినా నాయకత్వం మాత్రం కోస్తానే గాక కమ్మకులం అన్నది జగమెరిగిన సత్యం. నానా రకాల వ్యాపార రంగాలలో లబ్దప్రష్టులైన వణిక్ ప్రముఖులందరూ ఆ సామాజిక వర్గానికి చెందిన వారేనని అందులోనూ మొదటితరం వారందరూ మాజీ కమ్యూనిస్టు లేనన్న సంగతి అందరికీ తెలుసు. కావున బలమైన ఈ కుల అంశాన్ని పరిశీలిస్తే సిపిఎం తెలంగాణను ఎందుకు వ్యతిరేకిస్తుందో నిజనిర్ధారణకు రావచ్చును. 1934లో కమ్యూనిస్టు పార్టీ అవిర్భావంతోనే ఆ కులం పాత్రను అధ్యయనం చేయాలి. (ది రోల్ ఆఫ్ కమ్మా కాస్ట్ ఇన్ ఒరిజిన్ ఆఫ్ కమ్యూనిస్ట్ పార్టీ ఇన్ 1934 బై ప్రొ. అజయ్ కుమార్ సిన్హా). 1964లో చీలిక తర్వాత సిపిఎంలో దాని ప్రభావం, నాయకత్వం పై దాని ఆధిక్యత, 1982లో టిడిపి అవతరణతో దాని అంతరంగిక సంక్షోభం, ఊగిసలాటలు, సోవియట్ యూనియన్ పతనం తర్వాత కాలంలో చంద్రబాబుతో ఖుల్లంఖుల్లా దోస్తానాల వెనుక 'కులం లాబీ' వొత్తిడులు మొదలగు అంశాలను అధ్యయనం చేస్తే వారి తెలంగాణ వ్యతిరేకత యొక్క నిజస్వరూపం లోకానికి వెల్లడి అవుతుంది. 1948 పోలీస్ యాక్షన్ సందర్భంలో యూనియన్ సైన్యం రెండు తలల పాము - మిన్నాగు వలె ద్విముఖ వ్యూహాన్ని అమలు చేసింది. ఒకటి కమ్యూనిస్టుల్ని అణిచివేయటం, మరొకటి రజాకార్లను అంతమొందిచే సాకుతో కనబడ్డ ప్రతి అమాయక ముస్లింను నిర్దాక్షణ్యంగా కాల్చివేయటం. నాలుగు రోజుల యాక్షన్‌లో సుమారు రెండు లక్షలమంది ముస్లిం ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అత్యాచారాలు, ఆస్తులు కొల్లగొట్టడం సరేసరి. మరి ఈ ఊచకోత గురించి కమ్యూనిస్టులు ఎందుకు మౌనం వహించారు? వారిని జవాబు చెప్పమని ఈనాడు మనం నిలదీయాలి. ఒకతరం చేసిన అన్యాయాలకు రెండవతరం వారు అన్యాయానికి గురైన వారికి క్షమాపణ చెప్పాలి. ఇంతే గాక 'విశాలాంధ్రలో' ముస్లిం ప్రజలకు ఎన్ని రకాలుగా నష్టం జరిగిందో తెలియచెప్పాలి. ఈ ప్రయత్నాల

వలన కనీసం చదుకున్న మధ్యతరగతి మేధావి వర్గానికి చెందిన ముస్లింలను మనం మన ఉద్యమం వైపు ఆకర్షితుల్ని చేయవచ్చు. లేకపోతే వారు శత్రుశిబిరంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. సాహిత్యంలో నోబుల్ బహుమతి గ్రహీత ఒర్హాన్ పాముఖ్ మొదటి ప్రపంచ యుద్ధం కాలంలో టర్కీలో 'కుర్దు' ప్రజలపై ఆ ప్రభుత్వం జరిపిన ఊచకోతను ప్రపంచానికి తన నవలల ద్వారా తెలియచేసిన ఈ వర్తమాన సందర్భంలో మనం 1948 పోలీస్ యాక్షన్‌లో అమాయక ముస్లిం ప్రజలపై సైన్యం చేసిన మారణకాండను లోకానికి వెల్లడి చేయలేమా?

నదీ జలాలు, నీళ్ల దోపిడి (వాటర్ పాలిటిక్స్) సరేసరి. హైదరాబాద్‌ను ఇతివృత్తంగా తీసుకొంటే, 'భూమి' సమస్య ప్రధాన ఎజెండాగా ముందుకు వస్తుంది. దీనికి పరాకాష్ట ఔటర్ రింగురోడ్డుల వ్యవహారం. దానికి మూలాలు ఎక్కడున్నాయి? రామోజీ ఫిల్మ్ సిటీ, రామానాయుడి స్టూడియోలు, జయభేరిలు, రాజుల ఇలాఖాల నడుమ హైదరాబాద్ దక్కన్ ఎట్ల 'కాట్' ఐపోయింది? ఆనాటి అత్రాఫ్ బల్దా (సబ్ అర్బన్ సిటీ లేదా ఈనాటి రంగారెడ్డి జిల్లా) లో ఉన్న సర్ఫేఖాస్ భూములు (నిజాం నవాబు స్వంత ఆస్తులు, భూములు) నామొనిషాన్ లేకుండ ఎట్ల గాయబ్ అయినాయో ఈనాటి తెలంగాణ చరిత్రకారులు కవిలె కట్టలు, దస్త్రాలు దులిపి కితాబులు తెరిచి హిసాబ్‌లు కట్టాలె. మన భూమి నుండి మనం ఎట్లా బేదఖల్ అయినమొ ఈనాటి చరిత్రకారులే చెప్పాలె.

'చరిత్రను పునర్లిఖించడం అంటే చరిత్ర నిర్మాణంలో ప్రత్యక్షంగా పాల్గొనడమే' అని తెలంగాణ హిస్టరీ సొసైటీ గాఢంగా విశ్వసిస్తుంది.

## తెలంగాణ చరిత్ర రచనకు కొన్ని సూచనలు

- డా. మలయశ్రీ

ఒక జాతి జన జీవన విశ్లేషణ - వివరణ చరిత్ర, అది దేశచరిత్ర, ప్రాంతీయ చరిత్ర ఏదైనా కావచ్చు. చరిత్రలో రాజకీయాల కథనం ప్రధాన భాగమైనా, అదే సమగ్ర సంపూర్ణ రచన కాదు. పాలకుల వివరాలకు ఇచ్చినంత ప్రాధాన్యత ప్రజల జీవన సంస్కృతుల వివరణకు కూడ ఇవ్వాలె. అది న్యాయం. భారతదేశంల ఆంధ్రప్రదేశ్ ఒక ప్రత్యేక భాషా ప్రయుక్త రాష్ట్రం. ఇది ఉత్తర దక్షిణ భారతదేశ - ఆర్య ద్రవిడ నాగరికతల సంగమ స్థానం. ఈ రాష్ట్రంలో ఉత్తరంగా ఉన్న పదిజిల్లాల మన తెలంగాణదే ఓ విశిష్ట స్థానం.

తెలుగు మాట్లాడే మనం అందరం తెలుగువాళ్లం - ఆంధ్రులమే అయినా రాజకీయ కారణాల వల్ల కొంత ప్రాంతీయ బేదం చోటుచేసుకుంది. పూర్వం నుంచి ఈ ప్రాంతం అనేక భాగాలుగా రాష్ట్ర - రాష్ట్రేతర వివిధ రాజుల పాలన కింద ఉంది. శాతవాహనుల కాలాన్ని వదలితే ఒక ఒరుగల్లు కాకతీయ చక్రవర్తుల కాలంలనే తెలుగునేల అంత ఒకే పాలనల ఉంది.

ఇటీవల ఓ రెండు వందలేండ్ల పూర్వం నైజాం ముస్లిం పాలకుల రాజకీయ కారణాల వల్ల ఆంగ్లేయులకు ధారాదత్తం చేసినందువల్ల కోస్తాంధ్ర మద్రాసు / తమిళనాడు రాష్ట్రంతోటి కల్సి ఉంటే, తెలంగాణ ప్రాంతం మరికొన్ని కర్ణాటక మహారాష్ట్ర జిల్లాల్తోని కలిసి నైజాం పేర, హైదరాబాద్ నిజాం పాదుషాల ముస్లిం పాలనల ఉంది. కోస్తాకు ఆంగ్లేయుల పాలన, అందుచేత ఆంధ్ర - తెలంగాణ ప్రాంతాలమధ్య భాషా సాహిత్యాల - కళా సంస్కృతుల, విద్యా ఉద్యోగాది రంగాల ఎంతో భేదం వచ్చింది.
15 అగస్టు 1947న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పడే తమిళ ప్రాంతంతో పాటుగా కోస్తాంధ్ర స్వతంత్రం పొందింది. అప్పడు తెలంగాణల రజాకార్ల అల్లరులు, దౌర్జన్యాలు, స్థానిక తెలుగు పౌరుల ప్రతిఘటన భీకర పోరాటాల తర్వాత, మరో ఏడాదికి, కేంద్ర ప్రభుత్వ సైనిక చర్యవల్ల 17 సెప్టెంబర్ 1948 నాడు నైజాం నుంచి - తెలంగాణకు విముక్తి లభించింది. ఆంధ్ర ప్రాంతం వారికి ఇక్కడి వారి అప్పటి బాధలు తెలియవు.

కోస్తాంధ్ర తమ ప్రత్యేక అస్తిత్వం - గుర్తింపు కోసం మద్రాసు నుంచి విడివడి, రాయలసీమతో కల్సి, కర్నూలు రాజధానిగా 1 అక్టోబర్ 1953న 'ఆంధ్రరాష్ట్రం'గా ఏర్పాటయ్యింది. అప్పటిది శ్రీబాగు ఒప్పందం. పొట్టి శ్రీరాములు గారి ఆమరణ నిరాహారదీక్ష అప్పటిదే. దానికి తెలంగాణకు ఎటువంటి సంబంధం లేదు.

1 నవంబర్ 1956 న 'ఆంధ్రరాష్ట్రం' (కోస్తా రాయలసీమ) హైదరాబాద్ స్టేట్‌లోని 'తెలంగాణ'తో కల్సి (అప్పటి ఎనిమిది జిల్లాలు ఇప్పడు పది) ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ అవతరించింది. ఇక్కడిది పెద్ద మనుషుల ఒప్పందం, అయితే రాజకీయ సామాజిక ఆధిపత్యం, అణచివేత, దోపిడి - కారణాల వల్ల రెండు మూడు సార్లు (1956, 69...) ప్రత్యేక తెలంగాణ ఉద్యమాలు నడిచినై. ఇప్పటి టిఆర్ఎస్ పోరాటం వేర్పాటు కోరికతోనే కదా. ప్రత్యేక తెలంగాణ వాదం రగులుతున్న కుంపటి. విడిపోవుడు తప్పకపోవచ్చు.

ఆంధ్రుల అతిచతురతవల్ల తెలంగాణ అన్ని రంగాల్ల దగా పాలయింది. అది నిజమని అంకెల వారిగా చూపవచ్చు. మనం మన ప్రత్యేక అస్తిత్వం నిలుపుకోవలె.

ఆంధ్రుల ఆధిక్యత ప్రదర్శన తెలంగాణ ప్రాంతంపైన ఉపేక్ష, చరిత్ర రచన విషయంల కూడ జరిగింది. అది ఎవరివల్ల, ఎందుకు, ఎట్లా? అనే వివరాలకు పోను. ఏం తప్పులు జరిగినై, అవి ఎట్లా సరిదిద్దుకోవాలె, అనే విషయాలనే కొన్ని వివరాలు చూపుతున్న, తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణ విషయంగా కొన్ని సూచనలను అందిస్తున్న.

ఆంధ్రప్రదేశ్ చరిత్ర రచయితలు తెలంగాణకు తగిన విలువ ఇవ్వలేదు. నాటి ముస్లింలు నేటి ఆంధ్రులు అంతే. అది నిజం. అది ఈ కింది మూడు విధాల సాగింది.

1. తెలంగాణ విషయాల విస్మరణ - ఉపేక్ష లేదా వదలిపేత.
2. సంగ్రహ ప్రస్తావన
3. వక్రీకరణ

అందుకు ఎన్నో ఉదహరణాలు చూపవచ్చు. మచ్చుకు కొన్ని అంశాలను మాత్రమే చూపుతున్న, చదవండి.

1. రాతియుగ ఆది మానవ నివాస స్థావరాలు కోస్తాకంటే మన తెలంగాణలనే ఎక్కువ. లోహయుగ ప్రారంభకాల బృహచ్ఛిలా సమాధులు (కైరనులు) కూడ ఈ ప్రాంతంలనే ఎక్కువ. అయినా మన ఆంధ్రప్రదేశ్ చరిత్ర రచయితలు వీటిని పట్టించుకోరు.

పురాణాల కాలపు షోడశ మహాజనపదాల లోని 'అశ్మక' రాజధాని పోతన / పోతలి నగరం. అది మన నిజామాబాద్ జిల్లా బోధన్. అయితే అశ్మక ఒరిస్సా గంజాం జిల్లా ప్రాంతం అన్న రచయితలూ ఉన్నారు.

కంద పద్యం పుట్టుక కరీంనగర్ జిల్లా కురిక్యాల శాసనంల క్రీ.శ. 946 పంపకవి సోదరుడు కవితాగుణార్ణవుడైన జినవల్లభుడు శాసన కవి. ఈ శాసనం తెలిసినా ఎవరూ ఆ విషయం చెప్పలేదు. నా 'కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర' లోనే మొదలు పేర్కొన్నది.

విశాలాంధ్ర ప్రచురించిన 'ఆంధ్రప్రదేశ్ దర్శిని' 1998 ప్రచురణ గ్రంథం, బాల సాహిత్య వ్యాస రచయిత ఏ ఒక్క తెలంగాణ రచయితనూ పేర్కొనలేదు. ఇట్లాంటివెన్నో -

2. రాసిన చారిత్రకాంశాలపైనా వివరంగా రాయరు. క్లుప్తంగా ముగిస్తరు. తెలుగు విశ్వవిద్యాలయంవారు ప్రచురించిన 'విజ్ఞాన సర్వస్వం' సం.2 లో - చరికొండ ధర్మన కవి, శ్రీ కృష్ణదేవరాయల కాలాన, గజపతుల సామంత ప్రభువు, సిత్తాప్‌ఖాన్ / సీతాపతి (ఖమ్మం - ఓరుగల్లు) ఆశ్రితుడని ఉంది. నిజానికి సీతాపతికి సామంతుడు కరీంనగర్ జిల్లా ధర్మపురి ప్రభువు ఎనుములపల్లి పెద్దనామాత్యుడు. ఈయన ఆస్థాన కవిగా చరికొండ ధర్మన రాసిన 'చిత్రభారతం' కావ్యస్థ సాక్ష్యం. ఆ వివరాలు వారికి పట్టవు.

18వ శతాబ్ది ధంసా గురించి రాస్తూ జగిత్యాల, నిర్మల, కోస్తా ప్రాంతాలను పేర్కొని, అతడు ప్రధానంగా ఏలుబడి కావించిన ఎలగంద కోట ప్రస్తావన లేదు. అతడు హైదరాబాద్ ఆసఫ్జాహీ రాజోద్యోగి.

3. చరిత్ర వక్రీకరణలు సైతం అనేకం

అ) మంజీరదేశం - తెలంగాణ గోదావరి నదికి మంజీర ఉపనది. మెదకు జిల్లా మంజీరా దేశం కావలె. కృష్ణా ముఖద్వార ప్రాంతం మంజీరికా దేశమని వారల వివరణ.

ఆ) బావరి ముని నివాస స్థానం - అశ్మక నిజామాబాద్ కరీంనగర్ జిల్లా ప్రాంతం. తన 16 గురు శిష్యులను బుద్ధుని వద్దకు పంపిన బావరి అశ్మక గోదావరి తీరవాసి అని బౌద్ధ సుత్తనిపాత పారాయణ పగ్గ పేర్కొంది. అది గోదావరి ద్వీప 'బాదనకుర్తి' గ్రామమని నేను (మలయశ్రీ), ఠాకూర్ రాజారాంసింగు గారు గుర్తించినం. కోస్తా రచయితలు ఇంకా ఈ సత్యాన్ని గమనించక తమ పాత ఊహలనే రాస్తున్నారు.

ఇ) కరీంనగర్ కోటి లింగాల శాతవాహనులకు పూర్వాంధ్ర చక్రవర్తుల రాజధాని అని పురాచరిత్ర పరిశోధకుల నిర్ణయం. కోస్తా చరిత్ర రచయితలకు ఆంధ్రులే శాతవాహనులు. శాతవాహనులు ఆంధ్రులు కారు. వారు ఆంధ్ర భృత్యులు. ఆంధ్రరాజుల తర్వాత పాలనకు వచ్చిన వారు అనే సత్యం వారికి తెలిసేది ఎన్నటికో. శాతవాహనాంధ్ర చక్రవర్తులనేది పాత పురాణాల బాట.

ఈ) శాతవాహన తొలి చక్రవర్తి సిముఖుని రాజధాని కోటిలింగాల. అతడు జైనుడట. శాతవాహన రాజ్యం పుట్టుక తెలంగాణ అయితే (కోటిలింగాల, కొండాపురం) వారికి ఇంకా అమరావతి - ధాన్యకటకమేనట.

ఉ) జైన- బౌద్ధ నిర్మాణాలు వివరించే వ్యాసకర్తలు కూడ ఆంధ్రప్రాంత స్థలాలకు విలువిస్తున్నారు తప్ప తెలంగాణ క్షేత్రాలను పేర్కొనరు. ఇవి వారికి తెలువవు. తెలుసుకోరు. మాది గొప్ప మీది తుప్ప అనే భావన.

ఊ) భాగవత కవి బమ్మెర పోతనది వరంగల్లు జిల్లా పాలకుర్తి - గూడూరు చారిత్రక గ్రామాల నడుమ ఉన్న నేటి బొమ్మెర వాసి. అయితే అతనిది కడప జిల్లా ఒంటిమిట్ట అని వితండవాదన. ఏకశిలానగరం - ఓరుగల్లు ఒంటిమిట్ట ఎట్లయితదో తెలువదు. ఒంటిమిట్ట రఘువీరుని గొల్చెద అని పోతన అన్నది మడికొండ మెట్టురామప్పను గురించి అని నా అభిప్రాయం.

ఎ) ఇక్కడ స్థానిక వీరులైన రాణి శంకరమ్మ, బల్మూరి కొండల రాయుడు, సర్వాయిపాపడు, జగన్నాథ ధర్మారావు, కొమరం భీం మొదలగు వారి గాథలు వారికి పట్టవు.

ఇంకా వివరాలకు పోతే తెలుగు సాహిత్యంల మొట్టమొదటి స్వతంత్ర కావ్యం, శతకం, రామాయణం, సంకలన గ్రంథం, యక్షగానం, అచ్చ తెలుగు ప్రబంధం తెలంగాణల పుట్టినవి. తొలి చారిత్రక గేయం కాకతి రెండవ ప్రోలుని మంథని యుద్ధ విజయం పాట 'ఆగుండీ గుండు...'. ప్రముఖ జానపద అద్భుత గాధలు సత్యవతి పాముపాట (ధర్మపురి), బాలనాగమ్మ, మాయలఫకీరు కథ (పానుగల్లు) ఇక్కడివి. సంస్కృతిపరంగా చూస్తే తెలంగాణ ప్రజలు శ్రమజీవులు, నిష్కపటులు, ప్రేమ స్వరూపులు. ఎంతటి అమాయకులో అంతటి వీరులు. ఇక్కడి బతుకమ్మ పండుగ, బోనాలు, కాముని పున్నమి జాజిరి పాటలు, వన భోజనాలు ఈ ప్రాంతానికే పరిమితం. ఇది మన ప్రత్యేకత. తెలంగాణ స్త్రీల - పురుషుల గోచీకట్టు వస్త్రాలది (చీరే - ధోతి) ఓ వింత సోయగం. అందం హుందాతనం కలబోత. ఈ వస్త్రధారణ ఉత్తర దక్షిణ భారతదేశ సంగమ స్థానం.

భాష : తెలంగాణ భాష తెలుగు క్రమ పరిణామ స్వరూపం. కోస్తాంధ్ర అనవసర దీర్ఘాలు, యాసలు ఇక్కటి మాటల్ల లెవ్వు. ఇది అందమైన అర్థవంతమైన అచ్చ తెలుగు పలుకుబడి. అయినా పాలకులు, ప్రభుత్వాధికారులు, పత్రికలు, ప్రచురణకర్తలు అక్కడివారై ఇక్కడి రచయితలకు - భాషకు తగిన గుర్తింపు లేదు. విధిగా కోస్తా భాషకు మారవలసి వస్తున్నది. మన భాషను కాపాడుకోవాలె. ఇక్కడి ఎన్నో వాడుక తెలుగు పదాలు నిఘంటువుల్ల లేవంటే అది వాటి కూర్పరుల నేరం. వాళ్లు కోస్తా వాళ్లు. ఇప్పుడు మన తెలంగాణ చరిత్ర మన మాండలిక భాషలనే రాయాలె.

మాండలికం అంటే గ్రామ్యం కాదని గుర్తుంచుకోవాలె. ఒక ప్రాంత విద్యావంతుల వ్యవహార భాష ఆ ప్రాంత మాండలికం.

మరొక ముఖ్యాంశం - మనవాళ్లకు కొందరికి కులమత ప్రాంత సంకుచిత దృక్పథం, దురభిమానం జాస్తి. మనం వాటి నుంచి బయట పడాలె. మనది కులాల మతాల చరిత్రకాదు. ఇది జన జీవన చరిత్ర, సత్య విషయ సంగ్రహం. ఇది ప్రగల్భాలకు స్పర్ధకుకాక ఈ ప్రాంత నిజ స్వరూప ప్రదర్శనకు కావిస్తున్న పరిశోధనాత్మక రచన అని మనం గుర్తుంచుకోవలె. ధైర్యంగా ముందుకు సాగుదాం. విజయం తప్పక సాధించుతం.

చివరి మాట - మొన్నటి (4 జూన్ 2006) హైదరాబాద్ ఫతేమైదాన్ క్లబ్‌లో జరిగిన తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణ చర్చా సమావేశంల చక్కని చరిత్రావగాహన కలిగిన పెద్దలు, యువకుల ప్రసంగాలు విని చాలా ఆనందించిన. వారి తోడ్పాటుతోని మన ప్రాంత చరిత్ర మీరు రాయవచ్చు, ఆరంభశూరులు, ప్రగల్భాల దగాకోరులు మీకు కొందరు తారసపడవచ్చు. గుణమెరిగి గుర్తించి వారిని దూరముంచండి. కొందరు చేయరు చేయనివ్వరు. అటువంటి వారి మాటలు వినకండి. ఈ 'తెలంగాణ చరిత్ర' రచయితల బృందంల నేను చేరలేకున్నా మీకు అవసరమైన సలహాలను అందిస్తనని హామీ ఇస్తున్న.

మీ పూనికకు ఉదాత్త ఆశయానికి ఆత్మాభిమానానికి నా ధన్యవాదాలు. సెలవిప్పటికి, స్నేహమెప్పటికీ!

## చరిత్ర రచన/నిర్మాణం

- డా. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి

మనమిప్పుడు పునర్నిర్మాణ (డీకన్‌స్ట్రక్షన్) యుగంలో ఉన్నాం. నిరాఘాటంగా ముందుకు దూసుకెళ్లడానికి ఒకడుగు వెనక్కి వేయడం అవసరం. ఆ అడుగు బలమైన భూమిక మీద పడాలి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో నెహ్రూ దాదాపు ఇలాంటి మాటల్నే చెప్పి ఉన్నాడు. తెలంగాణ స్వాతంత్ర్య సాధనకు కూడా ఈ మాటలు వర్తిస్తాయి.

దాదాపు నాలుగేళ్ల క్రితం తెలంగాణ సాంస్కృతిక వేదిక తరపున కాసుల ప్రతాపరెడ్డి సంకలనం చేసిన 'తెలంగాణ తోవలు' పుస్తకంలో తెలంగాణ సాహిత్య చరిత్రను రాయాలనే ఉద్దేశంతో 'లెక్కదప్పిన తెలుగు సాహిత్య చరిత్ర' అనే చిన్న వ్యాసం రాశాను. సంతృప్తినివ్వలేదు. చాలా అసమగ్రమనిపించింది. కె. శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్‌లు 'కవిలె' పేరుతో తెలంగాణ సమీపగత సాహిత్య సాంస్కృతిక చరిత్రను నిర్మించడానికి ప్రయత్నం చేస్తున్నారు. అదీ చాలదనిపించింది.

ఆధునిక తెలంగాణ కవిత్వాన్నంతటినీ ఒక్కచోట కుప్పపోసి చూపించాలనే ఉద్దేశంతో సురేంద్రరాజుతో కలిసి 'మత్తడి' కవితా సంకలం తెచ్చాను. అదీ అసమగ్రమే అనిపించింది. ఈ సంకలనం ముందుమాటలోనే చెప్పిన ప్రకారం తెలంగాణ ప్రాచీన కవిత్వాన్ని సంకలనం చేయడానికి రెండున్నర సంవత్సరాలుగా ప్రయత్నం చేస్తున్నాను. ఎంతచేసినా ఇంకా ఏదో మిస్సవుతున్నదనే అనపిస్తుంది.

తెలంగాణ ఐక్యవేదిక, ఉస్మానియా చరిత్రశాఖ, తెలంగాణ రచయితల వేదిక తదితరులెందరో తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక రాజకీయ చరిత్రను, నిర్మించడానికి ప్రయత్నించారు.

ఇన్ని ప్రయత్నాల తర్వాత కూడా చేయాల్సింది ఎంతో ఉంది. అది పూర్తి చేయడం ఇలాంటి ప్రయత్నాల వల్ల సాధ్యంకాదేమోననిపిస్తున్న తరుణంలో తెలంగాణ చరిత్రను నిర్మించడమనే మహత్తర కార్యం సంఘటితంగా, ప్రణాళిక బద్దంగా చేస్తే తప్ప సాధ్యం కాదని అనిపిస్తున్న సమయంలో హిస్టరీ కాంగ్రెస్ తరహాలో 'తెలంగాణ హిస్టరీ సొసైటీ సంస్థ ఏర్పడనున్నదని తెలిసి గొప్ప ఆనందం కలిగింది. తెలంగాణ రైటర్స్ కాలం తొలిసన్నాహక సమావేశాలకు ఎంతో ఉద్వేగంతో పాల్గొన్నాను. అంత ఉద్వేగంతో ఈ సన్నాహక సమావేశానికి వచ్చినాను.

ఇంతమంది (ఇక్కడికి రాని ఇంకెంతమందితో సహా) తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణం పట్ల ఉద్విగ్న మనస్సుతో ఇక్కడి రావడం అందరికీ ఆనందం కలిగించే విషయమే గాక ఎవరికి వాళ్లం కర్తవ్యం నిర్దేశం చేసుకోవాల్సిన సందర్భం. ఇంతమందిని ఇక్కడికి రప్పించడానికి చొరవతీసుకున్న కె. శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్, ఎన్. వేణుగోపాల్, లోకేశ్వర్...లు, తెలంగాణ కవులకు ప్రాధాన్యాన్నిస్తూ తెలుగు సాహిత్య చరిత్ర రచించి సమావేశంలో ప్రధానోపన్యాసం చేసిన ముదిగంటి సుజాతారెడ్డిలు అభినందనీయులు.

ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణంలో ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించే పనిలో 'తెలంగాణ చరిత్ర సొసైటీ' నిర్వహించాల్సిన విషయాల్ని కొన్ని ప్రస్తావిస్తాను.

'మును మార్గకవిత లోకం
బున వెలయుగ దేశికవిత బుట్టించి తెను
గున నిలిపి రాంధ్ర విషయమున
జన చాళుక్య రాజు మొదలుగ పలువుర్.....'

నన్నెచోడుడి ప్రసిద్ధ పద్యం అందరికీ తెలిసిందే. ఇందులో నాల్గవ పాదంలో 'జన చాళుక్య..' అనే దానికి 'జన సత్యాశ్రయని తొట్టి చాళుక్య నృపుల్' అనే పాఠాంతరం ఉంది.

మొదటి పాఠం ప్రకారం తూర్పు చాళుక్యులే తెలుగు కవిత్వ ప్రేరకులుగా కనిపిస్తారు. రెండవ పాఠం ప్రకారం సత్యాశ్రయుడు ప్రేరకుడుగా కనిపిస్తాడు. కాని తూర్పు (వేంగీ) చాళుక్యులలో ఆరవ శతాబ్దికి చెందిన కుబ్జవిష్ణువర్ధనుడి (బాదామి చాళుక్యుడు - తూర్పు చాళుక్యుల స్థాపకుడు) కి సత్యాశ్రయ బిరుదు ఉంది కాని అప్పటికి తెలుగు కవిత్వం మొదలు కాలేదు. రాజరాజ నరేంద్రునికి తాత వరసైన సత్యాశ్రయుడనే రాజు ఉన్నాడు కాని అతడు అనామకుడు. తెలంగాణలోని కొలనుపాక మొదటి రాజధానిగా పాలించిన కళ్యాణి చాళుక్యులు (కాలం 965-1189)లలో ఒక సత్యాశ్రయుడు (997-1008) ఉన్నాడు. ఇతడే నన్నెచోడుడు పేర్కొన్న సత్యాశ్రయుడేమో పరిశోధించవలసి ఉన్నది. ఇంతకంటే, తూర్పు చాళుక్యులకంటే ముందే వేములవాడ చాళుక్యుల (750-973) లో రెండవ అరికేసరి కన్నడ ఆదికవి పంపన ఆశ్రితుడు కావడం (940), పంపన కన్నడంలోనే గాక తెలుగులో కావ్యం రాసి ఉండడం (జినేంద్ర పురాణం, ఆధారం వేటూరి ప్రభాకర శాస్త్రి ప్రబంధ రత్నావళి), ఇతని సోదరుడు జినవల్లభుడి కంద పద్యాలు లభించడం (కుర్క్యాల శాసనం - 940), జినవల్లభుడి ఆధ్వర్యంలో మల్లియ రేచన (940) కవిజనాశ్రయమనే చంధోగ్రంథం రాసి వుండడం, ఈ వేములవాడ

చాళుక్య రాజు బద్దెగుడు (బద్దెన) (960-966) నీతి శాస్త్రముక్తావళి, సుమతి శతకం? రాసి వుండడం తెలంగాణ నుంచే తెలుగు సాహిత్యం మొదలైందనడానికి ఆస్కారం కలిగిస్తున్నవి. వీటన్నిటినీ నిర్ధారరణ చేయవలసిన కర్తవ్యం ఇలాంటి సంస్థలు నిర్వర్తించాల్సి ఉంది. ఇంతేకాదు తెలుగు సాహిత్య చరిత్ర రచన చేసిన వాళ్లు పరిశోధన చేసిన వాళ్లందరూ తెలంగాణేతరులు కావడం వలన తెలంగాణ నుంచి సాహిత్యం వచ్చే అవకాశం లేదని పూర్వనిశ్చిత అభిప్రాయం లేదా దురభిప్రాయం ఆ పరిశోధకులకు ఉన్నందు వల్ల కూడా, అలాగే వారికి తెలంగాణ భౌగోళిక పరిచయం లేకపోవడం వలన కొన్ని తప్పుడు నిర్ధారణలు జరిగి ఉన్నాయి.

ఉదాహరణకు కొన్ని. కందుకూరి రుద్రకవి ప్రకాశం జిల్లాలోని కందుకూరి వాడనీ చింతలపాలెం అనే గ్రామాన్ని ఇబ్రహీం కుతుబ్‌షా (1550-1580) నుండి అగ్రహారంగా పొందినవాడని వేటూరి ప్రభాకరశాస్త్రి, ఆరుద్ర మొదలైన పరిశోధకులు తేల్చినారు. కానీ నల్లగొండ జిల్లాలో దేవరకొండ సమీపంలో మరొక కందుకూరు ఉంది. ఈ కందుకూరులో కూడా జనార్ధనస్వామి దేవాలయం, సోమేశ్వరాలయం ఉన్నావి. ఈ కందుకూరుని జనార్ధన కందుకూరు అని కూడా పిలుస్తారు. రుద్రకవి జనార్ధనాష్టకం రాయడమే కాకుండా తన కావ్యాల్ని జనార్ధనస్వామికి, సోమేశ్వరుడికి అంకితమిచ్చినాడు. రుద్రకవి తను పొందిన అగ్రహారాన్ని 'ద్వితింత్రిణి' అని పేర్కొన్నాడు. ద్వితింత్రిణి అనగా రెండుచింతల లేదా రెంటచింతల. ఈ గ్రామం ప్రకాశం జిల్లాలో లేదు. అందువల్ల ద్వితింత్రిణిని 'చింతపాలెం' గా వ్యాఖ్యానించి రుద్రకవిది ఆ కందుకూరు అనే నిర్ణయించినారు. నిజానికి రెంటచింతల గ్రామం ఉంది. కాని అది గుంటూరు జిల్లాలో ఉంది. ఈ గ్రామం ప్రకాశం జిల్లా కందుకూరు కన్నా నల్లగొండ జిల్లా కందుకూరుకు చాలా సమీపంలో ఉంది. ఇబ్రహీంకుతుబ్‌షా దేవరకొండ దుర్గపాలకుడుగా ఉన్నపుడు పొందిన అగ్రహారమిది. అందువల్ల రుద్రకవి దేవరకొండ సమీపంలో కందుకూరి వాడని చెప్పవచ్చు. ఈ కవి కోస్తా జిల్లాలవాడుగానే పరిగణించ బడుతున్నాడు.

ఇక అప్పకవి గురించి. అప్పకవి తన తాత 'అభినవ చూతపురి'లో నివాసమున్నాడని పేర్కొనగా, 'అభినవ చూతపురి' కి 'మామిళ్లపల్లి' అనే అర్థం చెప్పి ఆ గ్రామం గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాలోని మామిళ్లపల్లి అగ్రహారం గానీ కావచ్చనీ కొమర్రాజు లక్ష్మణరావు పేర్కొన్నాడు. తర్వాతి చరిత్రకారులు దానినే అంగీకరించి అప్పకవిని ఆ జిల్లా వాడనే నిర్ధారించారు. కాని మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి తాలూకాలోని 'లేమామిడి' అనే గ్రామానికి 'అభినవ చూతపుర'ము సంస్కృతీకరణమని బూర్గుల రామకృష్ణారావుగారు నిరూపించినా ఇంకా అప్పకవి కోస్తా జిల్లాల

వాడుగానే పరిగణింప బడుతున్నాడు. ఇలాగే అనంతామాత్యుడు, కృష్ణమాచార్యులు, నూతన కవి సూరన మొదలగు చాలామంది గురించి తప్పుడు నిర్ధారణలు జరిగి ఉన్నాయి.

కొంతమంది తెలంగాణ కవుల్ని సాహిత్య చరిత్రల్లో పేర్కొనలేదు. ఉదాహరణకి 'దాశరథి చరిత్ర' అనే నిరోష్ఠ్యోత్తర రామాయణ గ్రంథకర్త పురుషకారి కేశవయ్య. ఈ కవిని గాని ఇతని గ్రంథమును గాని పూర్వ సాహిత్య చరిత్రకారులు, ఆధునిక సాహిత్యచరిత్రకారులు తమ గ్రంథాల్లో పరామర్శించలేదు. సమగ్ర ఆంధ్రసాహిత్యంగా పిలువబడే ఆరుద్ర గ్రంథంలో కూడా ఇతని గ్రంథప్రసక్తి లేకపోవడాన్ని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రిటైర్డ్ లెక్చరర్ వల్లపురెడ్డి బుచ్చారెడ్డి పురుషకారి కేశవయ్య రాసిన దాశరథి చరిత్ర (నిరోష్ఠ్యోత్తర రామాయణం) పరిష్కరిస్తూ పేర్కొన్నాడు.

ఇట్లా చాలామంది కవుల గురించి తప్పుడు నిర్ధారణలు, అసలు పేర్కొనక పోవడం జరిగాయి. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటివెన్నో ఉన్నాయి. దాచేస్తే దాగని సత్యాలన్నీ బయటకు రావాలి. అప్పుడే తెలుగు సాహిత్యచరిత్ర, తెలంగాణ సాహిత్య చరిత్ర సంపూర్ణమవుతుంది. అందుకు తెలంగాణ చరిత్ర నిర్మాణ సంస్థలు పూనుకోవాలి. ప్రతిదీ ఇప్పుడు పునర్నిర్మాణం కావాలి.

- చరిత్ర రచన, చరిత్ర నిర్మాణం ఎట్లా చేయాలనేది హిస్టరీయోగ్రాఫి అనే పేరుతో ఒక శాస్త్రంగా రూపొందిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

- ఎవరిచరిత్రను వాళ్లే రచించుకోవాలనే సూత్రీకరణను అనుసరించి, తెలంగాణ చరిత్రను తెలంగాణ నిర్దిష్ట భౌగోళిక, రాజకీయ దృక్కోణం నుంచి నిర్మించాలి.

- తెలంగాణలోని వివిధ అస్తిత్వాల (స్త్రీ, దళిత, ముస్లిం వాద) దృక్కోణం నుంచి కూడా తెలంగాణ చరిత్రను నిర్మించాలి. అందుకు ఆ వివిధ అస్తిత్వ సమూహాలనుంచి ప్రాతినిధ్యం ఉండేలా చూడాలి.

- చరిత్ర నిర్మాణంలో యూరోపియన్ నమూనాను అనుసరించవలసిన అవసరం లేదు.

- ఇంతవరకు చరిత్ర నిర్మాణమంతా ఆధిపత్య వర్గాల అనగా పాశ్చాత్య మెజారిటీ మత పురుష, ఆధిపత్య ప్రాంత, ఆధిపత్య వర్గ (భూస్వామ్య, పెట్టుబడిదారి) ఆధిపత్య సాంస్కృతిక, అగ్రవర్ణ దృక్కోణం నుంచి నిర్మించడం జరిగింది. అందుకు భిన్నంగా అధీన వర్గాల లేద ఉపశ్రేణుల సబాల్టన్) అనగా ప్రాచ్య, వెనుకబడిన ప్రాంత, పీడిత వర్గ, స్త్రీ, దళిత ముస్లింల అధీన సాంస్కృతిక దృక్కోణం నుంచి నిర్మించాలి.

- వివిధ ప్రాంత నిర్దిష్టతలతో ప్రమేయం లేకుండా ప్రపంచమంతటా చరిత్ర క్రమం ఒకే విధంగా ఉంటుందనే విశ్వజనీన దృక్కోణం సరికాదు. పాశ్చాత్య చరిత్ర క్రమం, ఆసియా క్రమం ఒకే విధంగా లేదనే విషయంలో చాలా చర్చ జరిగిన విషయం ఇక్కడ గుర్తుంచుకోవాలి. దేశాల విషయంలోనే కాక దేశంలోని ప్రాంతాల విషయంలో కూడా ఈ వైవిధ్యం ఉంది. ఉదాహరణకు తెలుగు అభ్యుదయకవిత్వ చరిత్ర, తెలంగాణ అభ్యుదయ కవిత్వ చరిత్ర ఒకటి కాదు. ఆ ప్రత్యేకతల్ని గమనించకుండా (తెలుగు అభ్యుదయ కవిత్వం గేయ ఛందస్సులో, వచన కవిత్వం వస్తే, తెలంగాణ అభ్యుదయ కవిత్వం పద్యంలో పాటలో వచ్చింది) తెలంగాణ కవుల్ని మిగతా అభ్యుదయ కవులతో పోల్చి తెలంగాణ కవులు వెనుకబడి ఉన్నారని సూత్రీకరించడం జరిగింది. తెలంగాణ భాషను వెనుకబడిందిగా సూత్రీకరించడం జరిగింది. ఆ పోలిక నుంచే 'తెలుగు వర్డ్స్‌వర్త్' లాగా 'తెలంగాణ శ్రీశ్రీ' అనే సూత్రీకరణ వచ్చింది.

- రెండు జిల్లాల భాష మొత్తం తెలుగు భాష కానట్టు ఒక కులంలోని సంస్కరణోద్యమం మొత్తం అన్ని కులాల సంస్కరణోద్యమం కానట్లుగానే ఒకటి రెండు ప్రాంతాల్లో వచ్చిన స్త్రీవాద కవిత్వాన్ని మొత్తం తెలుగు దేశ కవిత్వంగా చెప్పడం తప్పు. కడప, కర్నూలులో స్త్రీవాదం లేదు, దళితవాదం ఉన్నట్లు లేదు కాని ఆ ప్రాంతం విద్యార్థులు తమ ప్రాంతంలో లేని, రాని వాదాల్ని తమ సాహిత్య పరిణామంలో భాగంగా చదుపుకోవాలి - ఎట్లా వాళ్లు దాంతో ఏకీభవిస్తారు. అయినా బలవంతంగా తమలో భాగంకాని దాన్ని భాగంగా చదువుకోవాలి. ఇది సరికాదు.

కాబట్టి ఉమ్మడి అనగా అందరికీ వర్తించే అనగా విశ్వజనీన, చరిత్ర ఉండదు అనేది గుర్తుంచుకోవాలి. మాట్లాడే అంశాల మధ్యన మాట్లాడని (బిట్వీన్ ది లైన్స్) అంశాలు వుంటాయి. చెలామణీ అయ్యే వాటి గర్భంలో చెలామణిలో లేని అంశాలు దాగి ఉంటాయి. వేమనలాగా, నాసరయ్యలాగా, వీరబ్రహ్మంలాగా... అలాంటిదే తెలంగాణ చరిత్ర.

అన్ని స్థిర నిర్మాణాల్ని నిరాకరించడమే పునర్నిర్మాణం (డీకన్‌స్ట్రక్షన్).

## తెలంగాణ చరిత్రలోనైనా ముస్లింలకు న్యాయం జరగాలి

- స్కైబాబ

చిన్నప్పుడు పంద్రాగస్ట్‌కు సంబరంగా ఊరు తిరిగేది. బడి ముందల జెండా ఎగరేసినంక సార్లు, ఊరిపెద్దలు స్వాతంత్ర్యం గురించి, పోరాటయోధుల గురించి చెప్తుంటే ఒళ్లంతా ఊగిపోయ్యేది. పెద్దయినంక తెలిసింది, దేశ విభజన పేరుమీద లక్షల మంది బలయ్యిన్రని, సరిహద్దుల్లో రక్తం యేరులై పారిందని. ఇట్లనే నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ అని, హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన రోజని చెబితే పాల మనసుతోని నిజమే అని నమ్మినం. తీరా చూస్తే - నిజాం పాలనను మించి ఆంధ్ర పాలనను తెచ్చిన్రని తెలిసొచ్చె. ఈడ గుడ నిజాం నిరంకుశ పాలన అని, రజాకార్ల దౌర్జన్యాలు అనే విన్నం గనీ పోలీస్ యాక్షన్ పేరు మీద లక్షలమంది ముస్లింలను కాల్చి చంపేసిన్రని తెలియకపాయె. ఆ విషయం ఇప్పటోల్లకు అస్సలు తెల్వకుండ ఎందుకు దాచిపెట్టిన్రని ఇవాళ మేం అడుగుతున్నం. అంతమందిని పొట్టనుబెట్టుకోవడం వెనుక హిందుత్వ భావజాలమె పని చేసిందనుకోవాల్నా? అంటే అప్పట్నించే ఆ భావజాలం అంత బలంగా ఉందా? 'హైదరాబాద్ : ఆఫ్టర్ ద ఫాల్' అనే సంకలనంలో (సంకలన కర్త ఒమర్ ఖాలిదీ) పోలీస్ యాక్షన్‌లో రెండు లక్షల మంది ముస్లింలు చంపబడినట్లు ఒక రిపోర్ట్ (పండిట్ సుందర్‌లాల్, ఖాజీ మొహమ్మద్ అబ్దుల్ గఫార్)ఉంది. కాని ఆ సంఖ్య ఆరు లక్షల వరకు ఉండొచ్చని కొందరు చెబుతున్నారు. అందమైన ముస్లిం ఆడపిల్లల్ని, ఆడోల్లని తెలుగోల్లు మాయం చేసిన్రని, పోలీసులు వారాల తరబడి రేప్ చేసిన్రని, లూటీలు, దహనాలకు లెక్కే లేదని తెలిసినప్పుడు మన ప్రజాస్వామ్యం మీద అనుమానమేస్తుంది. పోలీస్ యాక్షన్ గురించి మాట్లాడడం ఇప్పుడెందుకు అనే తెలంగాణ వాదులున్నారు. వాళ్లను ఎట్ల అర్థం జేసుకోవాలె? లక్షలమందిని చంపడం, ఇండ్లను దోచుకోవడం వల్ల కొన్ని తరాలపాటు ముస్లింలు కోలుకోకుండా చేశారు. ఇవాల్టి తెలంగాణ ముస్లింల వెనుకబాటుకి అది కూడా ఒక కారణం. ఎంతమందిని చంపిన్రనే దగ్గర్నించి ముస్లింల మానసిక హింస దాక అప్పటి ఆ విషయాలన్నీ వెలికి తీయాల్సిన అవసరం ఉంది.

అయాల ఉర్దూ రాజభాష. ముస్లింలు- తెలుగోల్లు ఉర్దే చదివేదికదా. ఇండియాల కలపంగనె ఒక్కసారిగ ఉర్దూ తీసిపారేసి కోస్తాంధ్ర తెలుగు అందరి మీద రుద్దిన్రు. ప్రజాస్వామ్యం తెచ్చిన్రు గదా, మరి కనీసం ముస్లింల కోసమన్నా ఉర్దూను ఎందుకు కాపాడాలె? అదే హైదరాబాద్ రాష్ట్రం వేరుగానే ఉంటే కనీసం తెలంగాణన్న వేరుగ ఉంటే ఉర్దూ ఇయాల రెండో భాషగా ఉండేది కదా (ఏమో?) ఇయాల ఆంధ్రా పాలకులు ఉర్దూను తొక్కి పారేసి ముస్లింలు గుడ కోస్తాంధ్రంలనే జవాబు చెప్పేటట్టు తమ

ఆధిపత్యాన్ని రుద్దుతున్రు. ఉర్దూను ఛీత్కరించడంతో తెలంగాణలో తెలుగు చదివినోళ్లు లేక ఉద్యోగాలన్నింటిలో ఆంధ్రావాళ్లను నింపడం మొదలైంది. అప్పట్నించి మొదలైన ఆంధ్రావలస ఇప్పటికీ ఆగలేదు. ఇక్కడ ముస్లింలకు కూడా పెద్దఎత్తున అన్యాయం జరిగింది. కేవలం ఉర్దూ తెలిసిన అప్పటి ఉద్యోగస్తులకు తెలుగు లేక ఇంగ్లీషు నేర్చుకోవాలని అప్పటి ప్రభుత్వం కొన్ని రోజుల గడువు ఇచ్చింది. మరి నేర్చుకోలేని వాళ్లు ఉద్యోగాల నుంచి తీసే వేయబడ్డారా? లేక ఏం జరిగింది అనే విషయం తెలియదు. అప్పటి దాకా ఉర్దూ మీడియంలో చదువుకున్న యువతరం ఏమయ్యారు? అప్పట్నించి తెలుగు మీడియం ప్రవేశ పెడితె మరో 15 నుండి 20 ఏళ్లకు కదా విద్యావంతులయ్యేది, ఈ మధ్య కాలమంతా ముస్లింలు అన్యాయం పాలయినట్లే కదా? ప్రజాస్వామ్యం పేరుమీద ఇంత దోపిడీ, ఇంత అన్యాయానికి పాల్పడడమేమిటి?

మొత్తం ఇండియాల ఉర్దూ మాట్లాడేవాళ్లు కోట్లమందే ఉంటారు. ఇన్ని భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డయి, మరి ఒక్క ఉర్దూ రాష్ట్రమైనా ఎందుకు లేదని ప్రశ్నించుకోవడం దేశద్రోహం ఏం కాదు కదా. దేశ విభజనాభారాన్ని ఇక్కడి ముస్లింల మీద మోపి ఆ విషయం తప్పించడం సరైందా? ఉర్దూ మాట్లాడేవారు ఒక్కతాన లేకుండా దేశవ్యాప్తంగా పరుచుకొని ఉన్నారు కదా అనే సాకు సరైందా? ఎంఐఎం ఉర్దూ రాష్ట్రం కావాలని 1956లో డిమాండ్ చేసి ఉంటే ఎంత బాగుండు.

ఇవాళ హైదరాబాద్ లోని, తెలంగాణలోని ఉర్దూ మాట్లాడేవారు, సాహిత్యకారులు ఒక వేరే ప్రపంచంగా బతుకుతున్నారు. వాళ్లను మిగతా ప్రపంచంతో కలిపే ప్రయత్నం ఏది జరుగుత లేదు. వాళ్లతోనూ వేరే ప్రపంచం కలవడం లేదు. వాళ్ల సమస్యలు, వాళ్ల బాధలు వేరేగా ఉన్నాయి. ఆ అంతరాన్ని పెరగనివ్వకుండా చూడాల్సి ఉంది.

తెలంగాణ హిస్టరి రికార్డు చేసేప్పుడు విధిగా ఉర్దూ మాట్లాడేవాళ్ల ప్రాతినిధ్యం ఉండేలా చూడాలి. వాళ్ల ఫీలింగ్సుని పరిగణనలోకి తీసుకోవాలి. ఉర్దూను తెలంగాణ ద్వితీయ భాషగా గుర్తించాలి.

తెలంగాణ గురించి కమ్యూనిస్టులు, ఆంధ్రా వలస పాలకులు రాసిన చరిత్రే ఆధారం కావడం (?)తో అసలు విషయాలు ఎన్నో మరుగున పడ్డాయి. వెలుగులోకి రావలసిన విషయాలు చాలా ఉన్నాయి. అందులో కొన్ని ముఖ్యమైన విషయాల్ని 'ముల్కి' ముస్లిం ప్రత్యేక సంచికలో సంగిశెట్టి శ్రీనివాస్ రాసిండు. 'నిజాం చరిత్రకు చెదలు' పేరుతో రాసిన ఈ వ్యాసంలో ముస్లింలు మనసులో అనుకున్నప్పటికీ బయటికి చెప్పలేని కొన్ని విషయాలతో పాటు ఎన్నో కొత్త కోణాల్ని రికార్డు చేసిండు.

దానిపట్ల ఎంతో వ్యతిరేకత వ్యక్తం కావడం ఆశ్చర్యం కలిగించింది. రాజరికాన్ని సపోర్టు చేయడంగా కొందరు మాట్లాడిన్రు. నిజాంలది రాజరికమే. (ఆ పేరుమీద రెడ్డి, వెలమ తదితర భూస్వాములు రాజ్యం చేసిన విషయం మరుగున పెడుతున్నారు.) ఇవాల ప్రజాస్వామ్యం పేరుమీద కోస్తాంధ్రులు నియంతృత్వం చెలాయిస్తుంటే, రాజరికం కన్నా ఎక్కువ దౌర్జన్యాలు చెలాయిస్తుంటే ఆ విషయం చెప్పొద్దంటే ఎట్ల? పైగా తమ కులాలకు చెందిన వాళ్లు రాజులుగా ఉన్నా ఆయా కులాల వాళ్లు మీరు రాజులు కదా అనే నిందను మోయడం లేదు. ఇండియాను క్రిస్టియన్లు పరిపాలిస్తే ఇవాళ క్రిస్టియన్లను మీరు పాలకులు కదా అని అడగడం లేదు. కాని ముస్లింల విషయానికొస్తే మాత్రం మీరు 400 ఏండ్లు పాలకులుగా ఉన్నరు కదా అని కొన్ని బీసీ సంఘాలు ముస్లిం రిజర్వేషన్ను వ్యతిరేకించాయి. అట్లె ఎంతోమంది అలా వాదిస్తున్నారు. ఆఖరికి తెలంగాణ వాదుల్లో కొందరు గూడ అయ్యే మాటలు మాట్లడడం విన్నప్పుడు చీదరింపు కలిగింది. ఏ కులంగాని, మతంగాని, జాతిగాని ఇట్లా మీరు పాలకులు కదా అనే భారాన్ని మోయడం లేదు. ఒక్క ముస్లింలు తప్ప.

పాలకులు అన్న ఈ భారాన్ని మోస్తున్న ముస్లింలకు సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని బిజెపి నిర్వహిస్తున్న తీరు వల్ల కూడ మరింత నష్టం కలుగుతున్నది. ఇట్లాంటి సందర్భంలో సెప్టెంబర్ 17ను ఉత్సవంగా టిఆర్ఎస్ నిర్వహించకుండా ఉండడం సరైందనిపించింది. కాని కొన్ని తెలంగాణ సంఘాలు ఈ విషయాన్ని విస్మరించడం విస్మయం కలిగించింది. కోస్తాంధ్ర వలసవాద పాలన నుంచి తెలంగాణకు విమోచన కలగనంతవరకు సెప్టెంబర్ 17ను ఉత్సవంగా జరపడంలో అర్థం లేదు.

ఇవాళ రాజకీయంగా జరుగుతున్న ఉద్యమంపై ముస్లింలకు అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. రాజకీయ ఉద్యమం సాహిత్యరంగంలోని ఒక వర్గాన్ని ప్రభావితం చేస్తుండడం ఇవాల్టి విషాదం. టిఆర్ఎస్ మొదలయింతర్వాత బిజెపి నుంచి చీలిపోయి టిఎస్ఎస్గా ఏర్పడ్డ నరేంద్ర పార్టీ టిఆర్ఎస్లో కలవడం ముస్లింల పట్ల వివక్ష మొదలు కావడానికి కారణమైంది. (ముస్లింలకు కూడా టిఆర్ఎస్పై అనుమానం మొదలైంది.) అంతదాకా ముస్లింల జనాభా తెలంగాణలో గణనీయంగా ఉందని భావించి 15 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించిన టిఆర్ఎస్ ఆ వాయిస్ను తగ్గించింది. అట్లే సీట్ల కేటాయింపులోనూ అన్యాయం చేసింది. ఇప్పటికీ ఆరెస్సెస్ వాడినే అనే నరేంద్ర రెండవ నాయకుడుగా ఉండడంతో ముస్లింలలో ఒక సందిగ్ధం నెలకొంది. తెలంగాణ వస్తే బిజెపి ప్రాబల్యం పెరుగుతుందని జరిగిన ఒక ప్రచారం కూడా ఇందుకు కారణం. పైగా అసెంబ్లీలో ముస్లింల ప్రతినిధిగా మాట్లాడే ఎం.ఐ.ఎం కూడా తెలంగాణ పట్ల మొదట వ్యతిరేకంగా మాట్లాడడం కూడా మరో కారణం. కాని

ఎం.ఐ.ఎం ముస్లింల ప్రతినిధి కాదని ఇక్కడ అందరం గుర్తుంచుకోవాలి. ఒక్క పాతబస్తీలో తప్ప మిగతా తెలంగాణ జిల్లాల్లో ముస్లింలు ఎం.ఐ.ఎం.తో లేరు.

నరేంద్ర తదితర ఆరెస్సెస్ వాదుల (రాజకీయ పార్టీలతో సంబంధం లేని ఆరెస్సెస్ వాదులు కూడా) వల్ల ఇవాల ముస్లింల పట్ల ఒక వివక్ష, మౌనం చూస్తున్నాం. చివరికి ఇదే భావజాలం సాహిత్యానికి కూడా పాకి మిగతా ఐడెంటిటీ ఉద్యమాలతో పాటు ఒక ఉద్యమంగా నడుస్తున్న తెలంగాణ వాదం ముస్లిం వాదం పట్ల వివక్ష చూపుతూ వస్తున్నది. వేదికల మీద ముస్లింలు లేకుండానే నడిపిస్తున్నది. ఒక్క తెలంగాణ సాంస్కృతిక వేదిక కాస్త ఇందుకు మినహాయింపుగా కనబడుతున్నది.

సాహిత్య ఉద్యమంతోపాటు తెలంగాణ రాజకీయాలు కూడ ముస్లింల పట్ల స్పష్టమైన ప్రకటనలు (చేయాలి) చేసేలా తెలంగాణ ముస్లింల ప్రాముఖ్యతను రికార్డు చేయవలసిన అవసరం ఉంది. తెలంగాణ హిస్టరీ రికార్డు చేసే క్రమంలో ముస్లింల కోణం నుంచి లెక్కలోకి తీసుకోవల్సిన అంశాలు క్లుప్తంగా :

1. పోలీస్ యాక్షన్‌లో ఎన్ని లక్షలమంది ముస్లింలను హత్యచేశారో, ఎంతమంది ముస్లిం స్త్రీలను, అమ్మాయిల్ని రేప్ చేశారో, మాయం చేశారో, ఎన్ని ఇండ్లను దోచుకున్నారో, ధ్వంసం చేశారో విస్తృత అధ్యయనం జరగాలి. అందుకు ప్రతిగా ముస్లింలను ఆదుకోవాలి.

2. తెలంగాణకు సంబంధించి హిస్టరి దగ్గర్నుంచి అన్ని రంగాల్లో ఉర్దూ మాట్లాడేవాళ్ల ప్రాతినిధ్యం ఉండాలి. ముస్లింల ప్రాతినిధ్యం ఉండాలి.

3. ఉర్దూను తెలంగాణ ద్వితీయ భాషగా గుర్తించాలి.

4. తెలంగాణ గురించి కమ్యూనిస్టులు, ఆంధ్రా వలసపాలకులు రాసిన చరిత్ర ఆధారంగా ముస్లింలను చూడొద్దు. తెలంగాణలో ముస్లింలు ఒక భాగం అని నమ్మేవాళ్లు కొత్తగా రాసే చరిత్ర ఆధారంగా చూడాలి.

5. శ్యాంసుందర్ అనే దళిత నాయకుడు హైదరాబాద్ ప్రత్యేక దేశంగా ఉండాలని యుఎన్ఓ తో మాట్లాడిండని, ఇంకో మూడు రోజులు గనుక పోలీస్ యాక్షన్ జరగకపోయి ఉంటే హైదరాబాద్‌ను ప్రత్యేక దేశంగా యుఎన్ఓ ప్రకటించేదని చెప్తున్నరు. అట్లా జరిగి ఉంటే ఇండియా అనే ఒక దేశం మరో దేశమైన హైదరాబాద్ మీద దాడి చేసినట్లు అయ్యేది. ఇదిలా ఉంటే హైదరాబాద్ సంస్థానాన్ని

ఇండియన్ యూనియన్‌లో కలపడం వల్ల దళితులకు అన్యాయం జరుగుతుందని ఫీలయిన శ్యాంసుందర్ చెప్పిన కారణాలేమిటి? అవి నిజ మయ్యాయా?

6. నిజాం రాజుల పాలనను ముస్లింల పాలన అనడాన్ని వ్యతిరేకించాలి. ముస్లింలు 400 ఏండ్ల పాలకులు అనే ప్రచారాన్ని ఖండించాలి.

7. నిజాం రాజ్యంలో 'నిరంకుశత్వం' నడిపిన రెడ్లు, వెలమలు తదితర భూస్వాముల గురించిన విషయాలు కూడ చర్చకు రావాలి. ఎవరి నిరంకుశత్వం ఎంత అనేది తెలియాలి.

8. ఉర్దూలో, పార్సీలో ఉండే సోర్సెస్ (ఆధారాలు) వెలికి తీయడం ద్వారా అనేక అబద్ధపు ప్రచారాలు, అసలు నిజాలు వెలుగులోకి వస్తాయి, కనుక ఆ ప్రయత్నం జరగాలి.

9. ఖాసీం రజ్వీ ఆటోబయోగ్రఫీ పాకిస్తాన్‌లో ముద్రణ పొందింది. దాన్ని రిఫర్ చేయడం జరిగితే అతను రజాకార్ ఉద్యమం చేయడానికి అసలు కారణాలు తెలిసే అవకాశం ఉంది. ఆ ప్రయత్నం జరగాలి.

10. నిజాం కాలంపై విదేశాలలో సైతం రిసెర్చ్‌లు జరుగుతుంటే ఇక్కడ ఇంతటి వివక్ష, దుష్ప్రచారం జరుగుతుండడాన్ని చర్చకు పెట్టాలి.

11. కోస్తాంధ్రలో దళిత క్రైస్తవులు ఎక్కువగా ఉన్నట్లుగా ఇక్కడ ముస్లింలు ఎక్కువగా ఉన్నారు. మరి దళితుల నుంచే ఎక్కువగా ముస్లింలుగా మారిన్రా అనే విషయంలో అధ్యయనం జరగాలి. దీన్ని లెక్కలోకి తీసుకోవాలి.

12. ఆంధ్రుల వలస వల్ల చిల్లర వ్యాపారాల దగ్గర్నుంచి ఉద్యోగాల దాకా ముస్లింలు అన్యాయానికి గురయిన, గురవుతున్న విషయం రికార్డు కావాలి.

13. హైదరాబాద్ లాంటి చోట్ల పోలీసు శాఖలో ముస్లింల శాతం మరీ తక్కువగా ఉన్నది. దీనివల్ల ఎంతో వివక్ష కొనసాగుతున్నది. ఇది ఏ భావజాలం వల్ల జరుగుతున్నది? దీని వెనుక రాజకీయాలేమిటి? పోలీసుల భర్తీలో ముస్లింల పట్ల వివక్ష గురించి చర్చ జరగాలి.

14. ముస్లింలకు, తెలుగోల్లకు మధ్య ఏయే కారణాల వల్ల అంతరం పెరుగుతున్నదో చూడాలి.

## తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణం సమన్వయంతో జరగాలి

- శ్రీధర్ దేశ్‌పాండే

'కిసీ ఖౌమ్‌కో ఖతం కర్నాహైతో ఉస్కీ జబాన్ ఖీంచ్‌లో' అన్న ఉర్దూ మాట ఈ మధ్య చాలాసార్లు విన్నాము. తెలంగాణ సందర్భానికి ఈ మాట చాలా అర్థవంతంగా అన్వయం అవుతుంది. 1956 నవంబర్ 1న ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు విలీనం అయి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైన నాటి నుంచి, తెలంగాణ అంతకు ముందు అనుభవించిన రాజ్యాధికారాన్ని కోల్పోయింది. వనరుల వినియోగంపై నియంత్రణ కోల్పోయింది. మొత్తంగా తెలంగాణ ఆంధ్రకు వలస ప్రాంతంగా మారిపోయింది. వలసవాదులు ఎప్పుడైనా తమ ఆధీనంలో ఉన్న వలస ప్రాంతంలో రాజ్యాధికారాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం, తమ ఆర్థిక లక్ష్యాలను నెరవేర్చుకోవడం కోసం సాంస్కృతికంగా స్థానిక ప్రజలను అణిచివేతకు గురిచేశారు. స్థానిక ప్రజల భాషా సంస్కృతులను న్యూనత పరచడం, వారు అనాగరికులని ముద్రవేయడం, వారిని ఉద్ధరించడం కోసం తాము వచ్చామని చెప్పుకోవడం యూరోపియన్ వలసవాదులు చేసిందే. స్థానిక భాషల్ని నిర్మూలించి తమ భాషల్ని ప్రజలపై రుద్దారు. స్థానిక సంస్కృతులను, చరిత్రను పాఠ్యపుస్తకాలలో లేకుండా చేసి వారి చరిత్ర నుండి పరాయికరించారు. ఈ సాంస్కృతిక దాడి లక్ష్యం వలసవాదుల ఆధిపత్యాన్ని సవాలు చేయకుండా స్థానిక ప్రజలు వారిని పాలకులుగా, తమ ఉద్ధారకులుగా అంగీకరించి లొంగి ఉండడం. 1956 నవంబర్ 1 తర్వాత ఆంధ్ర వలసవాదులు సరిగ్గా ఇదే తరహా సాంస్కృతిక వలసదాడిని కొనసాగించారు.

నిజానికి విలీనానికి ముందు నుంచే తెలంగాణ పట్ల ఆంధ్రులకు చిన్న చూపు ఉండదనడానికి అనేక దృష్టాంతాలు చరిత్రలో రికార్డు అయి ఉన్నాయి. అందులో ముడుంబై రాఘవాచార్యుల వారి తెలంగాణ తెలుగును 'తౌరక్యాంధ్రం'గా ఎద్దేవా చేసిన మాటలు సుప్రసిద్ధం. అట్లానే తెలంగాణలో కవులే లేరని చెప్పడం. ఈ చిన్న చూపు విలీనం అనంతరం తీవ్రతరమైంది. రెండున్నర జిల్లాల ప్రజలు మాట్లాడే తెలుగును వ్యవహారికం పేరు మీద తెలంగాణ ప్రజల మీద రుద్దారు. ఆంధ్రుల చరిత్రనే తెలుగువారి చరిత్రగా స్థిరీకరణ చెందింది. మూడు వేల సంవత్సరాల మహోన్నత చారిత్రక, సాంస్కృతిక వారసత్వం కల్గిన తెలంగాణ తెలుగు వారి చరిత్రలో స్థానం కోల్పోయింది. ప్రాచీన చరిత్ర మొదలుకొని, ఇటీవలి చరిత్ర వరకు తెలంగాణకు దొరకవలసిన స్థానం దొరకనే లేదు. తెలంగాణ చరిత్ర పరిశోధన మూలపడింది. తెలంగాణ చారిత్రిక, సాంస్కృతిక సంపదను పరిరక్షించడంలో పూర్తి నిర్లక్ష్యం కారణంగా అనేక విలువైన పురావస్తు సంపద చోరికి గురికావడమో విధ్వంసానికి గురికావడమో జరిగింది. తాళ

పత్రాలు, ప్రాచీన గ్రంధాలు, పత్రికలు ఏవీ మిగలని దౌర్భాగ్యస్థితి. ఇటీవలి చారిత్రక ఆధారాలు సైతం ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ధ్వంసం అయినాయి.

ఇది ఇట్లుండంగా తెలంగాణ చరిత్రను వక్రీకరించడం, మరుగునపరచడం మరో రకమైన సాంస్కృతిక దాడి. విజేతల చరిత్రే చరిత్ర అన్నట్లు చరిత్ర పాఠ్య పుస్తకాలు రూపొందుతున్నాయి. తెలుగు వారికి గర్వకారణంగా విజయనగర సామ్రాజ్యాన్ని చూపుతారే తప్ప తెలంగాణ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని పాలించిన కాకతీయులు మరుగున పడతారు. ఆంధ్ర ప్రాంతంలో జరిగిన బ్రిటిష్ వ్యతిరేక పోరాటాలు, ఆ పోరాటంలో పాల్గొన్న నాయకులే చరిత్రకు పనికివస్తాయి తప్ప తెలంగాణలో జరిగిన నిజాం వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు, ఆ నాయకుల జీవిత చరిత్రలు చరిత్రకు పట్టవు, పైగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట లక్ష్యం విశాలాంధ్ర స్థాపన అని వక్రీకరిస్తారు. పొట్టి శ్రీరాములు అమరత్వం వల్లనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్లాటైందని అబద్దాన్ని చరిత్రగా మనకు చెబుతారు. శ్రీబాగు ఒడంబడిక చరిత్రలో భాగమవుతుందికాని పెద్దమనుషుల ఒప్పందం చరిత్రకెక్కదు. అల్లూరి సీతారామారాజు తెలుగు ప్రజలందర్కీ తెల్సిన ఆదివాసి పోరాట యోధుడే. కాని రాంజీగోండు, కొమురం భీములు చరిత్రకెక్కరు. ఇట్లా ఎన్నయినా చెప్పవచ్చు.

తెలంగాణ అనేక రాజకీయ సామాజిక ఉద్యమాలకు ఊతమిచ్చిన నేల. 1857 భారత ప్రధమ స్వాతంత్ర్య సమరం ఉత్తర భారతాన్ని కుదిపేస్తున్న వేళ, ఆ సమరంలో భాగం కాకుండా బ్రిటిష్ వాళ్లకు మద్దతునిచ్చిన నిజాం రాజ్యంలో తుర్రెబాజ్‌ఖాన్ నాయకత్వంలో బ్రిటీష్ రెసిడెన్సీపై దాడి జరిగింది. ఆ పోరాటంలో తుర్రెబాజ్‌ఖాన్ అమరుడైనాడు. ఆ మహత్తర ప్రతిఘటన చరిత్రకు అందకుండా పోయింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించిన రాంజీగోండు. అడవిపై, గ్రామాలపై హక్కును కోరుతూ కొమరంభీం బాబెఝురీ పోరాటం ఇటీవలదాకా ఎవరికీ తెలియని చరిత్రగా మిగిలిపోయింది. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటాన్ని ఇప్పటికీ మెయిన్‌స్ట్రీమ్ చరిత్రకారులు గుర్తించలేదు.

ఆంధ్రప్రాంతంలో జరిగిన జాతియోద్యమం పాఠ్యపుస్తకాలకి రాగలిగిందే కాని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఆ స్థాయికి చేరనేలేదు. ఆనాటి పోరాటయోధులకు ఇప్పటికీ స్వాతంత్ర సమరయోధులకు అందుతున్న పెన్షన్లు అందటం లేదు. త్యాగాలకు మారుపేర్లు అయిన 1952 ముల్కీ ఉద్యమం, 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం చరిత్రలు సమైక్యరాష్ట్ర చరిత్రలో సముచిత స్థానాన్ని పొందే అవకాశమే లేదు.

ఇవ్వాళ తెలంగాణ సందర్భంలో తెలంగాణ భాషా, సాంస్కృతిక అస్తిత్వ కాంక్ష ప్రభలంగా వ్యక్తమవుతున్నది. కవులు, రచయితలు, బుద్ధిజీవులు తమ సాంస్కృతిక, చారిత్రిక మూలాలోకి వెళ్లి తమ అస్తిత్వ పునాదులు వెతుక్కుంటున్నారు. మరుగున పడిపోయిన మహోన్నతమైన తమ చారిత్రక సాంస్కృతిక సంపదను తవ్వి తీస్తున్నారు. చరిత్రను పునర్లిఖిస్తున్నారు. అస్తిత్వ స్పృహతో విశ్లేషించుకుంటున్నారు. వలసవాదుల వక్రీకరణలను తిరగదోడి అసలైన తెలంగాణ చరిత్రను పునర్‌నిర్మిస్తున్నారు. తెలంగాణ చరిత్ర పునర్‌నిర్మాణం అంటే పురావస్తు పరిశోధనే అన్న సంగతి తెలంగాణ చరిత్ర పరిశోధకులకు తెల్సు. ఆ కృషిలో కపిలవాయి లింగమూర్తి, విరువంటి గోపాలకి ృష్ణ, సంగనభట్ల నరసయ్య, జితేంద్రబాబు, మలయశ్రీ, జయధీర్ తిరుమలరావు, బి.ఎస్. రాములు, కె. శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్, ముత్యం, లోకేశ్వర్, ముదిగంటి సుజాతారెడ్డి, రావి ప్రేమలత, ఎన్. వేణుగోపాల్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి తదితర తెలంగాణ బిడ్డలు తెలంగాణ చరిత్ర పరిశోధనలో, చరిత్ర పునర్‌నిర్మాణంలో, చరిత్ర విశ్లేషణలో విలువైన పాత్రను పోషిస్తున్నారు.

అయితే ఈ కృషి వ్యక్తిగత స్థాయిలో జరుగుతున్నది. ఈ కృషి మరింత సమన్వయంతో జరగవలసి ఉన్నది. మన ముందరున్నది పెద్ద కొండ. కొండను తవ్వడం ఒక్కరితో అయ్యేపనికాదు. పది మంది చేతులు కలపాలి. సుదీర్ఘకాలం తవ్వకం పని సాగుతూనే ఉండాలి. ఆ కృషిని, ఆ పరిశోధనను సమన్వయ పరిచేందుకే తెలంగాణ హిస్టరీ సొసైటీ అవసరమని భావించాము. ఔత్సాహికులైన కొందరం తెలంగాణ హిస్టరీ సొసైటీ అవిర్భావానికి జూన్ నెల మొదటివారంలో ఒక సన్నాహక సమావేశాన్ని నిర్వహించాం. స్పందన గొప్పగా ఉంది. ఈ సొసైటీ అవిర్భవించాలని, సొసైటీ ఆధ్వర్యంలో తెలంగాణ చరిత్ర పరిశోధన ముమ్మరం కావాలని, సొసైటికి తమ వంతు సహకారం అందిస్తామని హాజరయిన సభికులు వాగ్దానం చేశారు. అయితే సొసైటి సన్నాహక సమావేశానికి వేసవి సెలవుల కారణంగా విశ్వవిద్యాలయ చరిత్ర అధ్యాపకులను, డిగ్రీ కళాశాలల చరిత్ర అధ్యాపకులను, చరిత్ర పరిశోధక విధ్యార్థులను, పి.జి. విద్యార్థులను ఆహ్వానించలేకపోయాం. విస్తృతస్థాయి సమావేశం మరొకటి ఏర్పాటు చేసి చరిత్ర పరిశోధనతో సంబంధం ఉన్న అందరినీ ఆహ్వానించి తెలంగాణ హిస్టరీ సొసైటీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉన్నది. సొసైటీకి ఒక మానిఫెస్టో రూపొందించి ఆమోదించుకోవాల్సి ఉన్నది. చరిత్ర పరిశోధనకే అంకితమైన వ్యక్తులే తెలంగాణ హిస్టరీ సొసైటీలో పని చెయ్యాలని మా ఆకాంక్ష. తెలంగాణ చరిత్రను విశ్లేషించడంలో, పునర్ నిర్మించడంలో సొసైటీ సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ సొసైటీ పనితీరుకు అవి అడ్డంకి

కాకూడదు. అన్ని అభిప్రాయాలను సొసైటీ చర్చకు పెడుతుంది. అంతిమంగా ప్రజలు అసలైన న్యాయనిర్ణేతలు.
తెలంగాణ హిస్టరీ సొసైటి వర్ధిల్లాలని కోరుకుంటున్నాను.

## తెలంగాణ పరిశోధన, గత అనుభవాలు

- కె. శ్రీనివాస్

తెలంగాణ చరిత్రను నిర్మించడం కానీ, పునర్నిర్మించడం కానీ తెలంగాణ అస్తిత్వ ఉద్యమానికి అత్యవసరం. తెలంగాణ చరిత్రలో శూన్యంగా ఉన్న భాగాలు చాలా ఉన్నాయి. అక్కడ చరిత్రను నిర్మించాలి. తెలంగాణ చరిత్రలో చాలా వక్రీకరణలు, తప్పుడు వ్యాఖ్యానాలు, పొరపాటు అన్వయాలు ఉన్నాయి. అక్కడ చరిత్రను పునర్నిర్మించాలి. బాధిత అస్తిత్వంగా కానీ, సామ్రాజ్యశక్తిగా కానీ, సాంస్కృతిక నిక్షేపంగా కానీ, విశిష్ట ప్రాంతంగా కానీ తెలంగాణకు ఒక ప్రత్యేకమైన గతం ఉన్నదని గుర్తించి, ఆ పరంపరతో వర్తమానాన్ని రాజకీయంగా, సృజనాత్మకంగా అన్వయించినప్పడే తెలంగాణవాదం సమగ్రం అవుతుంది. నిజానికి మలిదఫా ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష పూర్తిగా వ్యక్తం కాకముసుపే, తెలంగాణ ఒక ప్రశ్నగా, ఒక శోధనగా చరిత్రసీమలను పరామర్శించసాగింది. ఆత్మగౌరవానికి అన్వయించడానికి ప్రయత్నించింది. ఉద్యమం బలపడుతున్న కొద్దీ - తెలంగాణ చరిత్ర నిర్మాణ పునర్నిర్మాణాల మీద ఆసక్తి, ఉత్సాహం, ఆత్రుత సహజంగానే పెరిగిపోతున్నాయి. తెలంగాణ మొత్తంగా తనను తాను గతంతో అనుసంధానం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టే, తెలంగాణ చరిత్ర రచన కూడా గతంలో జరిగిన ప్రయత్నాలకు తనను కొనసాగింపుగా మలచుకోవలసిన అవసరం ఉన్నది. గతంలో జరిగిన చరిత్ర పరిశోదనల స్వభావానికీ, పరిధికి నేటి అవసరాలకు చాలా వ్యత్యాసం ఉన్నప్పటికీ, నాటి అనుభవాల నుంచి నేర్చుకోవలసినది చాలా ఉన్నది. పొందవలసిన ప్రేరణ కూడా ఎంతో ఉన్నది. ఆ పరంపర ఎక్కడ భగ్నమైనదో, దానిలో కొనసాగించవలసినది ఏ మాత్రమో కూడా నిర్ధారణ చేయవలసి ఉన్నది.

తెలంగాణలో తెలుగువారి ప్రజాహిత కార్యక్రమాలకు ప్రారంభమనదగిన శ్రీకృష్ణదేవ రాయాంధ్రభాషానిలయం స్థాపన (1901) వెనుక చారిత్రక దృష్టి, అభినివేశం ముఖ్యపాత్ర నిర్వహించాయి. రాబర్ట్ సోవెల్ రాసిన హంపీ విజయనగర మహాసామ్రాజ్యా ప్రత్యక్ష కథనాలు

వైభవగతాన్ని ప్రేరణగా ముందుకు తేగా, భాషాసాహిత్య పోషకుడిగా చెప్పుకుంటున్న శ్రీకృష్ణదేవరాయల పేరిట హైదరాబాద్‌లో గ్రంథాలయ స్థాపన జరిగింది. బ్రిటిష్ వారి పాలనలో సంస్కరణలను, విద్యావ్యాప్తిని చవిచూస్తున్న కోస్తా, రాయలసీమ ఆంధ్రులు ఒకవైపు, నిజాముల పాలనలో మధ్యతరగతీ, విద్యావకాశాలూ లేని తెలంగాణ వారు మరొక వైపు - ఉండగా, అందరికీ కలిపి ఒక సాంస్కృతిక వికాస ఎజెండాను రూపొందించాలన్న ఆలోచన చేసింది కొమర్రాజు వెంకటలక్ష్మణరావు, మునగాల రాజానాయని వెంకటరంగారావు, రావిచెట్టు రంగారావు. ఈ ముగ్గురే హైదరాబాద్‌లో కృష్ణదేవరాయభాషానిలయాన్ని, హనుమకొండలో రాజరాజనరేంద్రాంధ్ర భాషానిలయాన్ని స్థాపించినవారు కూడా. వీరు స్థాపించిన విజ్ఞాన చంద్రికమండలి తొలినాటి తెలుగువికాసానికి దోహదం చేసిన సంస్థ. 'పద్యకావ్యములు, నాటకములు, భాషా విషయిక చర్చలు, వాజ్మయవిషయిక చర్చలు భాషాభివృద్ధికి అత్యంత యావశ్యకంబులైనను ఈ విషయిక గ్రంథములు మేము ప్రస్తుతము వ్రాయను, వ్రాయించను తలచుకొనలేదు. 1. దేశచరిత్ర 2. మహాపురుషుల జీవితములు 3. ప్రకృతి లేక భౌతిక శాస్త్రములు, రాజకీయ ఆర్థిక శాస్త్రములు ఇంగ్లిషులోని సర్వోపయోగ కరంబులైన గ్రంథముల యొక్క భాషాంతరీకరణములను మాత్రమే ప్రచురించదలచినారము' అని విజ్ఞానచంద్రిక తన ఎల్లలను నిర్దేశించుకున్నది. ఒక వికాసోద్యమానికి వచనం, అందులోనూ పరిజ్ఞానాన్ని అందించే వచనం ఎంత అవశ్యకమో విజ్ఞానచంద్రిక గుర్తించింది. తెలంగాణలో తొలినాటి వాంగ్మయంలో కూడా ఈ అవగాహన ప్రతిబింబించింది. నేటి తెలంగాణ ఉద్యమంలో కవిత్వం వెల్లువగా రావడం, జ్ఞానసంబంధమైన వచనం అతి తక్కువగా రావడం ఈ సందర్భంగా గమనించదగ్గది.

తెలుగువారి చరిత్ర రచనాకృషిలో భాగంగా కొమర్రాజు వెంకట లక్ష్మణరావు తెలంగాణ పై చూపిన ఆదరం అనన్యమైనది. తెలంగాణను చరిత్రకు గనిగా గుర్తించడంలో మాత్రమే కాదు, చరిత్రరచనలో జరుగుతున్న అన్యాయాన్ని గమనించడంలో కూడా ఆయన ఎంతో ముందున్నారు. తెలుగువారి తొలినివాస ప్రాంతం తెలంగాణాయేనని ఆయన ఒక నిర్ధారణ చేశారు. త్రిలింగాల నుంచి తెలుగు అన్న మాట పుట్టలేదని, తెలుగు నుంచే త్రిలింగ పదకల్పన జరిగిందని ఆయన రాశారు. ప్రతాపరుద్రుని ఆస్థానపండితుడు విద్యానాథుడు మొదటిసారి పేర్కొన్న త్రిలింగ దేశానికి మూలమైన మూడు శైవక్షేత్రాలు కాళేశ్వరం, శ్రీశైలం, దాక్షారామం అనీ, కాళహస్తి అందులో లేదని కూడా ఆయనే స్పష్టం చేశారు. కాళేశ్వరం బదులు కాళహస్తిని పేర్కొనేవారి దృష్టిలో ఉన్నది బ్రిటీషాంధ్ర రాజకీయపటమే తప్ప చారిత్రక దృష్టి కాదని ఆయనే పరోక్షంగా సూచించారు. తెలుగువారి చరిత్రకు సంబంధించిన

అనేక కీలకాంశాలు, ఖాళీలు తెలంగాణ పరిశోధనతో పరిపూర్తి అవుతాయని ఆయన అభిప్రాయపడేవారు. ఆయన సాహచర్యంతో తెలంగాణ పరిశోధకులు ఆదిరాజు వీరభద్రరావు తరువాతి కాలంలో ఎంతో విలువైన పరిశోధనాకృషి చేశారు.

శేషాద్రిరమణ కవులలో ఒకరైన దూపాటి వేంకటరమణాచార్యులు గుంటూరు మండలం నుంచి వచ్చినవారైనప్పటికీ, మనసావాచా తెలంగాణను జన్మభూమిగా స్వీకరించినవారు. 'నైజాము రాష్ట్రప్రశంస' పేరుతో ఆయన తెలంగాణ ప్రాంత ఘనకీర్తిని, వర్తమాన అవసరాలను ప్రస్తావిస్తూ రాసిన పద్య సంపుటి తెలంగాణ అస్తిత్వాని కీర్తించిన ఆదికావ్యం. తెలంగాణ ఆంధ్రోద్యమానికి అనుబంధంగా పనిచేసిన ఆంధ్రపరిశోధక సంఘంలో, లక్ష్మణరాయ పరిశోధకమండలిలో ఆయన పాలుపంచుకున్నారు. ముఖ్యంగా, తెలంగాణ సాహిత్యచరిత్రకు సంబంధించిన వక్రీకరణలను సవరించడంలో వెంకటరమణాచార్యుల కృషి చెప్పకోదగ్గది. '.. పరిశోధకుల బ్రిటిషు ఆంధ్రదేశమునందే తమ దృష్టి ప్రసరింపజేసి చరిత్ర గ్రంథము ముగించుటచే నిజాము రాష్ట్రమునందలి చరిత్రమింత వరకు దుర్భేద్యముగా నుండెననుటలో సాహసములేదు' అని ఆనాడే కుండబద్దలు కొట్టిన సాహసి ఆయన.

'ప్రతి దుర్గరూపంబు పటమందు జిత్రించి పరిశోధకులకెల్ల బంపవలయు
చిక్కిన కావ్యంబు చేజారనీయక ప్రత్యంతరబులేర్పర్చవలయు
శాసనశిలలెల్ల చదరమైపోకుండ వలయు ప్రయత్నముల్ సలుపవలయు
పరిశీలనార్థమై పరతెంచుయువకుల యెడల నన్నిటను దోడ్పడగవలయు
శక్తికొలదిగ మాతృభాషా సపర్య
తెనుగు మానిసి చేసియే తీరవలయు
జిన్ని సుతులార? యంచు నాశీర్వదింప
రాదే మమ్ముల నైజాము రాష్ట్రమాత!'

(నైజాము రాష్ట్ర ప్రశంస) అని సందేశమివ్వడమే కాకుండా, స్వయంగా వందలాది అలభ్యగ్రంథాలను సంపాదించి, ఆముద్రిత గ్రంథాలను పరిష్కరించి తెలంగాణ సాహిత్యచరిత్రకు వనరులను సమకూర్చిపెట్టారు. శేషాద్రిరమణకవులు, వరంగల్లులో దేవులపల్లి వేంకటాచలపతిరావు, తూము వరదరాజులు వంటివారితో కలసి స్థాపించిన కాకతీయ గ్రంథమాల వేంకటరమణాచార్యుల పరిశోధనాఫలాలను అనేకం ప్రచురించింది. ఒక్కొక్క విడత వందలాది మైళ్ల దూరం, పదుల సంఖ్యలో గ్రామాలు, స్థలాలు సందర్శించి శాసనాలను, కావ్యప్రతులను ఆయన సంపాదించారు. గోదావరి

మండలంలోని లేములవాడ తప్ప మరొక వేములవాడ, గుంటూరు వేదాద్రి తప్ప యాదగిరిగుట్ట తెలియని బ్రిటిష్ ఆంధ్రులకు తెలంగాణలోని వేములవాడను, యాదగిరిగుట్టను పరిచయం చేశారు. ఇది కేవలం ప్రవృత్తితోనో, అభిరుచితోనో మాత్రమే చేసిన కృషికాదు. తెలంగాణ విశిష్టతను, ప్రాముఖ్యాన్ని పూర్తిగా గుర్తించి మమేకభావనతో జరిపిన ప్రయత్నం. తెలంగాణ భాష గురించి నాటికే వినిపిస్తున్న హేళనలను ఖాతరు చేయక ఆయన చెప్పిన మాటలు - 'నిజాము రాష్ట్రమున బరిశుద్ధమగు నాంధ్రభాషా స్వరూపము ద్యోతకమగు తావులు కలవు. రయిలు మార్గము విడచి నాలుగైదు ఆమడల దూరమేగితిమేని సదాచార నిరతులై సీమోల్లంఘనము గావింపని జానపదులు గానవత్తురు. వారలుచ్చరించు ఆంధ్రభాష గ్రాంథికభాషా రహస్యములు వెల్లడింపగలదు. ఆంధ్రసూర్యరాయాంధ్ర నిఘంటువునకు వాడుక మాటల సేరుటలో బనిచేసిన పండితుని నిజాము రాష్ట్ర వ్యవహారాంధ్ర వాఙ్మయమును సంస్కరించి గ్రంథస్తము గావించుటలో బనిచేయించిన బాగుండెడిది' (నిజాము రాష్ట్ర పరిశోధనోద్యమము, వ్యాసం. ఆంధ్రాభ్యుదయం మాసపత్రిక, 1924) పరిశోధనాకృషిని ఒక ప్రజా ఉద్యమం అవసరాలకు అనుగుణంగా నిర్వహించడం ఎలాగో ఆయనను, ఆదిరాజు వీరభద్రరావును చూసి నేర్చుకోవాలి.

ఆధునికతలోకి ప్రయాణించడానికి 20వ శతాబ్దారంభంలో తెలంగాణ వేసిన తొలి అడుగులో చరిత్ర పరిశోధన ఒకటికాగా, ఆ ప్రయత్నం రెండు రకాలుగా సాగింది. గతావశేషాల అన్వేషణ ఒకటి కాగా, వర్తమానం గురించిన అభివర్ణన, సమాచార క్రోడీకరణ మరొకటి. సామ్రాజ్యా వైభవాన్ని ఒక మార్గం ముందుకు తెస్తుండగా, స్థానిక చరిత్రలు మరొకవైపు వచ్చాయి. తెలంగాణ నుంచి వెలువడిన తెలుగు పత్రికల్లో 1940ల దాకా స్థానిక కథనాలు, క్షేత్రకథనాలు అనేకం కనిపిస్తాయి. నైజాము ఆంధ్రజాతీయతను నిర్మించడానికి అవసరమైన చారిత్రక పరిశోధననీ, స్థానిక క్షేత్రకథనాలను, వర్తమాన సమాచార క్రోడీకరణను ముప్పేటగా కొనసాగించిన ఉద్యమ పరిశోధకుడు, చరిత్రకారుడు ఆదిరాజు వీరభద్రరావు, లక్ష్మణరావు దగ్గర శిష్యరికం, పరిశోధనమండలి కార్యకర్తృత్వం, లక్ష్మణరాయపరిశోధకమండలి సారధ్యం, ఆయనను అవిశ్రాంత రచయితను చేశాయి. గొప్పశైలి, గొప్ప సృజనాత్మకత ఉన్న రచనలేమీ, ఆయన చేయలేదు. కానీ, తెలంగాణ గురించి ఆకాలానికి అత్యవసరమైన, అందరూ తెలుసు కోవలసిన సమాచారాన్ని ఆయన అందించారు. తెలంగాణ చరిత్ర కలిగిన ప్రతి స్థలాన్నీ ఆయన పరిచయం చేశారు. జీవితచరితావళి (రావిచెట్టు రంగారావుతో పాటు ముగ్గరు ప్రముఖుల జీవితచరిత్రలు), మాడపాటి హనుమంతరావు జీవితచరిత్ర, మన తెలంగాణము, ప్రాచీనాంధ్రనగరములు (12 తెలంగాణ ప్రాచీన నగరాలు చరిత్ర), షితాబుఖాను అను సీతాపతిరాజు,

గుల్బర్గా జిల్లా కథనము, పాల్వంచ సంస్థానము, వేములవాడ తిరునాళ్లు, హైదరాబాద్ నగరచరిత్ర, హైదరాబాద్ నగర పరిసరములలోని చెరువులు, ఎల్లోరా, ఎలిఫెంటా గుహాలయములు, కరీంనగర్ జిల్లా కథనము, ఖమ్మం నాడు-నేడు, కోహినురు వజ్రము, వీరభద్రరావు రచనలలో కొన్ని మాత్రమే ఇవి. ఆయన వ్యాసాలు, రేడియో ప్రసంగాలు, వందలాదిగా ఉంటాయి. అందరిలాగానే వీరభద్రరావు కూడా తన రచనావ్యాసంగాన్ని  కవిత్వంతోనే ప్రారంభించారు. ఆదిపూడి సోమనాథరావు ప్రోద్బలంతో గద్యరచనంపైపు మళ్లారు. '(కొమర్రాజు లక్ష్మణరావుగారి).. ప్రవచనముతో ఆవేశము పొందినవాడనై, తెలుగువారి యభ్యుతయమునాకాంక్షించి, విపరీతవాదములకు గురియయిన ఇచ్చటి చరిత్రాంశములను బదిలపరచుటకు తెలంగాణలోని చరిత్రను పరిశోధన కార్యమును ముప్పదియేండ్ల క్రిందటనే ప్రారంభించితిని' అని 1956లో రాసుకున్నారు.

ఆదిరాజు వీరభద్రరావు కానీ, దూపాటి వేంకటరమణాచార్యులు కానీ తెలంగాణ ఆంధ్రమహాసభలో కూడా క్రియాశీలంగా పాల్గొన్నారు. నైజాము ఆంధ్రోద్యమానికి తొలిరూపమైన ఆంధ్రజనకేంద్రసంఘం చెప్పుకున్న కర్తవ్యాలలో పరిశోధన ముఖ్యమైనది. నాడు సంకల్పించిన పనులు ఏడింటిలో అత్యధికం సాహిత్య, సాంస్కృతిక రంగాలకు సంబంధించినవే కావడం గమనార్హం. అందులో నాలుగో కర్తవ్యం "తాళపత్రగ్రంధాలను, శాసనాల ప్రతులను సంపాదించడం, పరిశోధించడం" ఉన్నది. ఆంధ్రజనకేంద్రసంఘం - ఆంధ్రమహాసభగా పరిణమిస్తున్న కాలం 1926 లోనే గోల్కొండ పత్రిక అవతరించింది. ఈ పత్రిక సంపాదకుడు, తెలంగాణ వికాసోద్యమంలో ముఖ్యపాత్రధారి అయిన సురవరం ప్రతాపరెడ్డి స్వయంగా పరిశోధకుడు. ఆయన రాసిన 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' కేవలం తెలంగాణకే కాక, మొత్తం తెలుగుసీమలన్నిటికి విలువైన పరిశోధనాగ్రంధం. 'మనము కూడ చరిత్రకెక్కదగినవారమే' నని ఆయన అన్న మాటలు సుప్రసిద్ధాలు. ఆత్మగౌరవానికీ చరిత్రశోధనకీ ఉన్న ఆవేశపూరిత సంబంధాన్ని సూచించే మాటలు. ఆయన రాసిన రామాయణ విశేషాలు, హిందువుల పండుగలు, హైందవధర్మవీరులు - ప్రతాపరెడ్డి చారిత్రక దృష్టికి, హేతువాదానికి సూచికలు. తెలంగాణలో కవులు లేరనే నిందకు జవాబుగా సమకాలిక కవులనే కాక, ప్రాచీన కవుల రచనలను కూడా క్రోడీకరించిన ఉద్యమ పరిశోధకుడు ప్రతాపరెడ్డి.

ఇంకా చరిత్ర పరిశోధనలో ఎంతో అమూల్యమైన దోహదాలు చేసిన నాటి పండితులలో శిరుగూరిహనుమంతరావు, బూర్గుల రామకృష్ణరావు, తరువాతి కాలంలో గడియారం రామకృష్ణశర్మ, బిరుదురాజు రామరాజు మొదలైనవారు ప్రత్యేకంగా చెప్పకోదగినవారు. చరిత్రకెక్కని తెలంగాణను కనుగొని ఆవిష్కరించిన పరిశోధకులు వారు.

అయితే, చరిత్ర పరిశోధన అంటే కేవలం శాసనాలు, పురాతత్వం, గత పాలకుల వివరాలు మాత్రమే కాదు, ఆలభ్యాలను కనుగొనడం, పరిష్కరించడం మాత్రమే కూడా కాదు. కానీ, ఆనాటి ఉద్యమ అవసరం - అది ముందుకు తెచ్చిన ఎజెండా తెలంగాణను సగౌరవంగా చరిత్రలో ప్రతిష్ఠించడం కావడం వల్ల నాటి పరిశోధన ఆ దిశలో జరిగింది. చరిత్రరచనలోని అనేక కొత్త పార్శ్వాలు, అంగాలు నాటికి ఇంకా అవసరంగా ముందుకు రాలేదు. అయినప్పటికీ, ఆదిరాజు వీరభద్రరావు వంటివారు - సమకాలిక సమాచార వనరులను, ఇతర భాషల్లోని చరిత్ర గ్రంధాలను కూడా ఉపయోగించుకుని చరిత్రను నిర్మించే ప్రయత్నం చేశారు. తాళపత్రాలను భద్రపరచడం, చదవడం వంటి అంశాలను కూడా పాఠకులకు తెలియజెప్పడానికి ఆయన వ్యాసాలు రాశారు. నైజాము రాజ్యం ఘనతను గుర్తించడానికి వీలుగా అందులోని చారిత్రక ప్రదేశాలను, స్థానిక చరిత్రలను రాశారు. నైజామురాజ్యంలో వ్యాసాలు రాసినవారిలో మాడపాటి హనుమంతరావు కూడా ఉన్నారు. ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికల్లో తెలంగాణ గురించి ప్రచురితమైన మొదటి వ్యాసం (1913) మాడపాటి హనుమంతరావుదే. నిజాము రాష్ట్రంలో తెలుగువారి ప్రతిపత్తి గురించి గణాంకాలతో సహా రాసిన ఈ వ్యాసం బహుశా ఆయన వ్యాసాల్లో కూడా మొదటిది అయి ఉండవచ్చు. తెలంగాణ గురించిన సామాజికార్థిక కోణాలను వివరించే గద్యరచనలు కూడా అసంఖ్యాకంగా ఆనాడు వెలువడ్డాయి. వాటికి రకరకాల చరిత్ర గ్రంథాలు, పత్రికలు వనరులుగా ఉపయోగపడ్డాయి. ప్రస్తుత తెలంగాణ ఉద్యమంలో కూడా సమాచారాత్మకమైన పరిశోధనలు, ఇటీవలి చరిత్ర గురించిన విశ్లేషణలు అసంఖ్యాకంగానే వచ్చాయి. అయితే, ఇంతకుముందే చెప్పినట్టు సృజనాత్మక రచనల, పరిమాణం, ఉధృతి, సమాచార, చరిత్ర రచనలకు లేవనే చెప్పాలి.

చరిత్ర పరిశోధన - ఇప్పుడు ప్రధానంగా సమీప చరిత్రపై కేంద్రీకృతం కావలసి ఉన్నది, అవతున్నది కూడా. ముఖ్యంగా గత రెండువందల సంవత్సరాల తెలంగాణ చరిత్రను పూర్తిగా పునర్నిర్మించవలసి ఉన్నది. వేరు వేరు రంగాలలో, వేరు వేరు చోట్ల, వేరు వేరు భాషల్లో హైదరాబాద్ రాజ్యం గురించి పరిశోధనలు జరిగాయి. మౌలిక సమాచారం కూడా ఉన్నది. వాటిని ఒకచోట సమీకరించడం, ఒక అన్వయంతో నిర్మించడం జరగాలి. మొదటి స్వాతంత్ర్య సమరం జరిగి నూటా యాభై ఏండ్లు పూర్తయి, దేశవ్యాప్తంగా ఉత్సవాలు జరిగే సందర్భంలో - 1857లో తెలంగాణ నిర్వహించిన పాత్రను ఆవిష్కరించాలి. అలాగే, చివరి నిజాముల కాలంలో జరిగిన పరిణామాల గురించి నిష్పాక్షికమైన అంచనాలు వేయాలి. ఆధునికత స్పర్శకు దూరంగా ఉన్న తెలంగాణనుంచి ఏవైనా కొత్త మౌలిక భావనలు 19-20 శతాబ్దుల సంధిదశలో వ్యక్తమయ్యాయా- అన్వేషించాలి. తెలంగాణ ప్రత్యేకతను,

విశిష్టతను మరింత బలంగా చూపే ఆకరాలను పట్టుకోవాలి. ఈ పనులు శాసనాలను వెదకడం కోసం చెట్లు పుట్టలు పట్టుకుని వెదకడం కన్నా కష్టమైనవి. ఎందుకంటే - తెలంగాణ ఇటీవలి చరిత్ర ఆధారాలు కూడా దుర్లభాలు. తొలిపత్రికలు హితబోధిని, నీలగిరి, తెనుగు - పూర్తి సంచికలు ఎక్కడా దొరకని దుస్థితిలో ఉన్నా గోల్కొండ పత్రిక ప్రతులు భద్రంగా ఉంటాయో లేదో చెప్పలేని నిస్సహాయత. తెలంగాణ ప్రముఖుల డైరెక్టరీలు, రచయితల డైరెక్టరీలు, గ్రంథసూచికలు, కాలక్రమణికలు - వంటి మౌలిక సదుపాయాలు ఏర్పరిస్తే కానీ యూనివర్సిటీ లలో కూడా ఈ అంశాలపై పరిశోధనలు జరిగే అవకాశం కనిపించడం లేదు. తెలంగాణ గురించి అన్ని శాస్త్రరంగాలలో జరిగిన అన్ని పరిశోధనలను ఒక చోటు నిధిగా సేకరించి, వాటినుంచి ఒక క్రమంలో అమర్చవలసిన సమాచారాన్ని గుర్తించడం పెద్ద బాధ్యత. వీటిలో అనేకం వ్యక్తులుగా చిన్న స్థాయిలో చేస్తున్నవారున్నప్పటికీ, సంస్థలుగా మాత్రమే పూర్తి ఫలితం సాధించగలం. ఆనాటి ఉద్యమం ఇచ్చినంత విలువ, నేటి రాజకీయ ఉద్యమం చరిత్ర నిర్మాణానికి ఇవ్వడం లేదు. చరిత్ర అవగాహనతో ముడిపడిన సీరియస్ అంశాలు కూడా రాజకీయవేదికల మీద శుష్కవాదనలుగా ప్రతిధ్వనిస్తున్నాయి. గట్టి పునాది మీద తెలంగాణ అస్తిత్వాన్ని నిర్మించడం కాకా, సెంటిమెంటు మీద సవారీ చేయాలనుకునే ధోరణి కనిపిస్తోంది. తెలంగాణ పరిశోధకులు, ఈ విషయంలో స్వయంగా తమ పరిధిని, కర్తవ్యాన్ని నిర్వచించుకుని, ఏ ఆవిష్కరణ తెలంగాణను సమగ్రంగా, స్వతంత్రంగా అవిష్కరిస్తుందో ఆ దిశగా పనిచేయడమే చేయవలసిందీ, చేయగలిగిందీ కూడా.

## మరుగున పడేసిన చరిత్ర మర్మం చెబుదాం !

- సంగిశెట్టి శ్రీనివాస్

మన ఘన చరిత్రకు మసిబూసి, మరుగున పడేసి మీరు చరిత్ర హీనులు, కాదు కూడదంటే హీనచరిత్రులు అని ఎక్కిరించిన రాతలకు నోయి తెచ్చుకున్న తెలంగాణ మూతోడ్ జవాబ్ ఇచ్చేందుకు కలాన్ని గళాన్ని కదను తొక్కిస్తోంది. ఎన్కటి సంది ఈ సాలు అట్లనే వస్తుంది. గోలకొండ పత్రికల ముడుంబై రాఘవాచార్యులు అనే ఆంధ్రాయన 'తెలంగాణలో కవులు పూజ్యం' అని విమర్శిస్తూ వ్యాసం రాసిండు. దీంతోటి కడుపు మసిలిన సురవరం ప్రతాపరెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, శేషాద్రి రమణ కవులతో కలిసి 350కి పైగా తెలంగాణ కవులతోటి 'గోలకొండ కవుల సంచిక'ను ప్రచురించి అందరి నోర్లు మూయించిండు. ఇట్ల ఆంధ్రప్రదేశ్ పీడ మనమీద పడకముందు తెలంగాణ నుంచి వచ్చిన పుస్తకాల్లో నికార్సయిన చరిత్ర రికార్డయింది. సరోజిని రేగాని, సజన్‌లాల్ లాంటి చరిత్రకారులు పూనుకొని హైదరాబాద్ ఫ్రీడమ్ స్ట్రగుల్ పుస్తకాన్ని నాలుగు భాగాల్లో రికార్డు చేసింద్రు. అప్పట్నించి ఇప్పటిదాకా ఇక్కడి చరిత్రను ఇడమర్సి చెప్పిన దాఖలాలు లేవు. ఆంధ్రప్రదేశ్ పీడ మనకు సుట్టుకున్నప్పట్నించి తెలంగాణ చరిత్రకు, వైభవానికి గ్రహణం పట్టింది.

"ఒక్కొక్క కవిని 10-15 శతాబ్దముల మధ్య వెనుకకు ముందుకు లాగి బీభత్సము చేసినారు. వాడు మా ప్రాంతము వాడే యనియు, మావాడే యనియు ముప్పతిప్పలు పడి గోవలు గోవలువడ వ్రాసి అచ్చుకొట్టి పెట్టినారు. పాపము ఓరుగల్లు పోతన్నను లాగుకొని పోయి కడప మండలములో స్థాపించినారు. మహబూబునగరు అప్పకవిని గోదావరిలో వేయుదమా కృష్ణలో ముంచుదమా, లేక గుంటూరులో నిశ్చయము చేయుదమా, అని తగవులాడినారు. బిక్కనవోలు (దోమకొండ) సంస్థానము కవియగు మల్లారెడ్డిని లాగుకొనిపోయి గోదావరిలో పడవేసినారు" అని గోలకొండ కవుల సంచిక సంపాదకీయంలో తెలంగాణకు ఆంధ్రులు చేస్తున్న అన్యాయాన్ని సురవరం ప్రతాపరెడ్డి లెక్కగట్టి చెప్పాడు. ఆంధ్ర, తెలంగాణ రెండు ప్రాంతాలకు సమాన ప్రాతినిధ్యం వహించిన కొమర్రాజు లక్ష్మణరావు పిఠాపురములో 1922లో జరిగిన ఆంధ్రపరిశోధక మండలి పంచమ వార్షిక సభలో అధ్యక్షోపన్యాసం చేస్తూ " ఆంధ్రదేశము గురించియు, నాంధ్రరాజుల గురించియు, నాంధ్ర వాఙ్మయము గురించియు నెక్కుడు పరిశోధనలు చేసి క్రొత్త క్రొత్త వింతలను కనుగొనదలచిన వారికి హైద్రాబాదు రాజ్య మందలి తెలుగు భాగమొక బంగారము వంటిది. బ్రిటిషు ప్రభుత్వమందలి తెలుగుదేశమును, నైజాములోని తెలుగుదేశమును ఒకటికి నొకటి తగిలి యున్నను ప్రభుత్వములు భిన్నములగుటచే నుత్తర సర్కారులోని తెలుగువారికి హైద్రాబాదు రాజ్య మందలి తెలుగుదేశమొక

యండమాను దీవివలె దోచుచున్నది. కాని నైజాము రాజ్యమందలి మన బాంధవులను గుఱించి మనమింత భయపడవలసిన పనియు లేదు. ఇంత యౌదాసీన్యముగా నుండుటయు న్యాయము కాదు" అని పేర్కొన్నాడు. 84 ఏండ్ల తర్వాత కూడా నేటికీ ఆ మాటలకు అంతే రిలవెన్స్ ఉంది. దీంతోటి ఆంధ్రులు తెలంగాణ చరిత్ర పట్ల అంతే ఉదాసీనత, అణచివేత వైఖరి నేటికి కొనసాగిస్తున్నారని తెలుస్తుంది. ఉస్మానియాతో సహా ఆంధ్రదేశంలోని ఏ విశ్వవిద్యాలయంలో పరిశోధన జరిగినా (ముఖ్యంగా తెలుగు విభాగాల్లో) తెలంగాణకు సంబంధించిన అంశాలు, ఉప'సంహరణ'కు గురికావడమో కాదంటే ఉప శీర్షికలోనో, అనుబంధంలోనో చోటు చేసుకోవడం పరిపాటయింది. అలవాటుగా మారింది. ఇందుకు కారణాలు కూడా అనేకం ఉన్నాయి. 1927లో రాయప్రోలు సుబ్బారావుతో ప్రారంభమయిన ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు విభాగంలో ఆ తర్వాతి యాభై ఏండ్ల వరకు ఒక్క తెలంగాణ వాడు కూడా హెడాఫ్ ది డిపార్ట్‌మెంట్ కాలేక పోయాడు. పరిశోధన అంశాలు కూడా తెలంగాణకు సంబంధంలేని అంశాలపైనే ఎక్కువగా జరిగాయి. ఆంధ్రప్రాంతంలో పరిశోధకులు తమ ప్రాంతానికి సంబంధించిన అంశాలపై పరిశోధన కొనసాగించగా తెలంగాణలో అలా జరగలేదు. దీనికి 'గైడ్స్' సూచనలు కూడా కారణం. అలాగే మౌలికమైన సమాచార లభ్యత కూడా ఆంధ్రప్రాంతం వారిపైనే అధికం కావడంతో వారిపైనే పరిశోధనలు జరిగాయి. తెలంగాణ వాళ్ళు కూడా ఆంధ్రప్రాంత కవులు, అంశాలపై పరిశోధనలు చేశారు. తెలంగాణ విషయానికి వస్తే ఈ ప్రాంత కవుల రచనలు అందుబాటులో లేకపోవడం. గ్రంథాలయాల్లో అలభ్యం, ఆర్గనైజ్డ్‌గా లేకపోవడం కూడా ఒక కారణం. ఇక్కడి గ్రంథాలయాల్లో తిష్టవేసిన ఆంధ్ర ప్రాంతీయులకు స్థానికుల గురించి తెలియకపోవడం, తెలుసుకోవాలని ప్రయత్నం చేయకపోవడం మరో కారణం.

కాకతీయ యూనివర్సిటీ పూర్తిగా తెలంగాణ విశ్వవిద్యాలయమైనప్పటికీ విశ్వనాథ, కొడవటిగంటి వారి వాఙ్మయ సూచికలు, అలాగే వేటూరి వాఙ్మయసూచి ప్రచురించారు. కాని సురవరం ప్రతాపరెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, వట్టికోట ఆళ్వారుస్వామి లాంటి సాహితీవేత్తల వాఙ్మయసూచీలు ఇప్పటికీ తయారు కాలేదు. అలాగే ఆంధ్రప్రాంత రచయితలు తమకు తెలియకపోవడమంటే 'లేదు' అని దానికింద నిర్ధారించి చరిత్రను అణచివేయడమనేది తరచూ జరుగుతోంది. వాళ్ళు చెప్పిందే పాఠ్య పుస్తకాల్లో చోటు చేసుకుంటుంది. వారి తెలియని తనాన్ని లేని తనంగా మార్చడం తెలంగాణ చరిత్రకు ద్రోహం చేయడమే తొలి తెలుగు కవయిత్రి కుప్పాంబ (1226-1300) విషయంలో ఇదే జరిగింది. రంగనాథరామాయణము రాసిన గోన బుద్ధారెడ్డి కూతురైన కుప్పాంబ మహబూబ్‌నగర్ జిల్లాలోని వర్ధమానపురము రాజధానిగా ఏలిన మల్యాల దండనాథుని భార్య. ఈయన కాకతీయ రుద్రమదేవి

సేనాధిపతి. కుప్పాంబ రాసిన సాహిత్యం తెలంగాణ పరిశోధకుల పరిశ్రమల ఫలితంగా ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తున్నాయి.

1990వ దశకంలో వచ్చిన తెలంగాణ సోయితోటి చరిత్రను క్రమపద్ధతిలో రికార్డ్ చేసే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తెలంగాణ పత్రికారంగంపై ఒక దశాబ్దపు పరిశోధనను 'షబ్నవీస్' పుస్తకంగా 'కవిలె' తరపున 2003లో తీసుకురావడం జరిగింది. ఇందుకోసం ఎంత ప్రయత్నించినా నీలగిరి, తెనుగు పత్రికలు కేవలం ఒక యేడాది సంచికలు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. అలాగే గోలకొండ పత్రికలు ఇప్పటికీ మైక్రోఫిల్మింగుకు నోచుకోక దుమ్ము, ధూళి కొట్టుకొని ఎవరికీ పట్టని బిడ్డలాగ తయారైంది. అయితే ఆంధ్రప్రాంతానికి చెందిన ఆంధ్ర, కృష్ణా పత్రికలు పూర్తిగా మైక్రోఫిల్మింగు చేయబడి అర్కయివ్స్, ప్రెస్‌అకాడెమీ లాంటి ప్రదేశాల్లో నిక్షిప్తం చేయబడ్డాయి. అవి అందుబాటులోకి రావడంతో వాటిలో ఉన్న విషయాలు, సంపాదకీయాలు, సాహిత్యంపై పరిశోధనలు బాగానే జరిగాయి. సుప్రసిద్ధ సాహితీవేత్త అడివిబాపిరాజు హైద్రాబాద్ నుంచి నాలుగేళ్ళు సంపాదకుడిగా ఉండి నడిపించిన 'మీజాన్' పత్రిక ప్రతులు ఇప్పుడు కేవలం స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో మాత్రమే కొన్ని ప్రతులు దొరుకుతున్నాయి. అవికూడా ఆలనా పాలనా లేకుండా పాడయిపోతున్నాయి. ఈ పత్రికల్లో ఆనాటి ఆంధ్రమహాసభ ఉద్యమాలు, తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యం కొన్ని వేల పేజీలకు సరిపడా నిక్షిప్తమై ఉంది. అడివి బాపిరాజు హైద్రాబాద్‌లో పనిచేసిన పాపానికి గాను ఆయన్ని ఆంధ్రులు కూడా అంతగా పట్టించుకోలేదు. ఆయన రాసిన నాటకాలు, వ్యాసాలు, కథలు, పాట కథలు, గేయాలు, సేకరించిన జానపద గేయాలు ఇప్పటికీ వెలుగు చూడలేదు.

ఢిల్లీలోని సాహిత్య అకాడెమీ, నేషనల్ బుక్‌ట్రస్ట్, హైద్రాబాద్‌లోని తెలుగు అకాడెమీ, తెలుగు విశ్వవిద్యాలయాలు ప్రచురించే జీవిత చరిత్రలు, సాహిత్య రచనల్లో ప్రస్తుతం తెలంగాణకు, వారి రచనలకు ఏ మాత్రం ప్రాతినిధ్యం లేదు. ఇంత వరకు ఆళ్వారుస్వామి, ఆదిరాజు వీరభద్రరావు, దాశరథి, భాగ్యరెడ్డివర్మ, సంగెం లక్ష్మిబాయి, సదాలక్ష్మి, బద్దం ఎల్లారెడ్డి, అరిగె రామస్వామి, గడియారం రామకృష్ణశర్మ, కృష్ణస్వామి ముదిరాజ్ మొదలైన తెలంగాణ వైతాళికుల జీవిత చరిత్రలు ప్రచురితం కాలేదు. వారి గురించి దేశ వ్యాప్తంగా తెలవాల్సిన అవసరముంది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ప్రచురించిన వ్యాసరచనల సూచీ, రచయితల రచనలు పుస్తకాల్లో తెలంగాణ సమాచారం ఒక్క శాతానికి మించదు. ఇంత అన్యాయం సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోనే జరిగింది. తెలంగాణ నుంచి రచనలు వెలువరించిన రచయితల గురించి ఇందులో వివరాలు లేకపోవడం విచారకరం. అలాగే

తర్వాతి కాలంలో భారతి సూచి ప్రకటించిన తెలుగు విశ్వవిద్యాలయం అంతే ప్రామాణికంగా హైదరాబాద్ నుంచి సురవరం ప్రతాపరెడ్డి సంపాదకత్వంలో వెలువడిన సుజాత పత్రిక గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. తెలుగు అకాడెమీ వెలువరించిన 'తెలుగు సాహిత్యం కోశం' కూడా తెలంగాణను విస్మరించింది. తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ 'తెలుగు వెలుగులు'లో తెలంగాణ వాటా దిగదుడుపే. ఇంత అన్యాయం జరుగుతున్నా నిలదీయడం ఎక్కడా జరగడం లేదు.

ఈ నేపథ్యంలో తెలంగాణ హిస్టరీ సొసైటీ నిర్మాణం తక్షణావసరమయింది. తెలంగాణ తన చరిత్రను తానే పునర్మూల్యంకనం చేసుకొని అట్టడుగు వర్గాలనుంచి సమాజ చరిత్రను, సాహిత్య, సాంస్కృతిక చరిత్రను తిరగరాసుకోవాల్సిన సమయం ఆసన్నమయింది. మన చారిత్రక వారసత్వ కట్టడాలు కనుమరుగుకాకుండా కాపాడుకునేందుకు ఉద్యమాలు నడిపేందుకు సన్నద్ధం కావాలి. ప్రాంతేతరులు పక్షపాతంతో రచించిన అసత్యాలను, అర్ధసత్యాలను వెలికితీసి అసలైన చరిత్రకు చిత్రిక గట్టాలి. తెలంగాణకు సంబంధించి ఎక్కడ ఏ పరిశోధన జరిగిన అది అందరికీ అందుబాటులోకి వచ్చేలా, అందుకు తగిన ప్రచారం కల్పించేందుకు చర్యలు చేపట్టాలి. అనాది నుంచి ఇప్పటివరకూ తెలంగాణ చరిత్రలో ప్రముఖమైన తేదీలను ప్రకటించి ఆ యా తేదీల్లో వాటి ప్రాధాన్యతకు తగ్గట్టుగా ఉత్సవాలు, వర్ధంతులు, జయంతులు, స్మరణలు, నిర్వహించి విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాల్సిన అవసరముంది. తెలంగాణ వ్యక్తులకు సంబంధించిన జీవిత కోశాన్ని ఒక నిరంతర ప్రాజెక్టుగా చేపట్టి సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సహాయ సహకారాలతో దాన్ని విజయవంతం చేయాలి. ఆనాది నుంచి తెలంగాణలో విస్మృతికి గురైన విశిష్ఠ వ్యక్తుల్ని గుర్తించి జీవిత చరిత్రల ప్రచురణ సంక్షిప్తంగానైనా నిరంతరం కొనసాగించాల్సిన అవసరముంది. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఆ యేడాది మరణించిన వ్యక్తుల్ని ఈ కోశానికి జత పరుస్తూ సరైన సూచికను విడుదల చేసినట్లయితే జయంతులు, వర్ధంతులు నిర్వహించుకోడానికే గాకుండా వారి ప్రతిభను భావి తరాల వారికి అందజేసిన వారమవుతాము. తెలంగాణ పత్రికల వ్యాసరచనల సూచీలు, రచయితల రచనలు, తెలంగాణ సాహితీ కోశం, ప్రత్యేక ప్రాజెక్టుగా చేపట్టేందుకు తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడెమీలపై వత్తిడి తీసుకు రావాల్సిన అవసరముంది.

సాహిత్య, ఆర్థిక, రాజకీయ, సామాజిక చరిత్రలో మరుగునపడేసిన మన ఘన చరిత్రను తవ్వి తట్టలకెత్తుకోవాలి. అందులో దొరికిన మణులు, వజ్రాలను తెలియని వారికందరికీ తెలియ జెప్పాలి. ఈ పని ఎంత తొందరగా చేసినట్లయితే తెలంగాణకు అంత మేలు చేసినవారమవుతాము. తెలంగాణ చరిత్ర పట్ల ఆసక్తిని, అవగాహనను కల్పించేందుకు 'చారిత్రక స్థలాల పర్యటనలు' ఏర్పాటు

చేసుకోవాలి. ఆత్మగౌరవ పోరాటంలోంచి వచ్చిన అస్తిత్వ ఉద్యమాలకు చరిత్ర దారి చూపిస్తుంది. గర్వంగా చెప్పుకోదగ్గ గతం మనకుంది. ఆ గతం 'స్వగతం' కాకుండా గళమెత్తి అందరితో పంచుకోవాలి. ఆంధ్రులు ప్రయత్న పూర్వకంగా మరిచిన మన చరిత్ర మర్మాన్ని విప్పి చెబుదాం. పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ చరిత్రకు తగిన ప్రాధాన్యం దక్కేలా ప్రయత్నిద్దాం.

## 'బాధితుల' చరిత్రను రికార్డ్ చేయాలి

- జె. సుభద్ర

తెలంగాణ హిస్టరీ సొసైటీ ఒక అయిదారుగురు కల్సి 4-6-2006న ఫతేమైదాన్ క్లబ్‌లో పెట్టిండ్రని తెలిసి ఆ మీటింగుకి వెళ్లడం జరిగింది. తెలంగాణ సంస్కృతికి, భాషకు ఇక్కడి వ్యవసాయానికి ఇక్కడి ఉద్యమాలకు, ఇక్కడి రాచరిక చరిత్రలకు, సాహిత్యానికి రచయితలు, రచయిత్రులకు సంబంధించి, పత్రికలు ఇట్లా చాలా విషయాలకు సంబంధించిన చరిత్రనే కనిపించదు. తెలంగాణ ఈపై వాటన్నింటితో ప్రత్యేకమైన చరిత్ర సంస్కృతులు కలిగినగడ్డ. ఇప్పటికైనా కొద్దిమంది ఈ ప్రయత్నానికి ఆయువు పోస్తున్నట్టు బైటకొచ్చి మీటింగు పెట్టడం, ఆహ్వానించడం చాలా సంతోషము.

చారిత్రకంగా తెలుగు ఆంధ్రపేరుతో తెలంగాణ ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక, సామాజిక రంగాల విశిష్టతలు అణగదొక్కబడిన అంశాలన్ని బైటికి తీయాల్సిన అవసరముంది.

పాలకుల చరిత్రనా పాలితుల చరిత్రనా అనేది కాన్షియస్‌గా ఉండాలి. ఆ పాలితుల్లో బాధితుల పక్షాన వుండే కాన్షియస్ వుండాలనే అభిప్రాయంతో ఉండడం చరిత్రలో కింది వర్గాలకన్యాయం జరగకుండా ఉండేది. పిఠాపురం రాజావారు కాకతీయుల చరిత్ర బైటకు తీయడానికి చాలా డబ్బు వెచ్చించాడు. ఈ కాకతీయులు నాలుగవ జాతికి చెందిన వారని తేలింది. ఈ విషయం మహబూబ్‌నగర్ శాసనంలో కూడా ఉంది.

అయితే నాలుగవ తరగతి అనే శూద్రజాతికి చెందిన కాకతీయులు నెల్లూరు నుంచి తిక్కన సోమయాజిని ఎందుకు పిలిచినట్టు? శూద్రుల్ని క్షత్రియులుగా మార్చుకునేందుకు, లేక హిందూ ధర్మాలనేమైనా ప్రతిష్టించడానికా అనేది తెలియదు.

తెలంగాణ ప్రాంతపు జెండర్ విశిష్టత ప్రత్యేకమైంది. ఇతర ప్రాంతాల జెండర్ వివక్షకు స్త్రీ పురుషుల సంబంధాల్లో తేడా సమస్యల్లో కూడా ఉంది. ఈ జెండర్ తేడాలు ఇక్కడ ఇంకో రకంగా ఉంది. ముఖ్యంగా ఇక్కడ ముఖ్యంగా దళిత సంస్కృతి పునాదిగా విరాజిల్లిన ప్రాంతం తెలంగాణ. కులాలమధ్య గుర్తు పట్టగలిగినంత వ్యత్యాసాలు సంస్కృతిలో కనిపించవు. ఒక బ్రాహ్మణ కులాలు తప్పితే కాపు నుంచి ఆఖరి కులాల దాక ఆడవాళ్లు ఆకుచుట్టలు తాగుతరు. కాపు నుంచి చాకలి దాకా ఆడోల్లు ఇంట్లోనే చుట్టలు తాగుతారు. అదే మాలమాదిగ కిందికులాల్లో ఆడమగ కల్సి సుట్టలుతాగుతారు. ఎదురెదురుగా సుట్టలు కలిసి అంటిబెట్టుకొని తాగుతారు. ఇది బి.సిలో చాలా తక్కువ.

ఇక కల్సి కల్లు దాగుడు పైనుంచి కింది దాక ఆడమగ, పిల్లపిస్క అంత కల్సి కల్లు తాగుతరు. ఇది వేరే ప్రాంతాల్లో మహాతప్పు.

ఇక్కడ కుల చరిత్రలు అవి చెప్పే కులాలు ఇంకా ఉన్నాయి. ఇంకా కొన్నాల్లకు ఇవి బతుకుతాయో లేదో కష్టమే. ఇవి రికార్డు చేయాలి. దీంట్లో తెలంగాణ సంస్కృతి చాలా ప్రతిబింబంగా ఉన్నది. కాకిపడుగులోల్లు, పిచ్చుకుంట్లోల్లు, డక్కలి, చిందు, బుడిగెజంగాలు వీళ్లందరు చెప్పే కథల్లో తెలంగాణ చారిత్రక సామాజిక సంపదలున్నాయి. అవి కాపాడుకొని నిక్షిప్తం చేయాలి. ఇక లిఖితాలు సేకరించాలి. వీటిని సంపాదించడానికి ఎన్ని లైబ్రరి గనులు తవ్వితీయాలో. ఒక్క వాక్యంకోసం, పదంకోసం గ్రంధాలయాలన్ని బోర్లించాలి. ఒక్క పదం దొరికినా దాని చుట్టున్న రాజకీయ, ఆర్థిక ప్రాంతాల సంస్కృతిని నిర్మించొచ్చు. యాభై ఏళ్ల కిందటి నుంచే మనప్రాంతం మనకు కాకుండా పోయింది. యాభై ఏళ్ల కింద ఎట్లా మాయమైంది ఎట్లా, ఎలా, ఎక్కడా అనేది పరిశోధించాలి. యాభై ఏళ్లు అంటే మాటలు కాదు. ఒక రెండు తరాల వ్యత్యాసం. 1950కి ముందున్న తెలంగాణ వ్యవసాయం, పరిశ్రమలు నీటి వనరులు, ఖనిజ వనరులు, రాజకీయాలు, ఆర్థికాలు సామాజికాలు, చదువులు, భాష (సంస్కృతి) తిండి, కళలు సాహిత్యం పత్రికలు, ప్రాచీన రచనలు కవులు, సంస్కరణోద్యమాలు, స్వాతంత్ర్యోద్యమాలు, మత సంస్కరణోద్యమాలు ఇట్లా చాలా విషయాల్ని వెలికి తీయాల్సిన అవసరముంది. వీటన్నింటిలో తెలంగాణకు ఒక విశిష్టమైన ప్రత్యేకతవుంది.

ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో 'మతం' అనేది ఇప్పుడున్న హిందూమతంగా లేదు. కులానికో తీరు గ్రామదేవతల నమ్మకాలు తప్ప దేవాలయత్వ హిందూ మతం లేదు. వైదిక మంత్రాలతో, పూజాది కర్మలకొదిగిన హిందూమతంలో ఈ ప్రాంతమతం యిమడదు. ఇక్కడ ప్రతి గ్రామానికి ఒక గుడి అనేది

కూడా ఉండది. (ఏవో కొన్ని జిల్లాలు తప్పితే) ఇంట్ల ఎవరికన్నా బాగలేకుంటే కొబ్బరికాయ గొట్టిమొక్క ఆ కొబ్బరికాయను గూడ 'పలారముల్లో' అని పంచుతారు. పంటలు మొదలయ్యే కాలంలో వర్షాకాలంలో పురుగు పుట్రా లాంటి బ్యాక్టీరియా పెరిగే కాలంలో సామూహికంగా బోనాలు చేయాలనేం లేదు. కలిగినోల్లు బోనామండి పోషమ్మకు, మైసమ్మకు వండిపెడ్తరు. అట్లా ఒక ఆర్గనైజ్డ్ మతం అంటూ ఏమీలేదు. అదీ హిందూ మతమని కూడా నిర్దిష్టంగా చెప్పలేం. వీరి పద్ధతులు హిందూమతంకు యిమడనివి. ఒక జాతర సంస్కృతి పెద్ద ఎత్తున తెలంగాణ ప్రాంతానికుంది. గడిచిన దినాల్లో ఒక సమూహం కోసం ఒక జాతి కోసం మంచి పనులు చేసిన వాళ్ల పేరు మీద జాతర్లు జరుగుతాయి. ప్రతి జాతరకు ఒక చరిత్ర ఉంది, తీయగలిగితే సమ్మక్క జాతర నుంచి నాగోబ జాతర వరకు ప్రతి జాతరను ఒక గొప్ప పోరాట చరిత్ర ఉంది. అవన్ని తవ్వి తీయాల్సిన అవసరముంది. 'ఎవనికి పుట్టినవు బిడ్డా' అంటే ఎక్కెక్కి పడేడ్సే పరిస్థితి తెలంగాణకు కనీసం భవిష్యత్తులో నన్నా రాకుండేట్లుగా ప్రయత్నించాలి.

- తెలంగాణ విశిష్టత కేవలం చరిత్ర సంస్కృతిసే కాక భౌగోళికంగా కూడా భిన్నమైందే. ఈ ప్రాంతం యొక్క మౌలిక అవగాహన తో పాటు వృత్తి చరిత్రకారులైతే బాగుంటుంది. అంతే కాక సాహిత్య, సంస్కృతి, సమాజం పట్ల వారికి అవగాహన కలిగి ఉండాలి. 'తెలంగాణ హిస్టరీ సొసైటీ'లో ఒక ప్రస్తావన కూడా చేయడం జరిగింది. ఏ ప్రాతిపదికలతో, ఏ ప్రతిపాదనలతో చరిత్రను నిర్మించుకోవాలి? అని
- చరిత్ర అనేది ఎమోషనల్ గాఉండది. అది నిర్దిష్ట సాక్ష్యాధారాల్తో ఏర్పాటు చేసుకునేది.
- తెలంగాణ ఒక మౌఖికం ఫోక్ నిర్దిష్టత విస్తృతంగా ఉంది. దీని పట్ల దృష్టి పెట్టాలి.
- బాధితుల చరిత్రనా, పాలకుల చరిత్రనా వెతికి తీసేది అనే దాని మీద చర్చ జరగాలి.
- కొత్త వక్రీకరణలకి వెళ్లగూడదు.

మౌఖిక చరిత్ర, జీవిత చరిత్రలు, రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక 'జెండర్ చరిత్ర'లు సేకరించాలి.

- ఇష్టం లేని వాటిని తక్కువజేసి ఇష్టమున్న వాటిని ఎక్కువ జేయడం చరిత్రలో ఎక్కువగా కనబడ్తుంది. వీటిని అధిగమించాలి.
- తెలంగాణ చరిత్ర అనేటప్పటికి ఒక కాకతీయులే కన్పిస్తారు. కాని ఎన్ని శిథిల చరిత్రలున్నాయి. ఎన్ని శిథిల సామ్రాజ్యాలున్నాయో పరిశోధించాలి.
- జిల్లాల చరిత్రలు - జిల్లాల పాటలు, సంకలనాలు, వ్యవసాయ కుల చరిత్రలు, సూచికలు, శాసనాలు, సాహిత్యం - కళలు, పత్రికలు ఇవన్నీ శోధించాలి.

- తెలంగాణ ప్రత్యేకత దళిత బహుజనుల పునాదుల్లో ఉన్న సంస్కృతి సంపద ఉంది. ఇది అవగాహనలో ఉంచుకుంటే మనకు తెలంగాణ పునాదుల చరిత్ర అర్థమవుతుంది. మతం, కళలు, కథలు, భాష, తిండి, శ్రమ, వ్యవసాయం, జెండర్, కులాలు ఇవన్ని నిర్మింపక మౌఖికంగానే ఉన్నాయి. తెలంగాణకే ఎక్కువగా మౌఖిక సంప్రదాయ సంపత్తి కోకొల్లలుగా ఉంది.
- పాలితుల, బాధితుల చరిత్ర, సంస్కృతికి ఎక్కువ గౌరవం, విలువలతో కూడిన అవగాహనతో వెలికి తీయాలి. పాలకుల చరిత్ర పాలితుల చరిత్రను ఒకే కోణం నుంచి చూడకుండా ఉండాలి.
- తెలంగాణలో కుల చరిత్రలు, చాలా వరకు కింది ప్రజల చరిత్ర మౌఖికంగా ఉన్న దాన్ని కుల చరిత్రలు చెప్పే కాటి కాపర్లు, సిందు మందెచ్చులోళ్లు, గొల్లకథలు, డక్కలి, బుడిగె జంగాల, కాటికాపరులు మొదలగు వాళ్ల దగ్గరికెళ్లి వాళ్లు చెప్పే కథలన్నింటిని రికార్డు చేయాలి.
- ఇది గొప్ప సంపద. కల్తీ లేని తనానికి, చరిత్రకు సామాజిక కులాంశాలకు ఇది చాలా ఉపయోగపడ్తుంది. తెలంగాణ హిస్టరీ సొసైటి ఇది పరిగణలోకి తీసుకోవాలి. మాతృస్వామిక విలువలు పునాదిగా ఈ కథలు పెట్టని చారిత్రక సంపదలు. కనక వీటిని రికార్డు చేసుకోవాల్సిన తక్షణావసరముంది. తద్వారా ముందు తరాలకి ఒక గొప్ప ప్రజాస్వామిక సంస్కృతిని అందించిన వాల్లమవుతాం.

## వివక్ష, ఉపేక్షకు గురైన తెలంగాణ చరిత్రను పునర్నిర్మించాలి

- ముదిగంటి సుజాతారెడ్డి

తెలంగాణ చారిత్రక పరిశోధన సంఘం ఏర్పాటు చేసుకోవటం ఎంతో చారిత్రక అవసరం. ఆంధ్రదేశ చరిత్రను చెప్పేటప్పుడు ఆ ప్రధానపాయలో తెలంగాణ ప్రాంత చరిత్ర సంస్కృతులకు చోటు ఉండటం లేదు. చోటు కన్నా ఉపేక్షింపబడ్తున్నది. ఒక విధమైన వివక్షకు గురి అవుతున్నది. అసలయితే ఆంధ్రదేశ చరిత్రలో తెలంగాణ ఒక ఉపేక్షింపరాని భౌగోళిక స్థానంలో ఉంది. పశ్చిమ ప్రాంతాలైన గుజరాతు మహారాష్ట్ర కర్ణాటక ప్రాంతాల రాజులు తూర్పు సముద్రతీర ప్రాంతాన్ని వశం చేసుకోవాలంటే ముందు తెలంగాణను జయించాలి. అందుకే రాష్ట్రకూటులు, పశ్చిమ చాళుక్యులు తెలంగాణను జయించి తమ ప్రతినిధి రాజ్యాలను కాకతీయులను, ముదిగొండ చాళుక్యలను తమ సామంతులుగా నియమించి పాలించారు. పశ్చిమ చాళుక్యలకు తూర్పు చాళుక్యలకు రాజ్యాధిపత్యపు పోరుకోసం తెలంగాణలో కొలనుపాక వంటి స్థలాలు యుద్ధభూమిగా ఏర్పడ్డాయి. చోళులూ తూర్పు చాళుక్యల పక్షం వహించి ఆ యుద్ధాలలో పాల్గొంటె కాకతీయులు పశ్చిమ చాళుక్యల పక్షం వహించారు. కాకతీయులు స్వతంత్రులై మహాసామ్రాజ్యం నిర్మించి పాలించినప్పడు అంతకుముందు ఇక్ష్వాకులు విష్ణుకుండినులు ఆంధ్రదేశాన్ని పాలించినప్పడు తెలంగాణను కేంద్రంగా చేసుకునే రాజ్యాధికారం చేసారు. కాని కోస్తా ప్రాంతం రాజవంశీయులు ఎప్పడూ తెలంగాణను స్వాధీనం చేసుకొని పాలించలేదు. శాతవాహనుల రాజ్యాధికారం కూడా కరీంనగర్ జిల్లా ధూళికట్ట, కోటిలింగాల ప్రాంతం నుంచి ఆరంభమైందని అక్కడ దొరికిన నాణాల ఆధారంగా తెలుస్తున్నది. తెలంగాణ నుంచే శాతవాహనులు పశ్చిమంగా రాజ్య విస్తరణ చేసి తర్వాత తమ రాజధానిని ఇప్పటి ఔరంగాబాదు సమీపంలో ఉన్న పైఠన్‌కు మార్చుకొని దక్షిణాపథ సామ్రాజ్యాన్ని నిర్మించారు.

తెలంగాణను క్రీ.శ. 8-10 శతాబ్దాల మధ్య పాలించిన వేములవాడ చాళుక్యులు లాట దేశం అంటే గుజరాతుకు చెందిన చాళుక్యశాఖకు చెందినవాళ్లు. వాళ్ల రాజ్య కాలంలో తెలంగాణ సాహిత్యం సంస్కృతి కళలలో ఒక ప్రత్యేకతను సంపాదించుకుంది. వేములవాడ చాళుక్యల కాలంలోనే వాళ్ల ఆస్థానంలోనే వేములవాడ నగరంలో కన్నడ సాహిత్యంలో ఆదికావ్యం 'విక్రమార్జున విజయం' రచించబడింది. విక్రమార్జున విజయం కీర్తితో పంపమహాకవికి రెండో అరికేసరి ధర్మపురిని అగ్రహారంగా ఇచ్చాడు. పంపకవి సోదరుడు జినవల్లభుడు వేయించిన కుర్క్యాల శాసనంలో మూడు తెలుగు కందపద్యాలు మనోహరమైనయి ఉన్నాయి. తెలుగు ఛందస్సులో కందకు ప్రత్యేక స్థానమంది. అటువంటి కందాలు మొదటిసారిగా మనకు ఈ శాసనంలోనే దర్శనమిచ్చాయి. వేములవాడ

చాళుక్యులు ఆ తర్వాత కాకతీయులు జైనమతాన్ని అభిమానించారు. కాబట్టి కోస్తా ప్రాంతంలో బౌద్ధం ఎక్కువగా వ్యాపిస్తే తెలంగాణలో జైనం ఎక్కువ అభిమానింపబడింది. తెలంగాణలోనూ ఫణిగిరి, గాజులబండ వంటి ప్రదేశాల్లో బౌద్ధమతావశేషాలు లభించాయి. కాని జైనం కర్ణాటక ప్రాంతంలో ఎక్కువ ప్రభావాన్ని కలిగి వుంది. ఆ జైనాన్ని పారదోలటానికే తెలంగాణలో క్రీ.శ. 12-14 శతాబ్దాల్లో వీరశైవం ప్రవేశించి విజృంభించింది. తెలుగులో వీరశైవ సాహిత్యానికి తెలంగాణ కేంద్రంగా ఉండింది. పాల్కురికి సోమనాథుడు ఓరుగల్లు సమీపంలోని పాలకుర్తివాడు. వేదాధ్యాయాలకు భాష్యం వ్రాసి వీరశైవాన్ని వైదిక బద్ధం చేసిన పండితుడు కవి సోమన. తెలుగు భాషలో సంస్కృత సమాసాలను నుడికారాలను గుప్పించకూడదని ప్రజల అవగాహనకు దగ్గరగా వుండే దేశీయమైన తెలుగునే వాడాలని 'జానుతెనుగు' పేరుతో వీరశైవకవులు భాషోద్యమం నడిపి తెలుగు భాష సొబగులను నిర్ణయించింది ఈ తెలంగాణ భూమిలోనే.

ఆంధ్ర ప్రాంతమంతా విజయనగర సామ్రాజ్యంలో భాగమై ఉన్నప్పుడు తెలంగాణ కుతుబ్‌షాహీల పాలనలో ఉంది. అయినా అప్పుడుకూడ అచ్చ తెలుగు కావ్యాలు రచించబడినాయి. రామదాసు వంటి వాగ్గేయాకారుడు జన్మించి అచ్చమైన తెలుగు నుడికారంతో కూడిన పదాలను రచించాడు. ఆ కాలంలో తెలుగే ఉర్దూపై తన ప్రభావాన్ని ప్రసరింపజేసింది. తెలుగు ప్రభావంతోనే ఉర్దూలో 'దక్కనీ' అనే 'బోలీ' బయలుదేరింది.

ఆంధ్రదేశమంతా బ్రిటిష్ పాలనలో ఉన్నప్పుడు తెలంగాణ ఆసఫ్‌జాహీల పాలనలో ఉంది. అప్పడే కొంతకాలం తెలుగుకు గ్రహణం పట్టింది. తెలుగు ప్రజలు మాతృభాషకు సాహిత్యానికి దూరమయ్యారు. కాని అది ఎంతోకాలం జరుగలేదు. ఆంధ్రోద్యమంతో తెలంగాణ ప్రజలు తమ భాషా సాహిత్యాలను కాపాడుకున్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశమంతా గాంధీజీ నాయకత్వంలో స్వాతంత్ర్య పోరాటం జరిపి స్వాతంత్ర్యం తెచ్చుకుంటే తెలంగాణ ప్రజలు తమ స్వాతంత్ర్య పోరాటం తాము చేసుకోవలసి వచ్చింది. నిజాం వ్యతిరేక పోరాటంతో పాటు భూస్వాములకు వ్యతిరేకంగాను పోరాటం చేసి తెలంగాణ ప్రజలు భారతదేశంలో ఎక్కడాలేని చరిత్రను లిఖించారు. ఆ పోరాటాల కాలంలో తెలంగాణ అపురూపమైన పాటలు, కథలు, కవిత్వం వివిధ ప్రక్రియల్లో సాహిత్యాన్ని సృష్టించుకుంది. అయితే ప్రధాన పాయలో ఆంధ్రప్రాంతాల్లో సాంస్కృత పునరుజ్జీవనం కాలంలో చరిత్ర సాహిత్యాల్లో జరిగిన పరిశోధనల్లో తెలంగాణ ఉపేక్షింపబడింది. ఇక్కడ ఏ చరిత్ర సాహిత్య సృష్టి జరుగనట్లుగానే అక్కడి పరిశోధకులు వ్రాతలు వ్రాసారు. పోతన, మొల్ల వంటి కవులను తెలంగాణేతరులుగా చూపించారు. తెలంగాణ చరిత్ర సాహిత్య వైభవాలను గుర్తించలేదు. తెలంగాణ విమోచనోద్యమం

కాలంలో తెలంగాణ ప్రజలకు సోదర ప్రజల నుంచి ఎటువంటి సానుభూతి మద్దతులు లభించలేదు. పోగా వివక్షకు భాషా విషయంలో న్యూనతకు గురిచేయబడ్డారు. ఆ విధంగా ఉపేక్షకు గురయిన తెలంగాణ చరిత్రను పునర్నిర్మించుకోవలసిన అవసరం ఎంతయినా ఉంది. తెలంగాణ భౌగోళిక రాజకీయార్థిక సందర్భంలో పుట్టి వికసించిన చరిత్ర సంస్కృతులను అధ్యయనం చేయవసినది ఎంతో ఉంది.

తెలంగాణ అంటే నాకు రెండు తెలంగాణలు కన్పిస్తున్నాయి. ఒకటి రాజకీయ నాయకులు తమ స్వార్థలాభాలకు వాడుకుంటున్న తెలంగాణ. రెండు నిజంగా అభిమానిస్తున్న ప్రేమిస్తున్న ప్రజలకు సంబంధించిన ప్రజల హృదయాల్లో నివసిస్తున్న తెలంగాణ. ఈ రెండో తెలంగాణ అభిమానంతో కృషి జరగాలె అని నేను కోరుకుంటున్నాను. ఆ విధంగానే ఈ సంస్థ చరిత్ర పరిశోధనకు పూనుకుంటుదని మేమంతా దానిలో భాగస్వాములమవుతామని ఆశిస్తున్నాను.

## తెలంగాణ గురించి తెలియని నిజాలు

- జి. వెంకటరామారావు

తెలంగాణ ఖ్యాతిని తెలుసుకోలేని వారికి ఈ సంఘటన ద్వారా కనువిప్పు కలుగుతుంది.

1945 జనవరి 18వ తేదీన మద్రాసు నగరంలోని రసికరంజని హాల్‌లో ఆంధ్రారాష్ట్ర మహిళా జాతీయ విద్యామహాసభను శ్రీమతి సరోజినినాయుడు ప్రారంభించారు. శ్రీమతి పొణక్ నరసమ్మ (పొణక్ కనకమ్మ?) గారు అధ్యక్షత వహించారు. శ్రీమతి ఉన్నవ లక్ష్మీబాయమ్మ గారు స్వాగత వచనలు పలికారు. మహామహులైన రైట్ ఆనరబుల్ శ్రీనివాసశాస్త్రి, రాజాజీ, బులుసు సాంబమూర్తి, రెడ్డి, నాయుడు మొదలైనవారు పాల్గొన్న ఈ సభలో సరోజినినాయుడు మాట్లాడుతూ ఇలా అన్నారు.

"నేను మన దేశమునకు ఐతే మా ఇంటి ఆడపడుచుననీ, తెలంగాణకి వస్తే మా ఇంటి కోడలని అంటారు. కాని ఈ రెండు భాషలలోను చక్కగా మాట్లాడలేని శోచనీయస్థితిలో నేనున్నందుకు విచారిస్తున్నాను. కనుక నాకు ఇంగ్లీషులోనే మాట్లాడే దౌర్భాగ్యం ఏర్పడింది. నేను తెలంగాణ వాసిని. నిజమైన తెలంగాణ మాదే. మాది కూడా తెలంగాణ భాషనే. తెలంగాణ ప్రతిష్ట అపూర్వమైనది, అచట శిల్పములు, శాసనములు అసమానమైనవి. వరంగల్ శిథిలములు, శిల్పములు మానవుడు సాధించిన వాటిలో అత్యుత్తమమైనవి. చరిత్ర ప్రసిద్ధమైన ఈ శిల్పములు, సంప్రదాయములు భావి ఉత్తమ గతికి ఉత్తేజకరణములు. మా ప్రాంతమున చాలా మంది తెలుగువారు నివసించుచున్నారు. హైదరాబాద్‌లో ఆంధ్ర మహిళా సమాజము కూడా స్థాపించారు. మా మహిళా సమాజమునకు ప్రఖ్యాత అధ్యక్షరాండ్రలలో ఒకరైన శ్రీమతి రంగమ్మ ఓబుళ్‌రెడ్డి గారికి ఈ వార్శికోత్సవాలకు అధ్యక్షురాలిగా వరించి గౌరవించినారు. సమాజము వారి విద్యాభివృద్ధికి చక్కని కృషి చేస్తున్నారు. మా పూర్వుల ప్రతిభ మహిమోపేత మైనది, మా తెలంగాణ మహిళలు కూడ భారత దేశ మందలి ఏ ప్రాంతపు మహిళలకు ఆవంతయు తీసిపోరని చెబుతున్నాను." తెలంగాణను సరోజినినాయుడు అంతటి గొప్ప వ్యక్తి కీర్తించినా మనమింకా వెనుకబడి ఉన్నామని అనుకోవడం అవివేకం. (ఈ వార్త ఆనాటి ఆంధ్రపత్రిక నుంచి).

'ఇక్కడి తెలుగు వాళ్లు బయటి తెలుగు వాళ్లలోనే గాక, ఏ రాష్ట్ర ప్రజలలోను వెనుకబడిలేరు. ఒక విద్యా విషయంలో తప్ప. అనేక పాఠశాలలు, ఘనమైన విశ్వవిద్యాలయం, దాని అనుబంధ కళాశాలలెన్నో ఉన్నప్పటికీ సామాన్య ప్రజలలో విద్యా ప్రచారం ఎక్కువ సాగలేదు. ఈ కొరతను

తీర్చడానికే బూర్గుల ప్రభుత్వం చివరి రోజుల్లో ఖమ్మం, కరీంనగర్, నల్లగొండ, సిద్దిపేట ఇత్యాది ప్రాంతాలలో నూతన కళాశాలలను స్థాపించింది. వరంగల్ కాలేజిని 1953లో అప్ గ్రేడ్ కాలేజిగా మార్చారు. విద్యావిషయకంగా బూర్గుల గారి మంత్రి వర్గం సాధించిన ఘనతను తెలంగాణ వాసులు మరువలేరు.'

'దాదాపు రెండు వందల సంవత్సరాల నవాబు పాలనలో ఉంటూ, మహారాష్ట్ర జిల్లాలతో స్నేహం చేసినప్పటికీ ఇది (తెలుగు) సిరిసంపదల్లో, జీవన గతిలో అచ్చముగా తెలుగు భూభాగముగానే మిగిలింది. తెలుగు ప్రాధాన్యతను తెలంగాణ ఎన్నడూ విస్మరించి ఎరుగదు. సంస్కృతిని, సభ్యతను, జీవితంలోని ప్రతికదలికలో కాపాడుకుంటు వచ్చింది. కాని బహుళ విద్యావ్యాప్తి జరుగని కారణంగా ఇక్కడి ప్రజలు బయటి తెలుగు వాళ్ల కన్న వెనుకబడి ఉన్నారు. ఐతే ఉద్యోగాల విషయంలో కొంత భయం ఏర్పడింది. విద్య తరువాత ఇక్కడి యువకుల్లో, విద్యార్థుల్లో దాగిన పెద్ద భయం నిరుద్యోగం. అసలు ఈ భయమే కొంత వరకు విశాలాంధ్రకు వ్యతిరేకంగా పనిచేసింది. ఆంధ్రలో చదువుకున్న వారు హెచ్చు. కనుక అన్ని ఉద్యోగాలు తమ చేతుల్లో నుండి జారిపోతాయనే ఆదుర్దా. ప్రస్తుతం ప్రతి శాఖలో బయటి వాళ్లే కనిపించడం ఇవన్ని కలిసి బలంగా విద్యార్థులనాకర్షించాయి. (గోలకొండ పత్రిక - 1955 నవంబర్ 4 నాటి సంపాదకీయం).

ఎన్టీరామారావు ప్రభుత్వం తెలంగాణలో పటేల్-పట్వారీ వ్యవస్థను రద్దుచేసింది. దీన్ని వెనుకటి హైదరాబాదు ప్రభుత్వం 1950లోనే రద్దు చేయటానికి ప్రయత్నాలు ప్రారంభించింది. ఆనాటి వివరాలు 'సంస్థాన గ్రామాలు శిస్తులను వసూలు చేయడం, భూముల రికార్డులు ఉంచడం మొదలైన రెవెన్యూ పనులన్ని అనాది కాలంనుంచి వంశ పారపర్యంగా చేస్తువున్న పటేల్, పట్వారీలను (కరణం, మునసబు) శాశ్వతంగా తొలగించి వారి స్థానే పై కార్యాలను నెరవేర్చడానికి మోడల్ గ్రేడు హెూదాలలో ఉద్యోగాలను నియమించాలని హైదరాబాద్ ప్రభుత్వం వారు 1950లోనే ఆలోచించారు. అందుకుగాను చిత్తు ప్రణాళికలు తయారుచేసి ప్రభుత్వం పరిశీలించినట్లు కూడ ప్రచారాలు జరిగాయి. ఈ ప్రణాళిక ప్రకారం 15 వేల రూపాయల శిస్తు వసూలయ్యే గ్రామాల్ని చేర్చి ఒక యూనిట్‌గా చేస్తారని, ఇటువంటి ప్రతి యూనిట్‌కు ఒక ఉద్యోగి, అతనికి సహాయకునిగా ఒక బంటు (సేత్ సింధీకి బదులుగా) ఏర్పాటు చేయగలుగుతారని తెలిసింది. ఈ ఏర్పాటు మూలంగా ఒక ఉద్యోగి ఆధీనంలోకి మూడు, నాలుగు గ్రామాలు కూడా వచ్చే అవకాశం ఉంది. భూ సంస్కరణల అమలు చేయడానికి పూనుకున్నట్లే, లోపభూయిష్టంగా ఉన్న గ్రామ పరిపాలనా విధానాన్ని కూడ సంస్కరించాలని ఆలోచిస్తున్నారు. ఈ విధానం అమలులోకి వచ్చి ఉండి ఉంటే హైదరాబాద్ సంస్థాన మందలి గ్రామ పరిపాలన విధానంలో

అత్యంత అభివృద్ధి కరమైన అధ్యయనం కాగలదని చెప్పవచ్చు. అప్పుడు రెవెన్యు మంత్రిగా ఉన్నది బూర్గుల రామకృష్ణ రావే కదా.' (తెలుగు స్వతంత్ర నుంచి). ఆంధ్రప్రదేశ్ ఏర్పడగానే దీని గురించి ఆలోచించడం మానేశారు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందే హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వం 'ఇండస్ట్రియల్ ట్రస్ట్ ఫండ్' అనే సంస్థను స్థాపించింది. దాని యాజమాన్యం క్రింద నాలుగు బట్టల మిల్లులు, బోధన్ చక్కెర కర్మాగారం, సిర్పూరు కాగితం ఫ్యాక్టరీ, వజీర్ సుల్తాన్ సిగరెట్ ఫ్యాక్టరీ, రెండు సిమెంట్ ఫ్యాక్టరీలు, ఆల్విన్, ప్రాగాటూల్స్, ఇంజనీరింగు సంస్థలు, హైదరాబాద్ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ వంటి పరిశ్రమలు నెలకొల్పబడ్డాయి. బ్రిటిష్ పెట్టుబడితో సింగరేణి కాలరీస్ ఆధ్వర్యాన బొగ్గు పరిశ్రమ ప్రారంభించారు. తెలంగాణలో ఇనాముల రద్దు శాసనం 1954లో (బూర్గుల మంత్రివర్గంలో) వస్తే ఆంధ్రలో 1956లో వచ్చింది.
తెలంగాణలోని తొమ్మిది జిల్లాలు, ఇతర రాష్ట్రాలలోని నిర్వివాదమైన తెలుగు ప్రాంతాలు అంటే, మధ్యప్రదేశ్‌లోని చాందా, బస్తర్ ప్రాంతాలు, భద్రాచలంలోని  కొంత ప్రాంతం కలిపి తెలంగాణ రాష్ట్రం నిర్మించాలని హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఫజల్ అలీ కమిషన్ కిచ్చిన నివేదికలో విజ్ఞప్తి చేసింది.

ఇప్పుడు శ్రీరాంసాగర్ ప్రాజెక్టుగా ప్రచారం ఉన్న గోదావరి లోయ ప్రాజెక్ట్ పథకం రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ప్రారంభమైంది. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్లు జిల్లాల్లో ఇరవై లక్షల ఎకరాలకు సాగునీరందించే పథకాలు వేసుకున్నారు. ఆనాటి ప్రణాళిక ప్రకారం ఈ ప్రాజెక్టు కింద విద్యుచ్ఛక్తి ఎక్కువ ఉత్పత్తి అవుతుంది. నదిపైన వివిద కాలువలపైన మొత్తం పది ప్రదేశాలలో హైడ్రో ఎలక్ట్రిక్ స్కీంలను ఏర్పాటుచేయవచ్చు. వాటన్నిటి ద్వారా ఒక లక్ష డెబ్బైఅయిదు వేల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి తయారవుతుంది. దగ్గరనే అధికంగా దొరుకు బొగ్గు ఆధారంగా రామగుండం వద్ద ఒక లక్ష యాభై వేల కిలో వాట్ల థర్మల్ స్టేషన్లు మొత్తం మూడు లక్షల ఇరవై ఐదు వేల కిలో వాట్ల ఎలక్ట్రిసిటీని తయారుచేస్తుంది.

గోదావరి నదిలోయలో ఎక్కువగా ఉన్న సహజ సంపద అభివృద్ధి పరచడానికి రామగుండం చుట్టుపక్కల నున్న బొగ్గు, సిర్‌పూర్ పేపరు మొదలైన పరిశ్రమల ఆధారంగా ఇతర పరిశ్రమలు నెలకొల్పటానికి పథకాలు వేసుకున్నారు. రామగుండం వద్ద పెద్ద పారిశ్రామిక నగరాన్ని నిర్మించాలని ప్లానులో ఒక భాగం. ఇచ్చట సిమెంటు, ఆయిల్, వనస్పతి, సిరమిక్సు, టెక్స్‌టైల్స్, రేయాన్,

కాల్షియం కార్బొరేట్, ఆల్కహాల్, ప్లాస్టిక్స్ మొదలైన పరిశ్రమలే గాక దగ్గరలో దక్షిణ బస్తరులో విస్తారంగా ఉన్న ఉక్కు పరిశ్రమను కూడా నిర్మిచవచ్చునని అంచనా. ఈ ప్రాజెక్టకు సంబంధించిన డ్యాములు, కాలువలు, విద్యుచ్ఛక్తి నిర్మాణానికి మొత్తం అరవై ఐదు కోట్ల ఇరవై లక్షలు ఖర్చు అవుతుందని అంచనా. ఈ ఒక ప్రాజెక్టే కాదు, ఇలాగా విద్యుచ్ఛక్తి ఉత్పత్తి వినియోగించే పెద్ద డ్యాములను పెన్గంగ మీద, గోదావరి పై ఇచ్చంపల్లి వద్ద కట్టవచ్చునని హైదరాబాద్ పరిశోధనల వల్ల తేలింది.

తెలంగాణకు ఎక్కువగా ఉపయేగపడే కృష్ణ నది ప్రాజెక్ట్లు నందికొండ (నాగార్జునసాగర్) ముఖ్యమైనది. దీని పథకాలను 1950లో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి తయారు చేసుకున్నాయి. తెలంగాణ వాటా కింద ఈ పథకం ద్వారా నల్లగొండ, ఖమ్మం జిల్లాలో తొమ్మిది లక్షల ఎనభై ఏడు వేల ఎకరాలకు నీరు లభిస్తుందనే ఉద్దేశ్యం, పులిచింతల ప్రాజెక్టులపై ఆ రోజుల్లోనే హైదరాబాద్ ప్రభుత్వం అభ్యంతరాలు తెలిపింది. వాటి వల్ల తెలంగాణ వైపు భూమి ఎక్కువ మునిగి పోతుందని హైదరాబాద్ ప్రభుత్వ వాదన. తెలంగాణ ప్రజలు ఆనాడే కోరినట్లు తెలుగు ప్రత్యేక రాష్ట్రం లభించి వుంటే వారి కోరికలు నెరవేరేయే. గతజల సేతు బంధనం.

## తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణ అవసరం - సమస్యలు, అవకాశాలు

- ఎన్. వేణుగోపాల్

తెలంగాణ హిస్టరీ సొసైటీ ఇంకా రూపొందలేదనే వివరణను ఇప్పటికే వివేక్ గారు, లోకేశ్వర్ గారు ఇచ్చి ఉన్నారు. ఇప్పటి వరకు జరిగిన ప్రయత్నం ఏమంటే, తెలంగాణ మీద చాల ప్రేమతో, కొన్ని అవగాహనలతో ఒక ప్రయత్నం మొదలయింది. ఆ అవగాహనలు : 'చరిత్ర రచనలో తెలంగాణ ఇప్పటికి చాల అన్యాయాన్ని ఎదుర్కొన్నది. తెలుగుజాతి చరిత్ర అని వచ్చినవిగాని, ఆంధ్రప్రదేశ్ చరిత్ర అని వచ్చినవి గాని, తెలంగాణ ప్రాంత చరిత్రను తమలో సంపూర్ణంగా భాగం చేసుకోలేదు. ఈ తొమ్మిది పది జిల్లాల చరిత్రను, ఇక్కడి ప్రజల చరిత్రను, ఇక్కడి ప్రజల సంస్కృతిని ఎక్కడో ఒక అధోజ్ఞాపికగానే చూశాయిగాని, మొత్తంగా చూడలేదు. అన్యాయం చేశాయి, లేదా అధ్యాయాలకు అధ్యాయాలు రాయవలసిన చరిత్రను ఎక్కడో ఒకటి రెండు వాక్యాలలో కుదించాయి. ఒకటి రెండు పరిచ్ఛేదాలలో ముగించేశాయి, వక్రీకరించాయి.' ఈ అవగాహనతో, తెలంగాణ మీద ప్రేమతో తెలంగాణ చరిత్రను పునర్నిర్మించడానికి ఒక ప్రయత్నం ఇప్పుడు ప్రారంభమవుతున్నది. జరిగిన అన్యాయాన్ని కొంతమేరకైనా సరిదిద్దగలమా, విస్మరణకూ వివక్షకూ వక్రీకరణకూ గురైన చరిత్రను పునర్నిర్మించగలమా అనే తపనతో ఈ ప్రయత్నం జరుగుతున్నది.

ఈ చరిత్ర పునర్నిర్మాణ బాధ్యతను నిజంగా చేపట్టవలసినది చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలు చరిత్రనుంచి, అర్థశాస్త్రం నుంచి, సామాజిక శాస్త్రాల నుంచి అటువంటి ఒక నిర్మాణాత్మకమైన కృషి జరగవలసి ఉన్నది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలలో భాగంగా గత పది సంవత్సరాలుగా ఎంతో కొంత అటువంటి కృషి జరుగుతున్నది. ఇప్పటికైనా ఆ కృషినంతటినీ సంఘటితం చేయవలసి ఉన్నది. నిర్మాణ బద్ధమైన కృషిగా మార్చవలసి ఉన్నది. విభిన్నరంగాల సాంఘిక శాస్త్రవేత్తల సామూహిక, సమన్వయపూరితమైన కృషి అవసరం ఉన్నది. తెలంగాణ హిస్టరీ సొసైటీ ఆ దిశలో పనిచేయవలసి ఉంటుంది.

ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ ఉన్నది, ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ ఉన్నది, ఇండియన్ కౌన్సిల్ ఫర్ హిస్టారికల్ రిసర్చ్ ఉన్నది. అటువంటి సంస్థలు చేస్తున్న కృషి వంటి కృషిని మన నేల గురించి మనం చేసుకోగలమా, మన నేల గురించి జరగకుండా ఉండిపోయిన పనిని మనం చేయగలమా అనే తపనతోనే ఈ ప్రయత్నం జరుగుతున్నది. ఆ తపనతో ఒక ఐదారుగురు ఔత్సాహికులం, ఎవరమూ నేరుగా చరిత్ర అధ్యయనంలో, చరిత్ర రచనలో ప్రవేశం ఉన్నవాళ్లం కాదు, ఈ ప్రయత్నం

ప్రారంభిస్తున్నాం. తెలంగాణ మీద ప్రేమ మాత్రమే మా అర్హత. ఆ ప్రయత్నంలో భాగంగా మేం నాలుగైదు సమావేశాలలో ఇందుకు సంబంధించి తర్జన భర్జనలు పడ్డాం.

ఆ క్రమంలో మేం పైన చెప్పిన పరిశోధన సంస్థల పత్రాలు పరిశీలించాం. అవన్నీ వృత్తి చరిత్రకారుల సంస్థలు. ఆ సంస్థలన్నిటిలో ప్రవేశానికి యోగ్యత వృత్తి చరిత్రకారులయి ఉండడమే. హిస్టరీ లో ఎం.ఎ. ఎం.ఫిల్., పి.ఎచ్‌డి లాంటివి ఉండాలి. కాని ఇక్కడ అందుకు భిన్నంగా, తెలంగాణ పట్ల ప్రేమ ఉండి, తెలంగాణ చరిత్రను తవ్వితీయాలనే ఆసక్తి ఉండి, స్థూలంగా, సామాజిక శాస్త్రాలలోనో, భాషలోనో, సాహిత్యంలోనో, కళలలోనో పనిచేసినవాళ్ళ సమష్టి కృషి ద్వారా ఈ చరిత్ర పునర్నిర్మాణ, చరిత్ర పరిశోధక, చరిత్ర రచనా సంస్థను ఏర్పాటు చేయవచ్చుననుకున్నాం.

ఈ ఆసక్తులు సమానంగా ఉండి కూడ భిన్న భిన్న దృక్పథాలు, భావజాలాలు, అవగాహనలు ఉన్నవాళ్లు ఉండవచ్చు. ఇప్పటికి ఇక్కడ మాట్లాడిన ముగ్గురు వక్తలు మూడు భిన్నమైన అవగాహనలను ప్రకటించారని మీరు చూశారు. అటువంటి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి, ఉంటాయి. అందువల్ల తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణం అనే ఏకైక లక్ష్యంతో, తెలంగాణ పట్ల ప్రేమ ఏకైక షరతుగా మన భావజాలాలనుకూడ పక్కన పెట్టి, ఈ చరిత్ర పరిశోధనా కార్యక్రమానికి పూనుకోగలమా, ఒక వేదికను ఏర్పర్చగలమా, అని ప్రశ్నించుకున్న ఫలితంగా ఈ ప్రయత్నం సాగుతున్నది.

కనుక ఇప్పటివరకూ తెలంగాణ హిస్టరీ సొసైటీ అని ఏవైనా ప్రస్తావనలు వచ్చినా, అవి ఒక ఏర్పడి ఉన్న సంస్థ గురించి కాదు. ఆ ఆలోచన గురించి మాత్రమే. మనందరి ఉమ్మడి ఆలోచనలతో, కృషితో అటువంటి సంస్థ ఏర్పడవలసి ఉన్నది. అటువంటి వేదిక గాని, సంస్థ గాని ఏర్పడితే దానికి విధివిధానాలు ఎట్లా ఉండాలి. దాని పరిధి ఏమిటి, పరిమితులు ఏమిటి, ఏ ప్రతిపాదనలు ఆలోచించవలసి ఉన్నాయి అని చర్చించడానికే ఈ సమావేశం.

అసలు ఈ అవసరం ఏమిటి? ప్రస్తుతం తెలంగాణగా ఉన్న ప్రాంతానికి అత్యద్భుతమైన, చాల వైభవోపేతమైన చరిత్ర ఉంది. ఆ మాట మనం చాల రోజులుగా చెప్పుకుంటున్నాం. మరీ ముఖ్యంగా గత పది సంవత్సరాలుగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆందోళనలో భాగంగా ఈ అభిప్రాయాలు చాలా భావోద్వేగపూరితంగా ముందుకు వస్తున్నాయి. కాని ఆ అభిప్రాయాలను నిర్దిష్టంగా, శాస్త్ర ప్రతిపత్తితో, సాధికారికంగా, కచ్చితమైన సాక్ష్యాధారాలతో ప్రకటించగలమా? అలా ప్రకటించేందుకు అవసరమైన కృషిని ఇప్పటికైనా ప్రారంభించ గలమా? తెలంగాణ పట్ల ప్రేమను భావోద్వేగాల స్థాయిలో ఎంత

బలంగా ముందుకు తెస్తున్నామో, బలోపేతం చేస్తున్నామో, ఆ స్థాయిలో శాస్త్రీయమైన, ప్రామాణికమైన చరిత్ర రచనకు పూనుకోగలమా?

తెలంగాణకు గల వైభవోపేతమైన చరిత్ర ప్రామాణిక చరిత్ర రచనలలోకి రాకుండా, వచ్చినా అరకొరగా, వక్రీకరణలతో వచ్చి ఉంది. చరిత్ర రచన జరగవలసిన ఏ రంగం, కోణం వైపు నుంచి చూసినా తెలంగాణ చరిత్రను పునర్నిర్మించవలసిన అవసరం కనబడుతుంది.

ఈ చరిత్ర పునర్నిర్మాణ క్రమంలో కొన్ని ఆలోచించవలసిన ప్రతిపాదనలు, ప్రాతిపదికలు మీ ముందు సూచించడం మాత్రం నా పని.

రెండు వేల ఏళ్ల తెలుగు భాషా ప్రజల చరిత్రలో అత్యధిక భాగానికి ఇవాళ్టి తెలంగాణనే రాజకీయ కేంద్రంగా ఉండింది. పెదబంకూరు, కోటిలింగాల, కొండాపూర్, ఎలగందుల, ధూళికట్ట, కీసర, హనుమకొండ, ఓరుగల్లు, గోల్కొండ, హైదరాబాదు - ఇవాళ తెలంగాణలో ఉన్న ఈ నగరాల నుంచే తెలుగు భాషా ప్రాంతాల పాలన గత రెండువేల ఏళ్లలో కనీసం పదిహేను వందల ఏళ్లపాటు జరిగింది. ప్రస్తుతం కర్ణాటక-రాయలసీమలోని హంపి - విజయనగరం, కంపిలి, ఆనెగొంది, పెనుకొండల నుంచి ఒక రెండు శతాబ్దాలపాటు పాలన సాగింది. ఇవాళ్టి కోస్తాంధ్ర నుంచి మొత్తం తెలుగు భాషా ప్రాంతాల పాలన జరిగిన సందర్భం ఒక్కటి కూడ లేదు. ధరణికోట, రాజమహేంద్రి, వేంగి, కొండపల్లి, కొండవీడు, శ్రీకాకుళం వంటి రాజధానుల నుంచి పాలించిన వాళ్లందరూ తక్కువ ప్రాంతాన్ని పాలించినవాళ్లే. కాని తెలుగు ప్రజల చరిత్రలోనూ, దక్కన్ పీఠభూమి చరిత్రలోనూ ఈ ప్రాంతానికి దక్కవలసినంత స్థానం దక్కలేదు. ఈ ప్రాంతం విస్మరణకు, వివక్షకు గురయింది. ఒక రెండువేల ఏళ్ల చరిత్రగల జాతి గురించి మాట్లాడేటప్పుడు, అందులో అధికార కేంద్రం పద్నాలుగు, పదిహేను వందల ఏళ్లపాటు ఉండిన ప్రాంతం పట్ల ఈ వివక్ష ఉండడమేమిటి, ఎప్పుడూ అధికార కేంద్రం ఉండకపోయినా, ఒక రెండు వందల ఏళ్లపాటు ఆర్థికాధికారాన్ని మాత్రం అనుభవించి అందువల్ల రాజకీయ చక్రం తిప్పగలిగిన ప్రాంతానిది పైచేయి కావడమేమిటి? ఇది ఆలోచించవలసిన, అన్వేషించవలసిన, పరిశోధించవలసిన ప్రశ్న.

ఈ నూటయాభై, రెండు వందల ఏళ్లలోనే ఎక్కువగా చరిత్ర రచన జరిగింది కాబట్టి, అంతకు ముందరి వెయ్యి సంవత్సరాల వైభవోపేత చరిత్రను తుడిచిపెట్టడమో, విస్మరించడమో, వక్రీకరించడమో జరిగిందా? దాన్ని తవ్వితీయవలసిన అవసరం ఉంది.

అట్లాగే కళలో, భాషలో, సాహిత్యంలో, ప్రజల సృజనాత్మక శక్తిలో, ప్రజాపోరాటాల, ధిక్కారాల సంప్రదాయంలో ఎక్కడ చూసినా ఇవాళ్టి తెలంగాణ ప్రాంతానికి అసాధారణమైన చరిత్ర ఉన్నది. కాని అది సమగ్రంగా, సముచితంగా నమోదు కాలేదు. ఈ చరిత్రకు మూలాలు, పరిణామాలు ఎక్కడ వెతకగలం? తెలుగు సంస్కృతిలోని రెండు ప్రధానమైన జానపదగాథలకు కథాస్థలం ఇవాళ్టి తెలంగాణ భూభాగమే అని సాహిత్య విమర్శకులు ముదిగంటి సుజాతా రెడ్డి గారు విశ్లేషించి ఉన్నారు. ఇక ప్రజా పోరాటాల చరిత్ర తీసుకుంటే కనీసం ఐదువందల సంవత్సరాలుగా ఈ ప్రాంతం, తెలంగాణ, దక్కన్ పీఠభూమి ధిక్కారాలకు వేదికగా ఉన్నదని, ఇక్కడి రైతు కూలీలు, సామాన్య ప్రజలు అసామాన్యులుగా తమ తిరుగుబాట్లతో ఈ నేలలో గొప్ప చరిత్ర నిర్మించారని చరిత్రకారుడు ఇనుకొండ తిరుమలి గారు ఒక సదస్సులో ప్రతిపాదించారు. ఇక్కడి ప్రజలకు రాజ్యాధికారాన్ని, ఇతరేతర ఆధిపత్యాలను ధిక్కరించిన చరిత్ర ఉంది అని ఆయన అన్నారు. దీనికి మూలాలు తవ్వితీసి ఈ అవగాహనను బలోపేతం చేయవలసి ఉన్నది.

అట్లాగే ఇప్పటివరకూ జరిగిన చరిత్ర రచనలో కొంత అసమగ్రత ఉన్నది. పాత చరిత్ర పుస్తకాలు ఏవైనా తీసుకోండి, ఏటుకూరి బలరామమూర్తి గారు, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, కంభంపాటి సత్యనారాయణగారు వంటి గౌరవనీయులైన చరిత్ర రచయితలనైనా తీసుకోండి, లేదా, కాకతీయుల చరిత్ర మీద ప్రామాణికమనదగిన గ్రంథం రాసిన పి.వి. పరబ్రహ్మ శాస్త్రిగారిని తీసుకోండి. ప్రస్తుత తెలంగాణ ప్రాంతం గురించి ఉండవలసినంత సమగ్రంగా ఉండదు. పరబ్రహ్మ శాస్త్రిగారి పుస్తకం ప్రారంభంలోనే, కాకతీయుల పాలనా ప్రాంతం ఇంతకాలం పరాయి పాలనలో ఉండడం వల్ల చారిత్రక ఆధారాలు దొరకడం లేదు అని రాశారు. అది అసత్యం, లేదా అర్ధ సత్యం. ఎందుకంటే చాలా ఆధారాలున్నాయి. ఇరవయో శతాబ్దం తొలి రోజులనుంచీ, ఇక్కడ చారిత్రకాధారాల కోసం పరిశోధన ప్రారంభమయింది. లక్ష్మణరాయ పరిశోధకమండలి 1920 నుంచీ ఆ పని ప్రారంభించింది. శాసనాల సేకరణ ప్రారంభించింది. ఆదిరాజు వీరభద్రరావుగారు, మారేమండ రామారావు గారు, శేషాద్రి రమణ కవులు, యాజ్దానిగారు, అటువంటి తొలితరం పరిశోధకులు ఎంతో కృషి చేశారు. 1935లో మొదటిసారిగా తెలంగాణ ఇన్‌స్క్రిప్షన్స్ అనే గ్రంథం వెలువడింది. అయినా ఈ కృషి అంతా కూడ విస్మరణకు గురయింది. తెలంగాణ చరిత్రలో ఆధారాలు దొరకకపోవడం, ఆకరాలు లేకపోవడం అనే ఒక అసమగ్రత కొనసాగుతూ ఉన్నది. అది నిజానికి ఒక నింద. బట్ట గాల్చి మీద వేసిన లాంటి ఆకరాలు లేవనే నింద. అసలది నిజమేనా? అసలు ఆధారాలు దొరకలేదా, దొరికినవాటిని పక్కకు పెట్టారా? దొరికిన ఆధారాలను సరిగా వ్యాఖ్యానించకుండా, సమన్వయం చేయకుండా వదిలేశారా?

లోతుగా ఆలోచించవలసి ఉంది. ఒక సాహిత్య ఆధారమున్నది, ఒక జానపద, మౌఖిక గాథా ఆధారమున్నది, ఒక శిలాశాసన, తామ్రశాసన ఆధారమున్నది - వీటన్నిటినీ సమన్వయం చేయకుండా వదిలేశారా? ఇటువంటి సమస్యలన్నిటినీ పరిష్కరించవలసి ఉన్నది.

వీటన్నిటితో పాటు మేం చాలా వ్యగ్రంగా, తీవ్రంగా ఆలోచిస్తున్న సమస్య వక్రీకరణ. మరీ ముఖ్యంగా తెలంగాణ చరిత్ర రచనలో, 1956 నుంచి, ఆ మాటకొస్తే 1940ల నుంచి చాలా వక్రీకరణ జరిగింది. ఇందులో కొంత ఉద్దేశ్యపూర్వకమైనదీ ఉన్నది, కొంత అమాయకమైనదీ ఉన్నది. ఇందులో కొంత సైద్ధాంతిక స్థాయి వక్రీకరణ. తమ తమ భావజాలాలవల్ల, సైద్ధాంతిక దృక్పథాలవల్ల తమకు ఇష్టంలేని, తమకు నచ్చని వాస్తవాలను పక్కన పెట్టడం, నమోదు చేయకపోవడం, తప్పుగా నమోదు చేయడం జరిగింది. అట్లాగే రచయితల స్థలకాలాలు ఈ వక్రీకరణలకు చాలా వరకు కారణమయ్యాయి. ఒక వేళ వారు తెలంగాణ వాళ్లయి ఉంటే కూడా అటువంటి తప్పులే చేశారనుకోండి. అది వేరే కథ, కాని చరిత్ర రచయిత కోస్తాంధ్ర ప్రాంతం నుంచో, రాయలసీమ నుంచో వచ్చి ఉన్నట్టయితే తెలంగాణకు సంబంధించిన చారిత్రక వాస్తవాలు తప్పుల తడకలుగా నమోదయ్యాయి. ఉదాహరణకు ఇవాళ బి.ఎ., ఎంఎ., విద్యార్థులందరూ చదువుతున్న పి. రఘునాథరావు గారి ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర చూడండి. అందులో హైదరాబాద్ రాజ్యానికి సంబంధించీ, తెలంగాణకు సంబంధించీ ఎన్నో తప్పులు ఉన్నాయి. చరిత్ర విద్యార్థులందరూ అదే నిజమైన చరిత్ర అనుకుని చదువుతున్నారు.
ఇలా స్థలకాలాల వల్ల రచయితలు చేసిన పొరపాట్లను సవరించవలసి ఉన్నది. గత రెండు శతాబ్దాలలో జరిగిన కృషినంతటిని మళ్లీ ఒక్క దగ్గరికి చేర్చి, దానికి సముచితమైన గౌరవం కల్పించవలసి ఉన్నది. కె. జితేంద్రబాబు, కె. శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్, లోకేశ్వర్ వంటి పరిశోధకులెందరో చేస్తున్న కృషినంతటినీ సంఘటితం చేయవలసి ఉంది. సురవరం ప్రతాపరెడ్డి గారు, ఆదిరాజు వీరభద్రరావుగారు, వట్టికోట ఆళ్వారుస్వామిగారు, బిరుదురాజు రామరాజుగారు, రాజారాం సింగు గారు లాంటివారు చేసిన కృషిని మళ్లీ కొనసాగించవలసి ఉన్నది.

ఇక మరికొన్ని అంశాలున్నాయి. ముందే వివేక్ గారు చెప్పినట్టు తెలంగాణ చరిత్ర అని ఇప్పటిదాకా వచ్చినదాన్ని కొంత ధ్వంసం చేయవలసి ఉన్నది. కొంత నిర్మాణం చేయవలసి ఉన్నది. అయితే ఏది ధ్వంసం చేయాలి, ఏది నిర్మాణం చేయాలి అనేవి ముఖ్యమైన ప్రశ్నలు. ఆధునిక తెలంగాణ చరిత్ర, ఇటీవలి తెలంగాణ చరిత్ర, 1950ల నుంచీ తెలంగాణ చరిత్రనే తీసుకోండి. రాష్ట్రాల పునర్విభజన కమిషన్ నివేదిక ఆధారంగానే, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని చాలమంది రాస్తున్నారు. సి. శ్రీనివాస్ అని ఒక రచయిత ఆంధ్రప్రదేశ్ విడిపోగూడదని పుస్తకాలు రాస్తున్నారు. ఆయన ఫజల్ అలీ కమీషన్

నివేదికను పూర్తిగా తప్పుగా ఉటంకిస్తున్నారు. తెలంగాణకు వ్యతిరేకమైన ఉటంకింపులు చేస్తున్నారు. నిజంగా ఫజల్ అలీ కమిషన్ ఏమి చెప్పింది ఇప్పుడు తవ్వితీయవలసి ఉంది. కొనసాగుతున్న ప్రచారాల నిజానిజాలను వెలికితీయవలసి ఉంది. అసలు ఫజల్ అలీ నివేదిక ఎక్కడుంది? అది బహుళ ప్రచారంలో ఉందా లేదా, ఆ నివేదిక, దానికంటె ముందరి ఎస్.కె.దర్ కమిషన్ నివేదిక, ఆ తర్వాతి జస్టిస్ వాంఛూ కమిటీ నివేదిక - ఇవన్నీ ఆధునిక తెలంగాణ చరిత్రకు, లేదా తెలంగాణను కోస్తాంధ్రతో విలీనం చేసిన చరిత్రకు ముఖ్యమైన ఆకరాలు. ఇవన్నీ తవ్వితీసి, అందరికీ అందుబాటులో ఉంచాలి. వాటిమీద అన్ని కోణాలనుంచీ వ్యాఖ్యానాలు, విశ్లేషణలు రాయాలి. 1940ల నుంచీ తెలంగాణ చరిత్రలో విస్మరణకు గురయిన అంశాలు సవరించాలి.

గత ఐదు ఆరు దశాబ్దాల గురించి మాత్రమే కాదు. ఇటీవలి కాలం గురించి కూడ మనం ఇప్పటి దాకా చేయవలసిన పనులు చేయలేదు. ఉదాహరణకు కాళోజీ మ్యూజియం అవసరం గురించి నేను ఇప్పటికే రాసి ఉన్నాను. ఆయన తెలంగాణ సృష్టించిన ఒక అద్భుతం. ఆయన గురించి తరతరాలు అధ్యయనం చేయవలసి ఉంది. తెలుసుకోవలసి ఉంది. ఆయన రచనలు, ఆయన అభిప్రాయాలు, ఆయన వాడిన వస్తువులు, ఆయన చదివిన పుస్తకాలు, ఆ పుస్తకాలలో ఆయన రాసుకున్న మార్జినల్ నోట్సు మొదలయినవన్నీ సేకరించి ఒక మ్యూజియం ఏర్పాటు చేయవలసి ఉంది. అట్లాగే, 1969 ఉద్యమం ఇప్పుడు తెలంగాణ ఉద్యమంలో వెలువడుతున్నంత సాహిత్యాన్ని సృష్టించి ఉండకపోవచ్చు. కాని కనీసం ఒక డజను పుస్తకాలైనా అచ్చయ్యాయి. ఎన్నో కరపత్రాలు వచ్చాయి. పాటలు వచ్చాయి. వేలకొద్ది పత్రికా వార్తలు వచ్చాయి. అవి అందుబాటులో ఉన్నాయా? వాటన్నిటినీ ఒక చోట చేర్చి భవిష్యత్ పరిశోధన కొరకు పరిరక్షించవలసి ఉంది.

అదే విధంగా, మన ప్రయత్నం 19, 20 శతాబ్దాలకే పరిమితమా, ఇంకా వెనక్కి తీసుకుపోగలమా అని సుజాతారెడ్డి గారు అడిగిన ప్రశ్న చాలా అవసరమైనది. ఈమని శివనాగిరెడ్డి గారు ప్రాచుర్యంలోకి తెచ్చిన తెల్లాపూర్ శాసనం పద్నాలుగో శతాబ్దంలో తెలంగాణ అనే మాట వాడకంలో ఉన్నదని తెలుపుతోంది. అటువంటి ఆకరాలను ఇంకా ఎక్కువగా కనిపెట్టవలసి ఉన్నది.

తెలంగాణ చరిత్ర పునర్నిర్మాణంలో మనకు చాల ఎక్కువగా ఉపయోగపడేవి సాహిత్య ఆధారాలు. జాయపసేనాని నృత్తరత్నాకరంలో ఈ ప్రాంతపు నృత్తరీతులను వివరిస్తూ చిందు, కోలాటం, వీధిభాగవతం మొదలయిన రూపాలగురించి రాశాడు. వినుకొండ వల్లభరాయడు క్రీడాభిరామంలో

ఓరుగల్లులో జనజీవనం గురించి వివరంగా రాశాడు. అటువంటి ఆధారాలెన్నో లిఖిత సాహిత్యంలో ఉన్నాయి.

అంతకన్న ముఖ్యమైన ఆధారాలు మౌఖిక సాహిత్యంలో, గాథలలో, పాటలలో, సాంప్రదాయిక ఆచారాలలో ఉన్నాయి. ఉదాహరణకు కాకతీయ సామ్రాజ్యంలో పగిడిద్దరాజు తిరుగుబాటు గురించీ, యుద్ధం గురించీ, సమ్మక్క-సారమ్మల వీరోచిత పోరాటం గురించీ జానపద గాథలలోనే ఉన్నది. పరబ్రహ్మశాస్త్రి గారి ప్రామాణిక చరిత్ర కేవలం శాసన ఆధారంగానే పరిశీలించింది గాని ఇటువంటి ఇతర ఆధారాలను పట్టించుకోలేదు. ఇప్పటికైనా తెలంగాణ చరిత్ర గురించి రాసేటప్పుడు ఇలా విస్మరణకు గురయిన మౌఖిక, సాహిత్య ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాలి. వాటన్నిటినీ తవ్వితీసి, నమోదు చేయాలి. చరిత్ర రచనలో భాగం చేయాలి.

తెలంగాణ చరిత్ర రచనలో, పాత చరిత్ర సవరణలలో కొన్ని సమస్యలు కూడ ఉన్నాయి. పాలకుల తెలంగాణ ఉంది, పాలితుల తెలంగాణ ఉంది. ఇందులో మన చరిత్ర రచన ఎవరి తెలంగాణను గురించి రాయదలచుకున్నదనేది ముఖ్యమైన ప్రశ్న. అది ఒక్కటేనో, ఇది ఒక్కటేనో రాయడం కూడ సాధ్యం కాకపోవచ్చు. చాల సందర్భాలలో రెండూ కలగలిసి ఉండవచ్చు. రెంటి మధ్య ఐక్యత- ఘర్షణ ఉండవచ్చు. ఏ ఒక్కటీ చివరి అభిప్రాయం కాకపోవచ్చు. కాని ఈ రెండు కోణాలనూ పరిగణనలోకి తీసుకోవడం మాత్రం అత్యవసరం.

ఫజల్ అలీ కమిషన్ ముందు వచ్చిన వాదనలలో హైదరాబాదు రాజ్యాన్ని యధాతథంగా ఉంచాలనే వాదన కూడా ఒకటి. నిజంగానే ఇవాళ తెలంగాణ చరిత్రను అధ్యయనం చేసేటప్పుడు కొన్ని వందల సంవత్సరాలు తెలంగాణ జిల్లాలు కన్నడ, మరాఠీ జిల్లాలతో కలిసి ఉండిన చరిత్ర కనబడుతుంది. 1724 నుంచి 1948 దాకా ఆ సంపర్కం మరింత గాఢంగా ఉండింది. ఆ రోజుల ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక వివరాలలో ఆయా భాషా ప్రాంతాలకు సంబంధించిన వాటిని విడదీసి చూడడం కష్టం. కనుక ఆ సమస్యను కూడ ప్రస్తుత చరిత్ర రచనలో పరిష్కరించుకోవలసి ఉంటుంది.

తెలంగాణ చరిత్ర రచనలో మరొక ముఖ్యమైన సమస్య పాత వక్రీకరణలను సరిదిద్దే క్రమంలో కొత్త తప్పులు జరగడం. అది ఒక ప్రతీకార వాంఛవల్ల కావచ్చు. అతివాదంవల్ల కావచ్చు. సమన్వయపూర్వకంగా పని చేయలేకపోవడం వల్ల కావచ్చు. భావజాల చట్రాల వల్ల కావచ్చు. ఉదాహరణకు, తెలంగాణ చరిత్రలో 1942-56 చీకటి కాలం అనే ఒక విశ్లేషణను మీరు విన్నారు. ఆ

కాలంలో తెలంగాణ కమ్యూనిస్టుల ప్రభావంలోకి వచ్చి భూస్వామ్య వ్యతిరేక పోరాటం జరపడం వల్ల ఆ అభిప్రాయం వచ్చింది. కాని ఆ కాలమే తెలంగాణ చరిత్రలో ఒక ఉజ్వల శకమని నేననుకుంటాను. కమ్యూనిస్టుల వల్ల మాత్రమే కాదు, నిరక్షరాస్యులైన తెలంగాణ రైతు, కూలీ, సామాన్యులు తలెత్తి లేచి నిలిచిన కాలం అది. రాజునూ, భూస్వామినీ, అధిపతినీ, అధికారాన్నీ సామాన్యులు ఎదిరించిన కాలం అది. ప్రజల సృజన శక్తులు అత్యద్భుతంగా వికసించిన కాలం అది. యాదగిరి వంటి నిరక్షరాస్య కవి కట్టిన పాట దేశమంతా మార్మోగిన కాలం అది. అందువల్ల, చరిత్రలో ఇవాళ్టి మన అభిప్రాయాలతో చూస్తే భిన్నంగా విశ్లేషణలు తీయగల వాస్తవాలు ఉండవచ్చు. అతివాదానికి పోకుండా అన్ని వైపులనుంచీ ఆలోచించి ఒక సమ్యగు దృక్పథంతో సమగ్ర చరిత్రను రచించవలసి ఉన్నది.

ఈ క్రమంలో పాత ఆధారాలమీద కొత్త వెలుగులు ప్రసరింపజేయవచ్చు. కొత్త ఆధారాలు కనిపెట్టవచ్చు. ఏ చిన్న ఆధారానికైనా, ఇటీవలి ఆధారానికైనా పురావస్తు పరిశోధన లాంటిది అవసరం కావచ్చు. 1904లో హనుమకొండలో ఏర్పాటయిన రాజరాజ నరేంద్రాంధ్ర గ్రంథాలయం ఆనవాలు లేకుండా మాయమైపోయింది. ఇంకా శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, శబ్దానుశాసన ఆంధ్రగ్రంథాలయం వంటి కొన్ని పాత గ్రంథాలయాలు మిగిలి ఉన్నాయి. వాటిని సంరక్షించి, అక్కడ దొరికే పాత ఆధారాలను ఇప్పటికైనా నమోదు చేయవలసి ఉంది.

ప్రస్తుతం రాయవలసినది కేవలం రాజకీయ చరిత్ర మాత్రమే కాదు, ప్రతాపరెడ్డి గారు సాంఘిక చరిత్రను ఎంత విశాలార్థంలో స్వీకరించారో అంత విశాలమైన అర్థంలో అన్ని రంగాల చరిత్రను రాయవలసి ఉంది. ఆ ప్రయత్నంలో మౌఖిక చరిత్ర ఆధారాలకు చాలా ప్రాధాన్యత ఉంటుంది.

తెలంగాణ నుంచి వెలువడిన ఆత్మకథలు, జీవిత చరిత్రలు ఎక్కువగా లేకపోవచ్చు. ఇప్పకికైనా ఆ ప్రయత్నానికి పూనుకుని ఆయా వ్యక్తుల జీవిత చరిత్రలు, సాంఘిక చరిత్రతో కలగలిసి సాగే జీవిత చరిత్రలను రచించవలసి ఉన్నది. తెలంగాణ చరిత్రలో ఎన్నో ఆసక్తికరమైన, విశిష్ట అంశాలున్నాయి. అటువంటి ప్రత్యేక అంశాలమీద పరిశోధన చేయవలసి ఉన్నది. సదస్సులు, చర్చావేదికలు, సమావేశాలు నిర్వహించి తెలంగాణ చరిత్రకు సంబంధించిన ఎన్నో అంశాల మీద విశ్లేషణలు నిగ్గుదేల్చవలసి ఉన్నది. తెలంగాణ చరిత్రకు సంబంధించిన ఎన్నో పుస్తకాలు ప్రచురించవలసి ఉన్నది. తెలంగాణ చరిత్ర పరిశోధన, చర్చ, రచన ప్రధాన ప్రమేయాలుగా ఉండే పత్రికను ప్రచురించవలసి ఉన్నది. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలలో భాగంగా నీటి పారుదల ప్రాజెక్టులయాత్ర జరిగినట్టుగా, తెలంగాణలో విస్మృతికి గురయిన చారిత్రక స్థలాల యాత్ర ఒకటి నిర్వహించి, తెలంగాణ చరిత్ర పట్ల

ఆసక్తిని పెంపొందించవలసి ఉన్నది. అంతిమంగా, తెలంగాణ మీద ప్రేమతో, అభిమానంతో, తెలంగాణ చరిత్ర అధ్యయనం, పరిశోధన, రచన చేసే పరిశోధకులకూ, అభిమానులకూ ఉపయోగపడే ఒక రిసర్చి, రెఫరల్, రిపాజిటరీ సెంటర్‌ను ఏర్పాటు చేయవలసి ఉన్నది.

ఇవన్నీ ఏర్పడబోయే తెలంగాణ హిస్టరీ సొసైటీకి ఇప్పటికి మాకు తోస్తున్న కర్తవ్యాలు. ఇంతకన్న మించిన కర్తవ్యాలు ఉండవచ్చును. మీ దగ్గర విలువైన సూచనలు ఉండవచ్చును. మన అభిప్రాయాలు, ఆలోచనలు, కలబోసుకుని ఈ అవసరమైన కృషిలో మనందరమూ కలిసి ముందుకు నడవాలని, తెలంగాణ చరిత్ర రచన పునర్నిర్మాణ బాధ్యతలో అందరమూ కలిసి ముందుకుసాగాలని కోరుకుంటూ మీ అందరినీ, సగౌరవంగా, సాదరంగా ఆ కృషిలోకి ఆహ్వానిస్తున్నాను.

## Reconstruction of Telangana History

- Capt. Lingala Pandu Ranga Reddy

Indian minds could produce treatises like Vedas, Upanishads. However, they had not paid adequate attention to mundane happenings of the world. He muse of Indian History was not been presided over by Herodotus or Tacitus that's why paucity of information is the bugbear of the Indian History. However, opposite is the true of Telangana History. We have been reading the history of Telangana written by motivated linguistic chauvinist.

More often than not all these writings are aimed at depicting Telangana region in poor light and to establish Andhra supremacy. The megalomania of Andhra's is ubiquitous in every sphere of life. Recently Andhra Pradesh Legislative Secretariat brought out a booklet titled "Andhra Pradesh Legislature a Retrospect" for edification of Members of Legislative Assembly.

This is the Government of Andhra Pradesh's version of the history. Naturally after a few years even scholars, educationists, thinkers and historians would regard this version as authentic. This is the case study of the booklet :

The A.P. Assembly Secretariat is willfully disseminating distorted information by rewriting history.

Firstly in page no. 12 para 3 it mentions *"Meanwhile the State Reorganisation Commission under the chairmanship of Justice Fazal Ali submitted a report in 1955 and the Union Government has accepted the recommendation of State Reorganisation Commission Report."*

It is travesty of truth and preposterous to say this, the SRC had recommended for merger of Telangana with Andhra State. The SRC Page no. 107 para no. 386 succinctly and unequivocally avers :

*"After all these factors taken into consideration, that it will be in the interests of Andhra as well as Telangana if, for the present, the Telangana area is constituted into a separate state, which may be known as the Hyderabad state, with provision for its unification with Andhra after general elections likely to be held in or about 1961 if by two-third majority the legislature of the residuary Hyderabad state expresses itself in favour of such unification."*

Secondly another glaring falsification of history of Telangana is in page no. 12 para 4 records *"In accordance with recommendation of SRC report and keeping in view the over all support of Public the Union Government has introduced a constitutional amendment bill in the Lok Sabha to form a separate single state for Telugu speaking people by merging the Telugu speaking areas of Hyderabad state with Andhra State."*

Telangana people never wanted United Andhra Pradesh and always cherished their own Telangana state. The Government of India owing to certain constrains while accepting the SRC recommendations made two departures viz. Telangana and Vidharbha. The main reason was that if Telangana were given statehood the Nizam would continue as 'Rajpramukh as the constitutional head of truncated Hyderabad (Telangana) state, because at the time of Hyderabad state's merger with Indian Union the Government of India had given a written assurance to the Nizam that he would be the lifetime Rajpramukh. Hereditary appointments are against the republic spirit of the Indian constitution.

Page 25 para 93 of the SRC Report reads :

"i) Preservation and strengthening of the unity and security of India.
ii) Financial economic and administration considerations.
iii) Successful working of the National plan.
iv) Linguistics and cultural homogeneity."

It is pertinent to make mention that Andhra Pradesh was not formed on the linguistic basis. If it were to be formed on the linguistic basis it would have got, Ganjam, Berhampur and Parlakmidi from Orissa state, Hampi (Bellary) which was capital of Vijayanagara (Telugu people) empire from Karnataka and it would not have got Tamil speaking areas of Tirupathi from Tamilnadu. It is curious to know the Andhra Maha Sabha when it was spearheading the Andhra State movement, gave a clarion call to Andhra to boycott both English textiles and Tirupathi (As it wall Tamil temple). True, people memory is proverbially short. It is also interesting to know late P. Thimma Reddy while vociferously denuding the inclusion of Bellary in Andhra Pradesh in the Andhra Assembly at Kurnool said that Rayalaseema districts were BACKward districts.

B = for Bellary

A = for Anantapur

C = for Cuddapah, Chittor

K = for Kurnool

He also said the acronym of BACKward would be real when Bellary was included. He also said that without Bellary, Rayalaseema was without head. (Discussion of the States Re-organisation bill 4th April 1956 : Vol VI pp 431). In same vein Shri Ram Chandra Reddy M.P, while discussing SR Bill in the Lok Sabha on 24-4-1956 he forcefully demanded for the inclusion of Bellary in Andhra Pradesh. He averred that *"if Bellary is taken away, the portion of Rayalaseema will become not only still backward but also awkward"*.

Thirdly Page 12 Para 5 of the booklet *"with the enactment of the Andhra Pradesh State Act, the State of Andhra Pradesh was formed on 1st November, 1956 with Hyderabad as its capital. The emergence of Andhra Pradesh as separate state, purely on linguistic basis, is a turning point in this history of Independent India"*.

Dr. B. Gopal Reddy while answering to Andhra state's Legislative Members asserted in unequivocal terms that Andhra Pradesh was not formed on the linguistic basis. Consequently all Telugu speaking areas could not be merged in Andhra Pradesh.

Fourthly, it smacks of something like chauvinism. Here the Government of India in unequivocal terms rejected the theory of unilingual (Single) states. Jawaharlal Nehru's speech in the Lok Sabha on states Re-organisation Bill, 1956 on 10th August 1956 said, *"We do not stand for this principle of unilingualism."*

Fifthly, other glaring omissions were the very Hyderabad state's name itself and names of it's Chief Minister Sri B. Ram Krishna Rao and its Rajpramukh His Excellency Mr. Osman Ali Khan from the incumbency lists of Chief Minister and Governors. (Appendix II & III of the booklet Andhra Pradesh Legislature PP 38 & 39)

Lastly, another egregious howler in the booklet committed was in page 11 para 3 : *"The Government of India took police action in September, 1948 and placed entire Nizam state under the military rule with major J.N. Chowdhary."*

The military officer was Major General not Major and the booklet without historical hindsight informs that the Government of India had established military rule in Hyderabad. It is totally incorrect. In a democratic country there is no room for military rule. If it were a military rule why the Government of India should refer "Operation Polo" as Police Action. It is interesting to note that the cost of Operation Polo was debited to the account of Ministry of Health of Government of India.

The booklet is deliberately demolished or distorted the identity of Telangana people. It is not out place to mention that the Telangana identity is not based on either language or religion; it is based on HISTORY. In the course of history cultural characteristics and structures are different from those in the rest of Telugu speaking areas. Telanganties instead of Telugu language cherish their HISTORY and TRADITION of cultural synthesis as their identity.

The booklet is prejudicial to the best interests of history in general and Telangana people in particular. The distortion of history could stand as paradigm for much of Andhra political life.

## Telangana History Need To Connect The Loose Ends

- Rapolu Ananda Bhaskar

The word TELANGANA is thousands of years old. It means the land where Telugu is spoken. The land has civilization of thousands of years. Certain etymologists concluded that the present location, on longitude between 15degrees and 21degrees and latitude between 74 degrees and 82 degrees on Deccan plateau, is the land where Telugu was first spoken. Aboriginal Telugu words were intact till recently, among illiterate people of the remote TELANGANA, where as people of all other Telugu areas add words of other languages knowingly or unknowingly in their communication. It has to be resoundingly established that the Godavari river was called as Telivaha as in certain Buddhist scriptures. The capital of Shathavahana – Kotilingala was on the banks of Telivaha river. Telivaha means flow of white. The Kotilingala was traced on the shores of Godavari, establishing the oneness of both the words. Telangana also traces its setting on the riparian area of Telivaha i.e. Godavari.

Telangana, as Telingana, Telingane is in global historical records for the last two thousand years. Karl Marx recorded this word in this geographical setting, tracing the happenings since 11th century, in his notes on India. Decades long, wide spread, inter disciplinary, intra-disciplinary and multi disciplinary research is still to be taken up, which is possible by huge public establishments, to arrive at the full answer. **Archaeological, anthropological, geographical studies besides social, economical and administrative history of Telangana have so many loose ends.**

This land is now in emotionally surcharged to attain separate statehood. This is the urge since 1948 when it became integral part of independent India, though disputed by the then Nizam by taking the issue to the United Nations Security Council. The dispute was under debate in UNSC for decades. This land was economically sound, agrarian-rich, and thoroughly irrigated, with good transport infrastructure and trained administrative service at the time of accession. There was amity between people of different faiths.

About Telangana in modern India. The renowned historian Ramachandra Guha on November 1, 2006 published an article in THE TIMES OF INDIA, with factual distortions. He was of the understanding that Potti Sri Ramulu death in fast led to constitution of States Reorganisation Commission headed by Justice Fazal Ali and formation of Andhra Pradesh. Then he admitted the error after my raising of objection by e-mail but no correction was made to his piece. **This highlights the poverty of our historical research.**

The inland historians customarily record the handouts of some Government source without digging out the facts. Following the death of Potti Sriramulu in December 1952, Andhra state was carved out of Madras presidency in October 1953. Then on mounting demands from other areas, Union Government headed by Pandit Jawahar Lal Nehru constituted the Fazal Ali Commission, which in its 1954 recommendations suggested for separate Telangana state. There was never a proper appraisal about the dispute in UNSC. Instead there were attempts to hide the episode. **Here, historical recording is needed to give dispassionate details for the learning.**

Present war of words on Thalli. The motherhood is attributed to land only. So, we, Indians feel proud in saluting Bharatha maatha. Same with Telangana thalli. The sentimental Telangana sons of the soil are now deeply identifying with their motherland. This is part of the cultural agitation for statehood. Andhra has never unified with Telangana in these five decades. So, there can hardly be any pride about Telugu thalli and Andhra maatha. Even the sons of Rayalaseema or even Kalinga differ on this count. The motherhood is not possible to the language. Motherly feeling can certainly be there. More over Telangana is the land of origin of Telugu. **Here is the need for plenty of case studies to resoundingly establish that both these parts are far from unification socially, linguistically, culturally and encourage the decency in debate and convince the people of all lands.**

These days certain other incidents were being brought out to support their argument. One such is the Andhra Bhaasha Udyamam – language spreading struggle and activities of Andhra Maha Sabha in the erstwhile Hyderabad state. Even the armed struggle before police action is taken as example. They were never meant to be ruled by other Telugu speaking parts. Profound Arya Samaj movement has also played significant role in emancipation of this land. For all these struggles in Telangana, the activists were natives. They lost their youth, time, resources and even lives. Even the recent emergence of NT Rama Rao and his party also deserves a scan. Very many present senior leaders of his outfit in this part of the state were erstwhile activists of Telangana who even went to jail. **All this chronology needs a deeper evaluation to set the record right.**

There is a long way to go.

· In these movement days, if we are able to inculcate and to some extent, record the stray details, the coming generations may go bit deeper into subject.

· Besides, it is also needed to build interaction with the world and national History research councils and faculties of various Universities and learning centres to encourage our topics and to provide input to them to set the record right.

· Evaluation is required for correction of certain misconceptions, so as to feed the facts to the learners.

· Minute historical incidents and excavations shall be compiled into book form to encourage scientific research, for which locals and natives of the particular places shall be involved.

· It shall be a priority to feed on to the web through own and other history sites, the present data.

· It is also of great need to frequently congregate the historians and other experts under the aegis of various academic institutions to spread our message and to encourage research.

This will enhance the awareness among present generation, as it is struggle time.

## జూన్ 4, 2006, తెలంగాణ హిస్టరీ సొసైటీ సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

1. జి. వెంకటరామారావు - ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, చరిత్రకారులు
2. దేవులపల్లి అజయ్ - సంపాదకుడు, ప్రజాతంత్ర
3. ఎన్. వేణుగోపాల్ - సంపాదకుడు, వీక్షణం
4. సంగిశెట్టి శ్రీనివాస్ - పరిశోధకుడు
5. నోముల సత్యనారాయణ - రిటైర్డ్ ఇంగ్లీష్ లెక్చరర్
6. కె. జితేంద్రబాబు - న్యాయవాది, చరిత్ర పరిశోధకులు
7. మలయశ్రీ - రిటైర్డ్ తెలుగు లెక్చరర్
8. ముదిగంటి సుజాతారెడ్డి - రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు
9. కె. పెంటారెడ్డి - ఇంజనీర్
10. డి. పాండురంగారెడ్డి - ఇంజనీర్
11. బి.ఎన్. యాదగిరి - రిటైర్డ్ - ప్రభుత్వోద్యోగి
12. కెప్టెన్ లింగాల పాండురంగారెడ్డి - మాజీ సైనిక అధికారి
13. కె. శ్రీనివాస్ - జర్నలిస్ట్
14. టి. వివేక్ - ప్రభుత్వ ఉద్యోగి
15. పి. లోకేశ్వర్ - రచయిత - ప్రభుత్వ ఉద్యోగి
16. శ్రీధర్ దేశ్‌పాండే - రచయిత - ప్రభుత్వ ఉద్యోగి
17. జి.ఎల్.ఎన్. మూర్తి - జర్నలిస్ట్
18. ఆర్. శ్రీనివాసరావు
19. హరినాథ్ పొలాస - ప్రొఫెసర్
20. డా. జి. బాలశ్రీనివాసమూర్తి - తెలుగు లెక్చరర్
21. రాపోలు ఆనందభాస్కర్ - సీనియర్ జర్నలిస్ట్
22. డా. నాళేశ్వరం శంకరం - తెలుగు లెక్చరర్, కవి
23. ప్రొఫెసర్ కె. మధుసూదన్‌రెడ్డి - రాజనీతిశాస్త్రవేత్త
24. డా. జి. లక్ష్మణ్ - ప్రొఫెసర్, ఉస్మానియా యూనివర్సిటి
25. స్కైబాబా - రచయిత
26. జె. సుభద్ర - రచయిత

27. కందుకూరి శ్రీరాములు - కవి
28. వజ్జల శివకుమార్ - కవి
29. సి. రవిసుందర్
30. తిప్పారెడ్డి - రిటైర్డ్ ప్రొఫెసర్, ఉస్మానియా యూనివర్సిటి
31. కాసుల ప్రతాపరెడ్డి - జర్నలిస్ట్
32. కె. వెంకటేశ్వర్లు - జర్నలిస్ట్
33. కె. విశ్వనాథన్ - రిటైర్డ్ ఉద్యోగి
34. జి. శశికళ - టీచర్
35. చిన్న సోమన్న - హిస్టరీ లెక్టరర్
36. సంపత్‌కుమార్
37. ఎం. వేణుగోపాల్ - మెడికల్ ఆఫీసర్
38. డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి - తెలుగు లెక్చరర్
39. డా. ఘంటా చక్రపాణి - ప్రొఫెసర్, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటి
40. చెన్నమరాజు హరినాథ్ - ప్రభుత్వ ఉద్యోగి